
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు
8-12-'54

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKL



ఢిల్లీ, కుతుబ్ మినార్ పై నుండి కనబడే దృశ్యం

—ఫొటో: సి. సీతారాం, మద్రాసు.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 15
8-12-54

జయ మార్గశీర్ష శుద్ధ త్రయోదశి బుధవారం



క్షణంలో సగం

విషయానుక్రమణిక

కాలక్షేపం

జననీ మేదినీ! తాత మారుత!
వయస్యా వహ్నీ! చుట్టంబ జీ
వనమా! సోదర తారకాపథమ!
భవత్ప్రేమ సంధిల్ల మీ
కొనరింతున్ బరమ ప్రణామములు:-
భవదోగ్యగ స్ఫురత్పుణ్య సం
జనిత జ్ఞాన నిరస్త మోహ తతినై
సద్బ్రహ్మముం బొందెదన్.

తా॥ అమ్మా భూదేవీ! తండ్రీ వాయుదేవుడా! ఆప్తమిత్రుడైన అగ్నిహోత్రుడా! ఆప్తబంధువగు ఉదకమా! అన్నా ఆకాశమా! నా హృదయపూర్వకమైన ప్రేమభావముతో మీకు ఇదే నా తుది నమస్కారమును చేయుచున్నాను. మీతో కూడియుండడమనెడి పుణ్యమువల్ల కలిగిన జ్ఞానముచేత, విడిపోయిన మోహపాశములు కలవాడనై, (అనగా నిర్మోహత్వమును పొందినవాడనై) పరబ్రహ్మమును పొందుచున్నాను.

"మాతా నాస్తి, పితా నాస్తి, నాస్తి బంధు సహోదరః" అని మొట్టమొదట నిర్ణయించి, "తల్లి లేదు, తండ్రి లేదు, బంధువులు లేరు, సహోదరులు లేరు" వీరందరూ మనకు మోహపాశమును వృద్ధిచేసి యీ సంసారకూపంలో బంధించి పడవేసేటటువంటివారే గాని, మనకు ముక్తిని చూపించేటటువంటివాళ్లు కారు అని నిశ్చయించి, ఇక యింట్లో ఉంటే మనం బాగుపడే ఆశ లేదన్నట్లుగా, యిల్లు విడిచి ఆస్పత్రిలో చేరినవిధంగా, ఆత్మశాంతి కోరినటువంటి వాళ్లున్నూ, ఆత్మపరిపక్వము కోరినటువంటివాళ్లున్నూ, యిల్లు వాకిలి విడిచి, చెట్టుల గుట్టులపాలై, అక్కడ ఆకులు దుంపలు తిని, తిండి లేక, ఎండ కెండి, వానకు తడిసి, తపస్సుచేశారు. బుద్ధుడు చేసిన పని ఏమిటి? అర్ధరాత్రివేళ అర్ధాంగి నిద్రపోతూ ఉంటే శయనమందిరంనుంచి పయనమై, వాడ వీడు వీడి 'అడవిలోనే ఉంది ఆత్మశాంతి' అన్నట్లుగా అంతర్ధానమై పోయినాడు. అయితే, ఒక ధర్మసందేహం అటువంటి ధర్మసంస్థాపకుల విషయములో కలుగక మానదు.

తన ఆత్మపరిపక్వం కోసం తాను అంతఃపురం విడిచి అడవులపాలైనటువంటివాడు, బోధివృక్షం క్రింద ఘోరమైన తపస్సుచేసి, జ్ఞానప్రబోధం పొంది, "హా! తెలిసెన్!" అన్నటువంటివాడు, "తారక మంత్రము కోరిన దొరకెను ధన్యుడనైతినిగా!" అని ఆనందపరవశుడైనటువంటివాడు, అక్కడనే ఉండలేకపోయినాడా? తిరిగీ యీ యమయాతనా ప్రపంచములోనికి వచ్చి, యీ జనసమ్మర్దన సంభరిత మహానగర మోటారు హారన్ గర్జనల నడిబజారులోకి వచ్చి, యీ కాఫీహోటళ్ల రేడియోల పాడుగోలలోనికి పనిఉన్నట్లుగా వచ్చి, "వినుడొక ధర్మసూత్రమును, వీనుల కింపు దలిర్పగా" అని బోధిస్తూ, శిష్యులను కొందరిని పటాలానికి రిక్రూటు చేసినట్లుగా చేర్చుకొనుచూ, ఈ శిష్యులకందరికీ ఒక ధర్మోపదేశ ధర్మపాఠశాల లాగున ఆశ్రమం ఏర్పాటుచేసి, దానినొక పీఠంగా, సంస్థగా, సంస్థానంగా, సంస్థాపించి నిద్రాహారాలు లేకుండా నిర్వహిస్తూ, యీ ఆశ్రమంలోని శిష్యులందరూ తన శిక్షణలో మేరమీరక, తీరు తప్పక, ప్రవర్తిస్తున్నారో లేదో, ఒక కంట కనిపెట్టి చూస్తూ, స్వంత కమతం కోసం సాగించినంత కార్యానా సాగించినట్టయితే, తిరిగీ ఈ ప్రపంచ బందిఖానాలోనికి వచ్చినట్లే అవుతున్నదా? లేదా?—"బ్రతుకుదిరింది రోకలి తలకు చుట్టండి" అని పూర్వమొక అపూర్వ బుద్ధిమంతుడు ("అ" అనే అక్షరం పూర్వమందుగల బుద్ధిమంతుడు అనగా అబుద్ధిమంతుడు) అన్నాడుట.

సర్వసంగ పరిత్యాగంచేసిన తపశ్శాలికి తిరిగి యీ తాపత్రయం అంతా ఎందుకు? లోకం తరించలేదనెడి దరిలేని పరివేదన ఎందుకు? లోకాన్ని మరమ్మతు చేయడం,

ఒక మనిషికి సాధ్యమేనా? చవుడుపట్టిన గోడకు పాటిమన్ను తెచ్చి ఏపాటిగా అంటు బూసినప్పటికీ, ఆ చవుడుపట్టిన గోడనుండి ఆ మన్ను తిరిగీ క్రిందకు రాలిపోయి, యధాస్థితికి వస్తుంది. "యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత!" అనేమాట వెర్రిమాట కాదు "ఎప్పుడెప్పుడు ధర్మమునకు కళంకము ఏర్పడుతుందో" అని భగవద్గీతలో భగవాన్ ఉవాచ (చెప్పెను). వాచీ రిపెయిర్ వంటిదే యీ ఉవాచ ప్రవచనం కూడా. గడియారం చెడినప్పుడెల్ల మరమ్మతు చేయించాలి అంటే ఏమిటి? "ఈ ప్రపంచంలో ధర్మమునకు ఉండి ఉండి త్రుప్పుపడుతూ ఉంటుంది అనేమాట నిశ్చయం. రాగిచెంబుకు ప్రతిరోజూ చిలుము పట్టుతూ ఉంటుంది దానిని ప్రతిరోజూ రవ్వంత చింతపండుతోను వెలిబూడిదతోను తోముతూఉంటే మెరుగెక్కి ప్రకాశిస్తూ ఉంటుంది. కాని, తిరిగీ చిలుమెక్కుతుంది - తిరిగీ మరునాడు తోమక తప్పదు. నేడుదయము సేఫ్టీరేజరుతో గడ్డం నున్నగా క్షవరంచేసికొంటే, అంతటితో ఆ గడ్డానికి శాశ్వత ఫయిసలాయితీ (పర్మనెంటు సెటిల్మెంటు) అయినట్లేనా? కారన్వాలీసు 1802 సం||లో పర్మనెంటు సెటిల్మెంటు చేసిన జమీందారీల నన్నింటిని తిరిగి ఫయిసల్ చేయడానికీ, రద్దుచేయడానికీ యీనాడు ప్రభుత్వం పూనుకొని, రోమనాశని మందు ప్రయోగించినట్లుగా భూస్వామ్యసంస్కరణం చేసి, ఒకవిధమైన స్థిరపరిష్కారం చేస్తోంది ఈనాందార్, అగ్రహారాందార్, శ్రోత్రియందార్, మిట్టాదార్, జాగీర్దార్, ముఖాసాదార్ వగైరా దారులన్నీ ఉండడానికి వీలులేదు ఖబర్దార్! అన్నారు మన ప్రభుత్వం - అయితే, యీ తత్వం మన ప్రభుత్వానికి ఎక్కడినుంచి సంక్రమించింది? ధనస్వాములను భూస్వాములను సరియైనదారిలోనికి తీసికొనిరావలెననే ఉద్దేశంతో జమీందారీలను రద్దు చేసినామని ముద్దుముద్దుగా అన్నారు ఇదంతా మాస్కోనుంచి వీచిన కమ్యూనిస్టు గాలి ప్రభావం అన్నారు. మొత్తంమీద కమ్యూనిస్టుభావం అందులో ఉంది . .

ఏమైనప్పటికీ, జమీందారులుపోయినా, జమీ గ్రామాలు ఎక్కడికీపోలేదు. ఎక్కడ ఉండవలసినగ్రామాలు అక్కడేఉన్నాయి. అయితే, జమీందార్లందరూ ఏమైనారు? ఏమిచేస్తున్నారు? దివాణాలూ దివ్యమందిరాలూ విడిచి, తీర్థయాత్రలు చేసుకుంటున్నారా! అంతఃపురాలు విడిచి, అడవులలో తపస్సు చేయడానికి వెళ్ళినారా! అటువంటిది అసంభవం - అవతారంమాత్రం మారుతుంది జమీందారీలకు సర్కారు యిచ్చిన పైకంతో, భూస్వామి అవతారం పోయి ధనస్వామి అవతారం వస్తుంది. ఆ ద్రవ్యంతో దివ్యమైన వ్యాపార వాణిజ్య పరిశ్రమలు సాగించవచ్చు - . యంత్రాగారం తిరుగుతూఉంటే లక్ష్మీపుత్రుడు (కాదు - శ్రీకాంతుడు) "శాంతాకారం భుజగశయనం" అన్నట్లుగా పాలసముద్రం మీద శేష శయనంమీద లక్ష్మీదేవి తన పాదము లొత్తుచుండగా, అరువు బేరం కూడా క్యాష్ బేరం చేసి గల్లాపెట్టె నింపిన సాహుకారులాగున, పవ్వళిస్తాడు. "పవ్వళించరా! పాండురంగ!" అనే పాట ఆసమయంలో శ్రీదేవి పాడకపోయినా ప్రక్కనున్న గ్రామఫోనులో గాని, రేడియోలో గాని కర్ణానందంగా వినిపించవచ్చు అందుకనే శ్రీమహావిష్ణువు తనకు శ్రీదేవియున్నూ, భూదేవియున్నూ ఇద్దరు ధర్మపత్నులుండవలెనని కలువరించి చాలా దూరం యోచించి వరించాడు. కాని, యీ కాలంలో ఒక్క మొగవానికి ఇద్దరు భార్యలు ఉండడానికి వీలులేదని క్షేత్రాధిపత్యపు కంట్రోలువలెనే ద్వితీయద్వయం నిషేధించారు. (ద్వితీయ అంటేనే భార్య గనుక, ద్వితీయద్వయం అనవసరప్రయోగం అన్నారు.) క్షేత్రం అంటే కూడా భార్య అని అన్వయిస్తుంది కనుక, "భూమి" అనే క్షేత్రం స్వామికి ఉండకూడదనే సూత్రం లోకానికి, దేశానికి మంగళసూత్రం అన్నారు. అందువల్ల జమీందార్ ఇప్పుడు కేవలం "శ్రీనర్" అయినాడు. చక్కెర ఫ్యాక్టరీలు పెట్టుకోవచ్చు. సిమెంటు ఫ్యాక్టరీలు కట్టుకోవచ్చు భూమితో పని లేకుండా నేలవిడిచి సాముచేయవచ్చు.

అటువంటివాళ్ళకు గ్రామాలతో పని లేదు. వారు నగరాలలోనే చేరుతారు. వారు రోడ్లమీదనే తిరుగుతారు వారి భూములు రైతులకు స్వాధీనమైనాయి గనుక, రైతుల కక్కడ చేతులనిండాపని ఉంది. కాని, కేవలం చేతిపనులవల్ల జీవించేవాళ్లకు మాత్రం చేతినిండా పనులు లేకుండా పోతున్నాయి. యంత్రాగారాలలో వస్త్రములు తయారు అవుతూఉంటే, చేతిమగ్గములమీద చేతి గుమాస్తాకూడా చేయుటకు వీలులేని స్థితివస్తే, చేనేత పనివాండ్ల చేతులు విరుగగొట్టినట్లే అవుతుంది. ఆ యంత్రాల మధ్య పడి, వారి చేతులు నలిగి, వారి పడుగు అణగద్రొక్కబడి, వారి పేక పీకనొక్కబడినట్లవుతుంది. చేతికి పని లేకపోతే కాలికి బుద్ధిచెప్పవలసినదే. కుటీర పరిశ్రమలు పోతే, వాళ్లకు కుటీరం మాత్రం ఎట్లాఉంటుంది. పనిలేదు, పాటులేదు అంటే కూడులేదు, గుడ్డలేదు. ఉండడానికి గూడులేదు. ఒక్కొక్క గూడెం, గుండె ఆగిపోయినట్లుగా, మగ్గంలో కండె ఆగిపోయినట్లుగా, నిలువ నీడలేక నలువైపులకు చెల్లాచెదరైపోతుంది.

ఈ రీతిగా గ్రామపరిశ్రమల జీవించు కర్మకారులు గ్రామాలు విడిచి పరిశ్రమల పాలై నగరాలు చేరక తప్పదు. అక్కడ ఫ్యాక్టరీలలో కార్మికులగుట వారి కర్మమా? చేతిపనుల కర్మమా? యుగధర్మమా? - కాని, ఇది దేశకర్మమని కరంచంద్ గాంధీ అన్నాడు. ఏమిటి కారణం? అదే గాంధీ పురాణం.

కోట్లకొలది జనానికి మిల్లులూ, ఫ్యాక్టరీలు పనిచూపించలేవు. ఫ్యాక్టరీలు వృద్ధి అయ్యేదెప్పుడోగాని, ప్రస్తుతం నిరుద్యోగుల సంఖ్య వృద్ధియైనది. ఫ్యాక్టరీల ఖామందులు అందుకు మందు వెయ్యలేరు. వారి స్వలాభాపేక్షలో స్వదేశాభిమానం స్వాహా అవుతుంది. ఫ్యాక్టరీలు పెరిగి పెంపొందిన కొలదీ యంత్రాల రణగుణధ్వనితో ఫ్యాక్టరీ గొట్టాల పొగతో దుర్గంధములతో, మహానగరాలు మహా నరకాలు అవుతాయి. పీల్చడానికి పరిశుద్ధమైన గాలి కరవైపోతుంది ఆకాశంకూడా ఫ్యాక్టరీల పొగతోను, దూం ధాం అన్నట్లుగా ఉంటుంది. విమానాల ఝుంకారానికి విరామం ఉండదు. నేలమీద తిరిగినా తల తిరిగిపోయే జనసమ్మర్దన - క్షణక్షణ గండములతో గుండె లరచేతబట్టి మోటారు బండ్లను తప్పించుకొని, ప్రాణం దక్కించుకొని తిరగాలి కుళాయిలో నీళ్లు వస్తేనే కూడుగాని కూరగాని ఉడుకుతుంది ఇల్లాలు గుడ్డ ఉతుకుతుంది కోరినంత బావినీరు తోడుకొని, "కూపోదక స్నానమహం కరిష్యే" అని సావధానంగా స్నానంచేసి పానంచేయ వీలైన సదుపాయంలేదు జీవనం అంటేనే ఉదకం అని అన్వయించిన పరిస్థితిలో స్వతంత్ర జీవనోపాధిలేక నగరం చేరిన జీవులకు జీవనం బరువైంది; జీవనం కరువైంది అని చెప్పకతప్పదు

మహానగరంలో చేరినపిమ్మట కట్టెలు కొనుక్కోవలసిందే - బొగ్గులు కొనుక్కోవలసిందే - తృణకాష్ఠ జల సమృద్ధిగల చోటనే నియమనిష్ఠగలవాడు నివసించడం యుక్తమని ఆర్యోక్తి ఒకటి ఉంది. పశువులకు తృణసమృద్ధి ఉండాలి అగ్నిహోత్రానికి చుట్టుప్రక్కల చిట్టడవి అయినా ఉండాలి "ఎప్పుడు గెడ తెగక పారు నేరు" ఉంటే జలసమృద్ధి ఉంటుంది. అటువంటి ప్రదేశాలను వేదశాస్త్ర పారంగతులైన ద్విజులకు అగ్రహారాలుగా యిచ్చి ఒకప్పుడు ప్రభువులు పోషించారు. పోషింపబడినది వేదపండితుడుకాదు-ఆర్య

★ కాలక్షేపం ★

ధర్మము పోషింపబడినది-కాని, ఆర్యధర్మం శిరోధార్యము కానప్పుడు, అగ్రహారం సంహారంకోసం సత్యాగ్రహం సాగించడం సవ్యమేగాని అపసవ్యం కాదు, "ఆర్య ధర్మం ఆర్యధర్మం" అని అహోరాత్రాలు జపించి, తపించి తపస్సు చేసినవారి పేర్ల కూడా జపించి స్మరించవలసిన సందర్భం లేదు. వారి దర్భాసనములకుకూడా సందర్భావసరము లేదు. వారి కుశాసనములను పరచిన అగ్రహారములను కూకటి వేళ్ళతో పెరికివేయగల్గిన శాసనములే కుశాసనములై విస్తరించి వర్తించుచున్నవి.

జ్ఞానం కోసం, ధర్మం కోసం, బోధివృక్షంక్రింద గయలో వజ్రాసనం మీద కఠోరమైన తపస్సుచేసిన బుద్ధుని మహిమవల్ల అనేక ఆరామాలు ఏర్పాటు అయినాయి. బౌద్ధధర్మం విరామంలేకుండా యీ ఆరామాల మూలంగా దేశమంతటా విహారంచేసింది. కాని, ఆరామాలు పాడుపడిన గ్రామాలైనాయి. నామాలు రూపాలులేకుండా వట్టి మట్టిదిబ్బలైనాయి. పేరు గొప్ప మిగిలినా, ఊరు దిబ్బఅయింది. ఆజ్యం లేని అఖండ జ్యోతివలె, అగ్రజుల విద్యలూ, అగ్రహారాలు అడుగంటిపోయినాయి. ఈనాటి నవ నాగరిక ప్రపంచ యంత్రయుగ ధర్మమే మధ్యతరగతుల మిథ్యాజీవితమునకు బాధ్యత వహింపవలసినదనుట తథ్యము. ఇట్టివారు గ్రామాలు ఖాళీచేశారు. నగరాలలో నలిగిపోతున్నారు.

నగర జీవితంలో బ్రహ్మానంద పదవిని పొందలేక, పల్లెలకు పోవ మనసొల్లక తమ గ్రామసీమలకొక నమస్కారం చేస్తారు. "అమ్మా! భూదేవీ! నీకొక నమస్కారం!" అంటారు. పల్లెసీమ చల్లని పైరుగాలి పీల్చినది ఏనాడో కదా! అటువంటి గాలికొక నమస్కారంచేసి నగరం చేరినాము. కట్టెలు కొనవలసిన కష్టదురవస్థ యీ పట్టణంలో పట్టింది. గ్రామసీమ వెన్నెల బయలు సుఖం ఎన్నడో విడనాడి వచ్చాము. ఆ అవకాశం ఆ ఆకాశం ఇక్కడ లేదు. కావులు అభావమైన నగరం చేరి కుళాయీల పోతనీటి ధారతో జీవనం చేస్తున్నాము.

"జననీ మేదిని! తాత మారుతి!
వయస్యా వహ్నీ! చుట్టంబజీ
వనమా! సోదర తారకాపథమ!
భవ్యప్రేమ సంధిల్ల మీ
కొనరింతున్ చరమప్రణామము."

ఈ విధంగా నమస్కారం చేయగల్గినప్పుడే అసలైన జ్ఞానప్రబోధం- ఆ విధంగా నమస్కారం చేయగల జ్ఞాని ఎప్పటికైనా

"భవద్యోగ స్ఫురత్పుణ్య సం
జనిత జ్ఞాననిరస్త మోహ మతినై
సద్బ్రహ్మము బొందెదన్."

అని బాహాటంగా చాటించగలడు.

నియమనిష్ఠాగరిష్ఠులు, జితేంద్రియులు, నిర్మల ధర్మకర్మ దీక్షాపరతంత్రులు, జ్ఞానధనులు, వేదవిదులు, సకలశాస్త్ర పారంగతులు, అనల్పశిల్పులు, సంగీత సాహిత్య భరత నాట్యాభినయ చతురులు, కర్మకారులు, సకల కళాప్రవీణులు, పల్లెటూళ్లలో కల్లకపట మెఱుగక సుఖజీవనము చేసిన కాలము విలువ పాడినట్లు గడచిపోయినది. ఆనాడు గ్రామసీమ సుజన భజనమందిరమై, మహాత్ములకు ఆత్మనివాసమై ఉండెడిది. 'అచట బుట్టిన చిగురుకొమ్మైన చేవ' యని వాసి గాంచిన పల్లెటూళ్లు, నేడు కష్టులకు అతిశయపాత్రలై, సమష్టి కుటుంబసహిత సంఘ సహకార సమహితత్వ సమాదరణాభిమాన భావశూన్యమై, కమలములులేని కాసారమువలె, శశిలేని నిశివలె, పతిలేని సతివలె, జీవము లేని కాయమువలె, సారమరిగిన రామసాగరముల మరబియ్యమువలె, నిస్సారమై, నిస్తేజమై, నిర్మలాత్ములకు, నీతివర్తనులకు, నిలువ నీడనిచ్చుటలేదు. అట్టి గ్రామసీమలకొక తుది నమస్కారమును చేసి సంస్కారులు, సత్పురుషులు, సకుటుంబముగా నిష్క్రమించారు. "భూదేవీ! నీ కొక నమస్కార"మని తమ సర్వమాన్యములు సర్వధాన్యములు శూన్యములైన మాన్యులు మనుగడకై మహానగరములు చేరిరి.

"......యీ గతిన్,
జగదుపకార జీవనులు,
సాధుజనాళి, కుశాసనాలతో,
నగర నివాసులైరి యని-నన్
నగరే, పగవారు విన్నచోన్?"

లోకానికి ముక్తిమార్గం చూపగల్గినవాళ్లు భుక్తికోసం చేరారు 'మహానగరే' అన్నచో, నగరే పగవారు విన్నచోన్? నగరే? అని శంకించనక్కరలేదు. తప్పకుండా నవ్వుతారు—మన గ్రామాల దుస్థితిచూచి మనమే నవ్వుకోవాలి. "హాలముపట్టి పొలముదున్నినవానిదే పొలము" అని శాసించితే, కలము పట్టినవానికి స్థలములేదు స్వగ్రామములో— భూదేవికొక నమస్కారముచేసి, సంస్కారులు, కర్మకారులు, వికారులై, తావు టికాణాలేక, "కాం నహీ, మకాం నహీ" అని నిష్క్రమించుచున్నారు. "ఈజన్మ మిక దుర్భరమురా! రామయ్య తండ్రీ! ఈజన్మ మిక దుర్భరమురా!" అని చిత్తము చ్యుతుమీదజేర్చి నెత్తిమీద గుడ్డవేసికొని, నిష్క్రమించుచున్నారు. గ్రామాలకు కూడా నెత్తిమీద ముసుగు పొసగుటకీ దొసగు చాలును. ★

గ్రంథస్వీకారం

మణిదీపిక

"మణిదీపిక" అనేది శ్రీ పిలకా గణపతిశాస్త్రిగారు రచించిన కావ్యం. ఇది 24 పుటలు గల చిన్న గ్రంథం. కాని, చిన్నెలు వన్నెలు గల దీపకాంతులవంటి పద్యములు 94 ఇందులో ఉన్నవి. జగజ్జననియే శ్రీ గణపతిశాస్త్రిగారు ఉపాసన చేసిన దైవం - ఆమెను ఆయన స్మరించి, ధ్యానించి "ధన్యోస్మి" అన్నట్లుగా తన్మయులై చెప్పిన పద్యరాజము లివి యనుటకు సందేహము లేదు...

"............... జగ
జ్జనని! కనుంగవల్ చలువజల్లులదేల
నిలం జ్వలింపుమా!"

అని ప్రార్థించారు.

"పలికించెడివాడు రామభద్రుండట" అని పోతన్నగారు చెప్పినట్లుగా, శ్రీ శాస్త్రిగారు కూడా "తల్లీ నిన్ను దలంచి" వ్రాయగల పద్యశ్రేణి మోక్షప్రదం అన్నట్లుగా వ్రాసినారు.

"జగదాశామణిదీపికా! జనని!
..............., ...
......యున్మత్తుండనై యాడెదన్."

అనే పద్యమందు మానవహృదయానికి దారి చూపగల్గిన జగజ్జననియే మణిదీపిక యని చాలా పరవశత్వంతో వ్రాశారు. ఈ కవి బాహ్యప్రపంచ తత్వపరిశీలన ఎంత నిర్మొగమాటంగా చేసినాడో, ఆత్మపరిశీలన కూడా అంత తీవ్రంగా చేశాడు. మహానగరవాస నవనాగరికత అవకతవకను కరతలామలకంగా కొన్ని పద్యాలలో చూపించారు.

శ్రీ శారదాదేవి శతవార్షికోత్సవ శుభ సందర్భమున వెల్లడింపబడిన సద్గ్రంథం ఇది. వెల అర్ధరూపాయి మాత్రమే. ప్రతులు కావాలంటే,

శ్రీ రామకృష్ణమఠము, రాజమహేంద్రవరము. (తూ॥ గోదావరి జిల్లా) అని వ్రాయాలి. "వామన"

హనోయ్ విశేషాలు: 5

10. వియట్‌నామ్‌లో పెళ్ళిళ్లు

పూర్వపు రోజుల్లో, మన దేశంలో లాగే యీ దేశంలోకూడా పిల్లల తల్లిదండ్రులు తగిన సంబంధాలు చూసెడం పెళ్ళిచెయ్యడం ఆచారం. కాని యీ ఆచారం యిప్పుడు చాలా మారిపోయింది. లోగడ మనవిచేసినట్టు, పిల్లగల ఆసామీ పెళ్ళిగురించి ఆరాటపడ నక్కర్లేదు. ఈ రోజుల్లో వరుడే వధువుని యెన్నుకుంటాడు. స్త్రీలకి చాలా స్వాతంత్ర్యం ఉండడంమూలాన్ని కచేరీల్లోనూ అక్కడా యిక్కడా మనుషులు సన్నిహితులు కావడానికి ఎక్కువ అవకాశం ఆదిలో పరిచయం, తరవాత స్నేహం, ఆపైని ప్రేమించుకోవడం—యీ ప్రాతిపదిక దురూహ్యం కాదు కాగా, అటువంటి పరిస్థితి ఏర్పడి, కొంత ముదిరిన తరవాత, పిల్ల తన తల్లిదండ్రులతో చెబుతుంది, "ఫలానా ఆసామీ నన్ను పెళ్ళిచేసుకుంటా నంటున్నాడు. నాకూ అతనికీ మనసూ మనసూ కలిసింది" అని అర్థం వొచ్చేటట్టు. ఆ తరవాత పిల్ల తల్లిదండ్రులు, పిల్లాడి తల్లిదండ్రులు తాలూకు స్నేహితులు యెవరా అని వెతికిపట్టుకుని, వాళ్లద్వారా కొంత సి. ఐ. డి చర్య జరిపించి పిల్లవాడి భోగట్టా యావత్తూ ఆరా తీస్తారు. అది అయిం తరవాత ఓసారి లాంఛనంగా పిల్లవాణ్ని వాళ్ల యింటికి పిలిపించి, అతను చేస్తున్న ఉద్యోగం, అతనికి ఉండే ఆశయాలూ, అభిరుచులూ, ఆర్థికస్తోమతా, మంచీ చెడ్డా అంతా డెబ్భైపుంజీల ప్రశ్నలు వేస్తారు.* వాటికి తట్టుకున్నవాడు ఘనుడే! అబద్ధం కనక ఆడితే—ఎంత చక్కగా అబద్ధం ఆడినాసరే—యిట్టే పట్టేసి, ఇహ ఒహాటే ప్రొసిగ్గామిసేవను!! ఆయం విశేషః ఏంవిటీ అంటే, ఈప్రశ్న పరీక్షలో గనక ఏమాత్రం అబద్ధం ఆడేడని తోచినా, ముసలాళ్లమాట అలా ఉంచి, పిల్ల మళ్ళీ ఆ మనిషిని కన్నెత్తి చూడదుట! ఆ సందర్భంలో అబద్ధం ఆడితే అంత అవమానం ఆడపిల్లకి!!

ఇదంతా జరిగి సత్యం అని తోస్తే ఆ పెళ్లి జరుగుతుంది. లేకపోతే జరగడానికి వీల్లేదు. తల్లిదండ్రులమాట తోసిపారేసి, "లవ్ మారేజెస్" అంటూ చేసుకున్నవాళ్లు లేకపోలేదుగాని, ఎవరినోటంట విన్నా అలాంటివి సుఖంగా పరిణమించలేదన్న మాటే.

సరే. ఇంటర్‌వ్యూలో నెగ్గి పెళ్లి స్థిర పడింది అనుకుందాం. ఇహ పైముచ్చటా,

క్రొవ్విడి లక్ష్మన్న

తతంగంన్నూ. వధూవరుల తల్లిదండ్రులు కలిసి ఆలోచించుకుని, పంచాంగం చూపించుకుని మంచి రోజు ఒకటి చూసుకుంటారు. ఆనాడు పెళ్లికూతుర్ని చూడడం అన్నమాట వరుడి తల్లిదండ్రులు. అయితే "యిదే మా అమ్మాయి, పెళ్లికూతురు" అని చెప్పరు. పెళ్లికూతురుకి వొల్లమాలిన సిగ్గూ, మరి! అంచేత "కాస్త టీ అందుకో అమ్మా" అనో "తాంబూలాల పళ్లెం యిలా పట్టుకర"మ్మనో పురమాయిస్తారు. ఈనాటి వేడుకకి "చాంగో" అని అంటారు. అంటే పెళ్లి చూపులు.

పిల్ల బావుందీ నచ్చిందీ అనుకుంటే తరవాత ఘట్టం ప్రధానం (ది అన్ హోయ్). దీనికి మళ్ళీ పంచాంగం చూపించుకుని (పంచాంగం అంటే చైనా పంచాంగమే), మంచిరోజు నిర్ణయించుకుని మొగపెళ్ళివారు లాంఛనంగా వెళతారు పెళ్లికూతురు యింటికి. ప్రధానసమయంలో యిచ్చే వొసువులు టీ ఆకూ, కేకులూ, తమలపాకులూ చెక్కలున్నూ. (పళ్లు పట్టి కొళ్లరు). ఈ వొస్తువుల కిమ్మత్తు సామాన్యంగా 50,000 పియాస్ట్రిలకి తక్కువ ఉండదంటే, వొస్తువులు ఏ స్కేల్లో ఉంటాయో ఊహించుకోవచ్చు. ప్రధానంనాడు పెళ్లికూతురు తన స్నేహితులందర్నీ పిలిచి టీపార్టీయో, డిన్నరో యివ్వాలి. ఆవేళ గనక పొరపాటున ఎవరినయినా పిలవడం మరిచిపోతే, పెళ్లి అయింతరవాత యిహ కాళ్లా వేళ్లా పడి బతిమాలినా మరి ఆ పిల్ల గుమ్మం తొక్కరు స్నేహితులు. ప్రధానం అయినతరవాత కొద్దిరోజుల్లోనే పెళ్లి అవాలన్న నిర్బంధం ఏమీ లేదు. ప్రధానానికీ పెళ్ళికీ కొద్దిరోజులు మొదలుకుని కొన్ని యేళ్ళదాకా వ్యవధి ఉండొచ్చు ఈ మధ్యలో పెళ్లికూతురూ, పెళ్లికొడుకూ కలిసి సినీమాలకీ, స్నేహితుల యిళ్లకీ, మీటింగులకీ వాటికీ వెళ్ళవొచ్చు; పెళ్లికొడుకు పెళ్లికూతురు యింటికి నిత్యమ్పూ వొచ్చి కబుర్లు చెప్పుకోవచ్చు. కాని - అంతే!

ఈలోగా పెళ్ళికొడుకు గానీ మనసు మార్చుకున్నాడా ఏ చెల్లెలుచేతనో తల్లిద్వారానో కబురు పంపించి ప్రధానం "కేన్సిలు" చేసుకోవొచ్చును. ఆడపిల్ల గానీ మనసు మార్చుకుందా, ప్రధానంనాడు పెట్టిన వొస్తువుల సొమ్ము మొగపెళ్లివారికి అచ్చుకోవాలి! కాని, ప్రధానం కేన్సిలు అయిపోయినంతమాత్రాన పిల్లగలవాళ్ళని గాని, అటు మొగపెళ్ళివారిని గాని ఎబ్బెట్టుగా చూడరు.

ఇహ పెళ్ళి. పెళ్ళికి మామూలుగా పంచాంగం చూసుకోవడం, మంచిరోజూ, మంచి ముహూర్తం నిశ్చయించుకోవడమ్పూ జరుగుతాయి. పెళ్లి దేవుడిగుళ్లో ఎన్నడూ జరగదు; అలాగని యింట్లో జరిగే పెళ్ళికి హోమాలూ, మంత్రాలూ, సప్తపదులు తొక్కడమ్పూ యిలాంటివీ ఉండవు. పెళ్ళికి ఒకరోజు ముందుగా మొగపెళ్ళివారు (అంటే వరుడి తల్లిదండ్రులు) ఆడపెళ్లివారింటికి వెళ్లి, పెళ్ళికూతురికి నచ్చిన "పెళ్ళిచీరా" (*Wedding Dress*కి యీ పేరు పెట్టేను. వీళ్ళ దుస్తులూ, అధరకాలూ వగైరా "వియట్‌నామీజ్ స్త్రీలు" అనే శీర్షికని ప్రత్యేకించి రాస్తాను), అధరకాలూ అవీ యివీ నిర్ణయించుకుంటారు. పెళ్ళికి పెట్టే నగల్లో వెండి ఎంతమాత్రమూ ఉండదు. వెండి నగ కూడా ఒక నగేనా అంటారు. బంగారం సాధారణంగా 2 మొ॥ 5 *tael* దాకా తూకం ఉంటుంది. ఈనగలూ ఆ పెళ్లిదుస్తులూ అన్నీ ఆ సాయంకాలానికి వాళ్లు పెళ్లికూతురింటికి పంపెయ్యాలి,

* రచయిత ఒక యూనివర్సిటీ ప్రొఫెసరు యింట్లో యీ అంశం ముచ్చటిస్తూ, యీ ఘట్టం వొచ్చేసరికి సరదాకి తనని చెయ్యమన్నాడు ప్రశ్నలు. నాలుగు పుంజీల ప్రశ్నలకి సమాధానం చెప్పేసరికి తల ప్రాణం తోకకి వొచ్చింది "నీ పిల్లకీ పెళ్లికీ ఓ నమస్కారం, యింక ఆ ప్రశ్నలు చాలించు మహాప్రభో" అనేసేవాడే రచయిత నిజంగా పెళ్ళికొడుకయితేను!

★ హనోయ్ విశేషాలు ★

ముర్నాటికి యివి పెట్టుకోడానికి వీలుగా ఉండేటట్టు.

మర్నాడు పెళ్ళి అనగా తొలినాటి సాయంకాలం పెళ్లికూతురు తండ్రి ఆమె పెట్టె అడుగున అంతా సొమ్ముతో నింపెయ్యాలి. పదీ, యిరవై వేల పియాస్ట్రిలు ఉంటేనే గాని సరిపోదు యీ పనికి.

ఇహ పెళ్ళినాడు పొద్దున్నే పురోహితుడ్ని పిలిపించి మంచి ముహూర్తపు ఘడియలు చెప్పమంటారు. ఆ ముహూర్త సమయానికి పెళ్ళికొడుకుని తీసుకుని మొగపెళ్లివారు పెళ్ళికూతురింటికి వొస్తారు. ఆడపెళ్ళివారింటి గేటుకి ఒక ఎర్రటి రిబ్బనో, దారమో కట్టి ఉంచుతారు పెళ్లికొడుకు ఆ దారంక్రింద నుంచి వెళ్లడానికి కొంత సొమ్ము చెల్లించాలి. ఈ ముడుపు (సాధారణంగా వెయ్యి మొదలుకుని రెండు వేల పియాస్ట్రిలదాకా ఉంటుంది) ఆడపెళ్లివారి తాలూకువాళ్లలో కొత్త లోటుగా ఉన్నవాళ్లే కెవరికో పోతుంది. అత్తగారికీ, ఆడపడుచులకీ మాత్రం ఏదీ దక్కదు—అటూ యిటూ కూడాను. తరవాత రెండు పార్టీలవారూ కలిసి టీ పుచ్చుకుంటారు. అన్నట్టు, పెళ్లికొడుకు ఆడపెళ్లివారింటికి రాగానే ఆహ్వానించడానికి బాగా పదిమంది పిల్లా మేకా ఉన్న వృద్ధదంపతుల్ని నియామకం చేస్తారు ఈ వృద్ధదంపతులు ఆడపెళ్ళివారికి సంబంధించి ఉండాలన్న నిర్బంధం లేదు. పెళ్ళికొడుకు ఆడపెళ్ళివారింటికి రాగానే పిల్ల తాతగారికీ అమ్మమ్మకీ నమస్కరించాలి. ఆ సమయంలో లాంఛనంగా పిల్ల తండ్రి పెళ్ళికొడుక్కి ఏ సైపినో, చిన్న ఉంగరమో మరేదో చిన్న కానుక యిస్తాడు. పెళ్ళికొడుకు పెళ్ళికూతురియిల్లు చేరుకుని, యీ పనులు చేస్తూంటే ఆడపెళ్ళివారు ఊః పటాకీలు కాలుస్తారు. తరవాత మొగపెళ్ళివారు లాంఛనంగా అంటారు: "పెళ్లికి మీ అమ్మాయిని మాతో పంపించవలసింద"ని; అప్పుడు పెళ్ళికూతురు తన స్నేహితులతో వొచ్చి మొగపెళ్ళివారందరికీ నమస్కరిస్తుంది. పెళ్ళికొడుకు ఆమెతో కూడా వెళ్ళి వాళ్ళ "పితృదేవత"లకి (*Family altar*)న నమస్కరిస్తాడు.

ఆ తరవాత ఆ పెళ్ళికూతురు, మొగపెళ్లివారితో పెళ్ళికొడుకు యింటికి వొస్తుంది. కాని, ఆడపెళ్ళివారెవ్వరూ ఆమెతో కూడా వెళ్ళరు. పిల్ల తల్లిదండ్రులయితే బొత్తిగా వెళ్లడానికి వీల్లేదు. వాళ్లు యింట్లో కూచుని ఏడుస్తారు!—పిల్ల పరాధీనం అయిపోయింది గదా అని పిల్ల ఇహ బయలుదేరుతుందనగా, తల్లిదండ్రులు ఆమెకి బుద్ధులు చెబుతారు, మొగుడి యింట్లో యెలాగ మెసులుకోవాలోను.

అసలు పెళ్ళి యిక్కడా - మొగపెళ్ళివారింట్లోను. పెళ్ళికి బాజాల్లేవు. మంత్రాలూ, తంత్రాలూ, హోమాలూ అలాంటివి అసలే లేవు. వొస్తూనే ఆ పెళ్లికూతుర్ని పడకగదిలోకి తీసుకువెళతారు. అక్కడ ఓ చాక్కటి పందిరిమంచం, పరుపూ, సిల్కు తలగడాలూ, దోమతెరా యిలాంటి సరంజామా అంతా పిల్లా జెల్లా సంతతి బాగా ఉన్న వృద్ధదంపతులు అమరుస్తారు. అలాంటి వృద్ధదంపతులు పడక అమురుస్తే, యీ వధూవరులు కూడా పిల్లా మేకాతో చిరకాలం వర్ధిల్లుతారని వాళ్ళనమ్మకం. అంచేత యీ ఎరేంజిమెంటు వృద్ధదంపతులే చెయ్యాలి. పెళ్ళికూతురు రాగానే వీళ్లు ఆమెని ఆహ్వానిస్తారు. పెళ్లికూతురు శయనాగారంలో ప్రవేశించే ముందు కుంపటి దాటాలి, గుమ్మంలోను అమిర్చిన పక్కమీద కూచోడానికి ఒక్క పెళ్ళికూతురికే అర్హత. అప్పటికి యింకా పెళ్లికొడుకు ఆ పరిసరాలకి రావడానికి వీల్లేదు. మరి కాస్సేపటికి పెళ్లికొడుకు వొచ్చి పెళ్లికూతుర్ని లాంఛనంగా తన పితృదేవతల మందిరానికి (*Family altar*) తీసుకువెళతాడు. అక్కడ ఉభయులూ నమస్కరిస్తారు. ఆ తరవాత వేళని బట్టి మధ్యాహ్నం అయితే లంచి, రాత్రయితే డిన్నరూను. అయితే సాధారణంగా యీ విందుభోజనానికి పెళ్లికూతురు స్నేహితులు ఉండడానికి వీల్లేదు. వీళ్లు మళ్లీ తిరిగి వెళ్లి పెళ్లికూతురింట్లో (ఆడపెళ్లివారింట్లో) భోంచెయ్యాలి. ఒకవేళ యెప్పుడైనా విందుకి మొగపెళ్లివారింట్లో ఉండిపోయినా భోంచేసి తిన్నగా వాళ్లవాళ్ల యిళ్లకి పోడానికి వీల్లేదు. ముందర ఆడపెళ్లివారింటికి వెళ్లి, అక్కణ్ణుంచి యెవళ్ల యిళ్లకి వాళ్లు పోవాలి. లేకపోతే తగని అవమర్యాదా చేసినట్టు! సరి. పెళ్ళి అయిపోయింది!

ఇదివరకు పెళ్లిసమయంలో బౌద్ధాలయానికి (పెగోడాకి) వెళ్లే ఆచారం లేదు కాని, యిటీవల - అంటే సుమారు మూడు నాలుగేళ్లనుంచీ, - యీ ఆచారం కొత్తగా మొలకెత్తింది. పెళ్ళికూతుర్ని తోడ్చుకుని తన యింటికి తీసుకు వొస్తూన్నప్పుడు పెళ్లికొడుకూ పెళ్లికూతురూ కలిసి దారిలో ఓ పెగోడాకి వెళ్లి అయిదు నిమిషాలు ఉండి వొస్తారు; కాని యిది పెళ్ళిలో భాగంవూ కాదు, ముఖ్యం అయిన అంశంవూ కాదు.

పెళ్లి అయిన మర్నాడు పెళ్లికొడుకూ, పెళ్లికూతురూ కలిసి "చుట్టపు చూపు"లకి వెళతారు. మొదట పెళ్లికూతురి యింటికి వెళ్లి అక్కడ పెళ్లికూతురు తాలూకువాళ్లందర్నీ కలుసుకుని ఆతరవాత పెళ్ళికూతురి స్నేహితుల యిళ్ళకీ, పెళ్ళికొడుకు స్నేహితుల యిళ్లకీ వెళతారు ఇలా చుట్టపుచూపులకి రమ్మని పెళ్ళిఅయిన మర్నాటి ఉదయాన్నే ఆడపెళ్ళివారింటినుంచి పెళ్ళికొడుక్కి పిలుపు వొస్తుంది

తీరా చూస్తే పెళ్ళికూతురు పెళ్ళికొడుక్కి తెచ్చేదల్లా, ఓ పందిరిమంచం, దోమతెరా, ఓ రగ్గూ, రెండు తలగడాలూను. తనకి మాత్రం ఓ పది పదిహేనేళ్ల వరకూ సరిపోయే బట్టలు, రకరకాల దుస్తులు తెచ్చుకుంటుంది సుమారు వందా, రెండు వందల సెట్లుదాకా ఉంటాయి, యివి. జోళ్లు, బాడీసులసమేతం, సర్వంవూ వాటివాటికి "మేచ"యి ఉంటాయి, యీ దుస్తులు పెళ్ళికూతురి బట్టల పెట్టె చూస్తే ముచ్చటే!

పెళ్లి వేరూ కార్యం వేరూ అంటూ లేవు.

ఇంక ఒక చిన్న ముచ్చట మనవిచేసి యీ ప్రసంగం చాలిస్తాను సుమారు అయిదారేళ్ల క్రితంవరకూ పల్లెటూళ్లలో అయిదారేళ్ల కుర్రాడికి యిరవైయ్యేళ్ల అమ్మాయిని యిచ్చి పెళ్లిచేసే ఆచారం ఉండేది. ఇల్లూ వాకిలీ చూసేవాళ్లు లేకా, పిల్లాడికి యింకో దక్షత లేకా యిలాంటి పెళ్లిళ్లు జరిగేది. అయితే పిల్లడికి యీడు వొచ్చే సరికి భార్య ముసలిదైపోవడంనుంచి, వాడు తిరిగీ పెళ్ళి చేసుకునేవాడు. మొదటి భార్య ఒప్పుకుంటే రెండో పెళ్ళి చేసుకోవచ్చు. అది చట్టబద్ధంవే. కాని యీ అత్యాచారం యిటీవల అంతరించిందనే అనాలి. (ఇంకా ఉంది)

మధుపర్కం

ఉగ్రపురానికి, రుద్రపురానికి మధ్య అయిదారు మైళ్ళన్నా లేదు. ఆ రెండు గ్రామాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. అటు కాకి యిటు వాలటానికి వీల్లేదు. ఇటు దోమ అటు దూరటానికి వీల్లేదు.

ఉగ్రపురం నర్సిమయ్య కొడుకు రంగడికి, రుద్రపురం తాయారమ్మ కూతురు పార్వతి నిచ్చి వివాహం చేయడానికి నిశ్చయించుకోవడమైనది తాయారమ్మ పేరెందుకు చెప్పానంటే...అలా చెప్పాల్సి వచ్చింది మరి. అన్నివిషయాల్లోను ఆవిడదే పెత్తనమంతాను. భర్త ఉన్నాడు చూచారు.. ఆయన...భార్య ఇట్లా చేయి, అట్లా చేయి అని ఆజ్ఞాపిస్తే అట్లా ఇట్లా చేసే రకం.

వివాహం అతివైభవంగా జరుగుతున్నది. రుద్రపురం యింద్రపురంలా తయారయింది. రెండు గొప్పిళ్ళలో పెండ్లి జరుగుతున్నదంటె...రెండు గ్రామాలు ఒక కడ కొచ్చాయంటే అతిశయోక్తి ఏముంది?

అయితే పేచీ లేని పెండ్లి కందం లేదు. విందుల దగ్గరో, వినోదాల దగ్గరో, కట్నాలు, కానుకలదగ్గరో...ఎక్కడయితే నేం రానే వచ్చింది పేచీ. వీరావేశంతో వియ్యాలవారు విరగబడిపోయారు. రెండూ సమవుజ్జీలు. మాటామాటా పెరిగింది. "నువ్వెంత?"—అంటే "నువ్వెంత?"—వరకు దిగింది. శిగలు పట్టుకు నేంతవరకు దిగజారిపోయారు.

నర్సిమయ్య తాయారమ్మ గద్దరితనంతో పోటీ చేశాడు:—"అసలు నీ విషయం

యామిజాల శంకరం

నాకు తెలియదు కనుకనా? నీతో ఆ భగవంతుడు కూడా గెలువలేడు......మహాంకాళివి...భద్రకాళివి..."

తాయారమ్మ కస్సుమంది:—"మధ్య వచ్చిన సిరి మానవుణ్ణి వానరుణ్ణి చేస్తుందట. అసలు నీ సంబంధం వచ్చుకోవడ మేమిటి? కుంపెడుగు మెతుకులు తినే రకం. "వద్దయ్యా!" అంటే యీయన విని చచ్చాడుకనుకనా?" అంటూ అకారణంగా భర్తమీద విరుచుకొని పడింది.

రానురాను నర్సిమయ్య ఉగ్రనృశింహావతార్యాడు. తాయారమ్మ రుద్రరూపం ధరించింది పెండ్లికి వచ్చిన పెద్దలంతా విస్తుపోయి విరగబడి చూస్తున్నారు.

"మావాడి కసలు పెండ్లే కాలేదనుకుంటాను. లేవరా పీటలమీదనుంచి..." తీవ్రమైన కోపంతో నర్సిమయ్య అనేశాడు.

"మా పిల్లకు కాలేదని మేమూ అనుకుంటాం. తెంచెయ్యవే - ఆ పుస్తెలు"—ప్రళయతాండవం చేసింది తాయారమ్మ.

2

కొన్నాళ్లు గడిచిపోయాయి. తాయారమ్మ దిగిరావాలని నర్సిమయ్య ఉద్దేశ్యం. కూతురుకోసం తాయారమ్మ తన కాళ్లమీద పడుతుందని ఊహించాడు. ఆవిడ గర్వభంగం చేయడంకోసం, ఆవిడను లొంగదీసుకోవడం కోసం అనేక మార్గాలు అన్వేషించాడు. అలా జరుగలేదు. ఆఖరుకు కుమారునికి మరో పెండ్లి చేయటానికి నిశ్చయించుకున్నట్లు చిన్నడప్పు వాయించాడు.



★ మధుపర్కం ★

ఈ వార్త తాయారమ్మ చెవుల కెగ బ్రాకింది. క్రోధ తొక్కిన త్రాచులా లేచిపోయింది. "నీతి జాతిలేనివాళ్లు!..." హుంకరించింది. "అయిందేదో అయి పోయింది. పొరబాటు. అప లేమీకాలేదు. నా కూతురును పెండ్లిచేయటానికి నేను నిశ్చయించుకున్నాను. రెండూ ఒకేసారి జరగాలి. యాభై వేలిస్తాను. దమ్మున్న పెధవ ఎవరైనా ఉంటే ముందుకురావాలి..."— ఢంకా బజాయించింది.

"తప్పమ్మా...అలా అనకు. నన్ను! చంపించివెయ్యి." అంటూ కూతురు కాళ్ల మీద పడింది. "ఛీ!..." అంటూ కూతుర్ని ఎడమకాలితో ఒక్క తోపు తోసింది.

ఈ వార్తవిని నర్సిమయ్య భగ్గుమన్నాడు. తన చేనుమీదనుంచి తాయారమ్మ పొలానికి నీరుపోకుండా బందుచేయించాడు. తాయారమ్మ పొలం బీడుపడినా ఆవిడ చలించలేదు. అంతమాత్రంచేత ఆవిడ నష్ట పడక పోనూలేదు.

మనస్పర్థలు పెరిగిపోయాయి. రోషాలు రేగిపోయాయి. ప్రతిజ్ఞలు విజృంభించాయి. మీసాలు మెలేశారు. అయితే తాయారమ్మకు మీసంలేని లోపం ఏమీలేదు.

నర్సిమయ్య వరి చక్కగా పండింది. తాయరమ్మ పంటపోయినందుకు చంకలు కొట్టి రంకెలు వేశాడు. అదృష్టం కలసి వచ్చి తన వరి విపరీతంగా పండింది. పోగా లపు పంట ఎప్పుడూ అలానే పండుతుంది. కోయించి కుప్పవేయించాడు. వచ్చే వెన్నెలరోజుల్లో కళ్లం వేద్దామనుకుంటు న్నాడు. కాని ఒకరాత్రికి రాత్రి కుప్ప భగ్గున మండి బూడిదై కూర్చుంది. లబో, దిబో, అన్నారంతాను.

తాయారమ్మ యీ మధ్య నే రెండు మైనూరెడ్లను బండికోసం కొన్నది. అవి దొడ్లోవి దొడ్లో మాయమయ్యాయి.

ఈ ప్రళయ పరిణామాలమధ్య ఉగ్రపురం, రుద్రపురం అట్టుడికినట్టు ఉడికి పోతున్నాయి. ఊరుమ ఉరిమి ఎవడిమీద పడుతుందో పిడుగు; ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఏమీ చెప్పలేకుండా ఉన్నారు. ప్రాణాలు గుప్పెట్లో పట్టుకుని కూర్చున్నారంతాను.



వీరయ్య నర్సిమయ్య యింట్లో అనాదిగా ఉంటున్న నౌకరు. అతని కెవరూ లేరు. అందుకని నర్సిమయ్య యింట్లోనే ఉంటున్నాడు. నర్సిమయ్య కతడు కుడి భుజం, నమ్మకస్థుడు. అతడు తల పగిలి రక్తం బలబల కారుతూ యింటికి వచ్చాడు. తాయారమ్మ నౌకర్లు విరచికట్టి ఆదర కొట్టారట.

అయితే తాయారమ్మ పాలేరు శీతాయిగాడి తల గీసుకొని పోయి రక్తపు బొట్లు కారాయట. ఎట్లా కారాయో ఏమో మరి! విషయం అవగాహన కావటం చాలా కష్టం.

ఆ రెండుఊళ్లకు ఒకే పోలీసుస్టేషను... ఒకే హాస్పిటలు. ఆ రెండూ దురదపాడులో ఉన్నాయి. దురదపాడు కొత్త పెద్దఊరు. తాలూకా కూడాను.

అయితే అక్కడికి వెళ్లినవాళ్ళెవన్నా ఉన్నది కొస్తా వదలించుకోకుండా రారు. తాయారమ్మ, నరిసిమయ్య కేసులు బనాయించుకున్నారు. త్వరగా విడివడాలన్నా, అది వాళ్ళ చేతిలో లేదు.

డాక్టరు చేత పరీక్ష లేకుండా రెండు సర్టిఫికెట్లు చెరిఒకటి సృష్టించగలిగారు. ఈ రిపోర్టు ముందు పైకిపంపాలంటే కూడని పోలీసు స్టేషనులో పేచీపడ్డారు. చెరి నలుగురు వకీళ్లను పెట్టుకున్నారు. మనకంతా విచిత్రంగా కనుపిస్తుంది. కాని పైసా మహాత్యం. రెండు డబ్బు లెక్కువగా ఉంటే కిందా, పైనా తెలియదు మనకి. గోళ్ళతో పోయే దాన్ని గొడ్డళ్ళదాకా తెచ్చుకుంటాం. వీలుగాఉంటే మీసం మెలివేస్తాం. లేకపోతే ఆకాశంకేసి చూస్తాం.

రెండు ఏనుగులు గింజుకుంటున్నాయి. వాటి కాళ్లక్రిందపడ్డ చీమలు చిటపట మనకుండా చిరంజీవులు కావాలని చేతులెత్తి ప్రార్థించుదాం.

3

రంగడు బాగా చదువుకున్న వాడు కాదు. స్కూలుఫైనల్ వరకు వచ్చేసరికే దండయాత్రలవల్ల చాలా ఏండ్లు గడచిపోయాయి. అతని దృష్టి ఎప్పుడూ పొలాలమీదనే ఉండేది. పైరులమధ్య పోతూఉంటే అతని వళ్లు పులకరిస్తుంది. గట్లమీద కూర్చోవటం అతనికి సరదా. నూనూగుమీసం మెలివేస్తూ, యీల వేసుకుంటూ, పదాలు పాడుకుంటూ, కిర్రుచెప్పులు వేసుకొని, చుట్టపొగ నుల్లితిప్పుతూ...పొలాలవెంట పోయేవాడు. కడకు చదువుకి వివాహంతో స్వస్తి చెప్పాడు.

అతని జీవితం పెండ్లికాకముందు ఒక విధంగాను, పెండ్లి అయినతరువాత మరో విధంగాను ఉంది.

ఇప్పుడతడు ఏదో లోటుగా ఉన్నట్టు భావిస్తాడు.

తన కుప్ప ఉన్నపళంగా తగలబడి పోవడంచేత అత్తగారంటే అరికాలిమంట నెత్తికెక్కుతుం దతనికి. ముఖ్యంగా వీరయ్యను కొట్టటంచేత అత్తగారిమీద ద్వేషం ప్రబలింది.

ఇరుపక్షాలవారికీ మొహంమీద బొప్పెలు కట్టాయి. ప్లీడర్ల ఫీజులు, కోర్టు రుసుములు, లంచాలు, లాంఛనాలు, యినాములు, సలాములతో గులాములయ్యారు. వదలవలసినంత వదలిపోయింది. ఇహా యిప్పుడు పరువుకు పాటుపడుతున్నారు. కాని యిప్పుడప్పుడే రాజీకి దిగే అవకాశాలు లేవు.

* * *

ఇవ్వాళ రంగడు పూర్తిగా మారిపోయాడు. అతనికి యింతవరకుఉన్న భావాలన్నీ చెల్లాచెదరయ్యాయి. గూడుకట్టుకున్న దురభిప్రాయాలన్నీ కూలిపోయాయి. ఊహలన్నీ పటాపంచలయ్యాయి. అతనికి రుద్రపురాన్నుంచి ఉత్తరం వచ్చింది. అదే అతనిలో పరివర్తన కలగడానికి కారణం.

గదిలో పడకకుర్చీలో పడుకొని ఉత్తరాన్ని విప్పి మళ్ళీ చదవటం మొదలుపెట్టాడు. అక్కడక్కడా కొన్ని పంక్తులు చదివాడు. అవి మధురస్మృతులమాటున మమతను లేపాయి.

“మీరు మొగవారు. ప్రపంచం మిమ్మల్ని ఏమీ అనదు. కాని నాగతి? మా అమ్మగారి, మీ నాన్నగారి దౌష్ట్యానికి మనం బలికావలసిందేనా? కాని నే నెవ్వర్నీ నిందించదలచుకోలేదు. ఏనాడో ఏదో నేరంచేసి ఉంటాను. అందుకనే నాకీశిక్ష. ఏదో పాపంచేసి ఉంటాను. అందుకే నాకీ నరకం.

“వివాహితనైకూడా కన్యాత్వం అనుభవించవలసిందేనా? నాకీ సంఘపు దుష్టపు చూపులబారినుండి విముక్తిలేదా?

“నన్ను తీసుకొని వెళ్లండి. తరువాత మీ కక్షలు కొనసాగించండి. పతి యింట్లో చావడమే సతి కోరుకుంటుంది.

“నన్ను మీరూ తిరస్కరిస్తున్నారా? అయితే ఎవరికోసం యీ జీవితం? అందు

★ మధుపర్కం ★

కని దీనిని అంతం చేద్దామనుకుంటున్నాను.

"అమ్మ మా మేనమామగారింటికి పలహాల కోసం వెళ్ళింది. పున్నమి వెళితేగాని రాదు. అంతవరకు మీ దర్శనంకోసం ఎదురు చూస్తూఉంటాను. ఆతరువాత...

సెలవు.

మీ పాదదాసి,

పార్వతి."

ప్రతిమాటలోను హృదయావేదన ఉట్టిపడుతోంది. ప్రతిమాటా హృదయాన్ని దూసుకొని పోతోంది.

రంగడికి చిన్ననాటిమిత్రుడు విశ్వనాథం జ్ఞాపకం వచ్చాడు. అతని వేదవాక్కులు నెమరువేశాడు. "ఒరేయ్ రంగా! ... ఒక

స్త్రీపతనానికి ఒకభర్త ఒకోకప్పుడు కారణమౌతాడు. అది అనేకవిధాల జరుగవచ్చు. అయితే ఆ పతన ఫలితం ఆ ఒక్క స్త్రీయే అనుభవించదు. కొంత భాగం భర్తకుకూడా వదిలేస్తుంది. ఎలాగంటావేమో? "ఫలానివాడిభార్య" అని ప్రతివాడూ అంటాడా, అనడా? అప్పుడా ఫలానివాడి తల ఎక్కడ పెట్టుకోవాలి?"

కర్తవ్యం బోధపడక తల బ్రద్దలు కొట్టుకున్నాడు రాత్రి అంతా ఆలోచిస్తునే కూర్చున్నాడు. ఆలోచనలతో మెదడు పగిలిపోతోంది. "ఎందుకీ శిక్ష" - అంటూ పైమరిచి అరచాడు.

తెలతెలవారుతూండగా ఓ చిన్న కునుకు తీశాడు. పార్వతి కనబడింది రెండుకాళ్ళమీదా పడింది: - "నాకన్యాయం చేయకండి ఈ పాదాలవద్ద నాకు స్థానముంది. ఆ స్థానం నాకివ్వండి. కాదనకండి." అంటూ పెధేలు, పెధేలుమని తలబాదుకుంటోంది. ఏనిశ్చయానికి రాలేకపోయాడతను నిశ్చేష్టుడై నిలుచున్నాడు. కనీసం పార్వతిని లేవనెత్తుదామనికూడా అతనికి ఊహ కలుగలేదు. ఆకాశంకేసి చూస్తూ నిలబడ్డాడు. ఇంతలో ఎవరో లేపారు. ఉలిక్కిపడి లేచాడు. అంతా కల...కల్ల.

"కలలోకూడా పార్వతి నాదరించలేకపోయాను -" అంటూ నిట్టూర్చి నిలబడ్డాడు.

తల్లితో అన్నాడు:—"అమ్మా!...నేరమొకచోట జరిగితే, శిక్ష మరొకచోట విధించటం న్యాయమేనా?"

తల్లి అన్నది:—"ఏమిట్రా?"

"అది కాదమ్మా!...నన్ను సరిగా అర్థం చేసుకో మేమేం పాపం చేశామని మా దాంపత్యాన్ని విడదీశారు అదక్కడ. నేనిక్కడ. కానియ్యండమ్మా...మీ యిష్టం మెచ్చినట్లే జరుగనివ్వండి".-అంటూ ఉద్రేకంతో వెళ్ళిపోయాడు. తల్లి కళ్ళనీళ్ళు చీరకొంగుతో తుడుచుకుంది

తండ్రి అంటే రంగడు గజగజ వణికిపోతాడు. అతని కక్కువ చనువు తల్లిదగ్గిర. వీరయ్యంటే అతని కభిమానం, గౌరవం కూడా వుంది. ప్రతి విషయంలో వీరయ్య సలహా తీసుకుంటాడు.

ఇదివరకు మాదిరిగా రంగ డేపనీ హుషారుగా, చురుగ్గా చేయుటంలేదు. వట్టి స్తబ్ధుడు మందకొడితనం, బద్ధకం, మతిమరపు... ఎన్ని ఉండాలో అన్నీ ఉన్నాయి. సంపూర్ణంగా మారిపోయాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. ఒకటికి నాలుగుసార్లు పిలిస్తే గాని జవాబివ్వడు. నిద్రాహారాల విషయంలో కూడా శ్రద్ధ తీసుకోవటం లేదు. విసుగు, చిరాకు, కోపం అతనిలో ప్రబలుతున్నాయి. ఇంటిల్లిపాది రంగడి నేదో ఆవేశించిందని అనుమానపడ్డారు.

సంధ్యాసమయంలో చెరువుగట్టుమీద కూర్చుని...కమలాలను, వాటిమీద వ్రాలే తేనెటీగలను తదేకంగా చూస్తూ కూర్చున్నాడు. కాని అతని కేమీ కనుపించటం లేదు. దృష్టంతా పార్వతిమీదికి పరిగెత్తుతోంది.

రానురాను అతని దృష్టిపథంలో అనేక సంఘటనలు దొర్లిపోయాయి. తన యింట్లో తనొక నౌకరు అంతకన్నా వేరే స్థానమున్నట్లుకనుపించదు. పగలల్లా గాడిదచాకిరీ చేస్తున్నాడు నౌకరు రాకపోతే నూతి నీళ్లు తోడాలి, పాలు తియ్యాలి, పుల్లలు కొట్టాలి బర్రెలు విప్పాలి, ఆవులు తోలాలి, ఎడ్లు కాయాలి, నాగలి దున్నాలి. రోజూ ఏదో ఒకటి తనవంతుకు మిగులుతునే ఉంటుంది. కాని తనకు ప్రతిఫలం తిట్లు, దీవెనలు. "నా కాలంలో నేనంత చేశాను. ఇంత చేశాను. ఈ కాస్తకే ఏడుస్తావేం"—అది తండ్రి అనే మాట. ఇలాంటి పనులు తనవాళ్లంతా చేశారు. తనూ చేస్తానన్నాడు చేయాలి. కాని అప్పటి సరదా వేరు.

"ఏమిటాలోచిస్తున్నావు?..." వీరయ్య పిలిచాడు. ఇంతకు మునుపు వీరయ్య యింటికి వెళుతూ వెళుతూ రంగణ్ణి రెండు కేకలు వేశాడు. "ప్రొద్దుపోతోంది. పోదాంరా" అని. కాని రంగడు సమాధానమివ్వలేదు. దగ్గరగా వచ్చాడు. తట్టి పిలచాడు

"ఏమీ లేదు." ముక్తసరిగా సమాధానం చెప్పాడు రంగడు. కాని ఏదో ఆవేదనతో కుమిలిపోతూన్నట్లు యిట్టే పసిగట్టాడు వీరయ్య వీరయ్య ఒకపట్టాన వదలే మనిషి కాదు. తనకున్న చనువువల్ల రంగణ్ణి గ్రుచ్చి, గ్రుచ్చి అడిగాడు రంగడికి చెప్పక తప్పిందికాదు వీరయ్య సానుభూతివాక్యాలతో ఇంతవరకు కప్పివేయబడ్డ దుఃఖాగ్ని రగిలింది.

రంగడిలో యీ దుఃఖం ప్రజ్వరిల్లటానికి కారణం ఒక్క పార్వతివల్ల వేరుచేయబడినందువల్ల కాదు. ఇంతవరకు అతని హృదయం ఆవేదనాపూరితమై వున్నది. తన స్థానం ఏమిటో తనీనాడు విమర్శించుకుంటున్నాడు. ఈలాంటి అనునయ వాక్యాలు ఇంతదాకా పల్కినవారు లేరు. ఆ విధమైన విషమపరిస్థితిలో అతనికి దుఃఖం ఆపుకున్నా ఆగిందికాదు.

4

శరత్కాల చంద్రుడు పండువెన్నెలలు విరజిమ్ముతున్నాడు. యౌవనంతో ఉప్పొంగే హృదయాలకు కితకితలు పెడుతున్నాడు. ఆరాత్రి చిరుచలిగా ఉంది. పక్కమీది తెల్లటి రెక్కదుప్పటి తీసి కప్పుకున్నాడు రంగడు. సైకిలెక్కాడు రుద్రపురానికి.

* * *

తన రెండుచేతులతో నున్నటి బుగ్గలు నిమురుతూ, దగ్గరకు తీసుకొని, పార్వతి కండ్లలోకి తదేకంగా చూస్తూ:— "పార్వతీ!..." అన్నాడు. అమితానందంతో పార్వతి సమాధానమివ్వలేదు. ముగ్ధత్వం, ప్రేమ, జాలి, ఆప్యాయతా ఆమెలో ఉట్టిపడుతున్నాయి వళ్ళు పులకరించింది. వెచ్చని ఊర్పులు విడిచారు. ఆనందాతిశయంతో పార్వతి కండ్లు చెమర్చినై బరువైన కనురెప్పలు వాలిపోతున్నాయి

ఇన్నాళ్లనుంచి తనేదో అపూర్వవస్తువు నుండి వేరుచేయబడ్డట్లు రంగడు భావించాడు. పార్వతి పెదవులు చుంబించబోయాడు. సిగ్గు పెనవేసుకోవడంవల్ల తల వంచి, తనకు తెలియకుండానే రంగడి వడిలో వాలిపోయింది. ఒక మేఘశకలం సుధాకరుణ్ణి కప్పివేసింది.

5

తెల్లవారుఝామున కోడికూతకే పాలేళ్లను లేపి పనికోసం పొలానికి పంపించవలసిన బాధ్యత రంగడిమీద ఉన్నది అందర్ని మేల్కొలిపి పంపాడు. మనిషి బాగా అలసిపోయి ఉన్నాడు. నిద్ర వరదలాగ ముంచుకొనిరా మొదలిడింది. అడ్డుపెట్టటం శక్తికిమించిన పనిగా పరిణమించింది

వట్టి గడ్డివాము ప్రక్కనే ఉంది. లోపల దూరి రెక్కదుప్పటి కప్పుకొని నిద్రపడ్డాడు. బయట పాలేళ్లు కళ్ళం వేస్తున్నారు.

వర్సిమయ్య ప్రొద్దుటే పొలానికి వచ్చాడు. కొడుకెక్కడా కనుపించలేదు. వీరయ్య నడిగాడు. వీరయ్య రంగడి ఊనికి చెప్పాడు. తెల్లవారుఝామునే లేవటంవల్ల నిద్దురచాలక పడుకున్నాడేమోనని తలచాడు

ప్రొద్దు బాగా ఎక్కింది అన్నపువేళయింది. కొడుకును నిద్రలేపి అన్నానికి పంపుదామని నిశ్చయించాడు. మాస్తే వరిగడ్డి అంతా మీదవేసుకొని గుర్రు కొడుతున్నాడు. పైగడ్డి తప్పించాడు చీరె అంచు బయటపడింది ఎక్కడిదో చీరె కప్పుకొని

★ మధుపర్కం ★

రంగడు పడుకున్నాడు. నర్సిమయ్య కొడుకు వర్తనాన్ని శంకించాడు. అతని మెదడు తీవ్రంగా పనిచేయటం మొదలు పెట్టింది. ఆవులిస్తే పేగులు లెక్కబెట్టే రకం. ఎంతో సేపటికి గాని అసలు విషయం గుర్తుపట్టలే పోయాడు. "ఆ చీర ..ఆ తెల్ల చీర...ఎక్కడిది? నిజం...అదే కావాలి అదే. ఆనాడు పెండ్లిపీటలమీద పార్వతి మధుపర్కం అవును" క్షణంలో విషయమంతా బట్టబయలయింది. నర్సిమయ్య ఉద్రేకంతో ఊగిపోయాడు. తన వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని దుమ్ము ధూళిలో కలిపాడు కొడుకు. ఎముకలు విరగ్గొడదామనుకున్నాడు. కర్ర ఎత్తాడు.

* * *

రుద్రపురాన్నుంచి తిరిగి వచ్చేటప్పుడు పొరపాటున రంగడు తన దుప్పటి అక్కడ మరచిపోయి, మడతలో ఉన్న భార్య మధుపర్కం కాస్తా పట్టుకొచ్చాడు.

ఎలాగయితేనేం విషయం తండ్రికి తెలిసింది. ఒక్కసారి హుంకరించాడు. "దవట వెధవ!... మొగుడు కావాలని దానికి లేదు గాని... పెండ్లాం... పెండ్లాం... అంటూ అరచి చస్తున్నాడు."

రంగడందుకున్నాడు. "నీకేం తెలుసేమిటి? నోటికి వచ్చినట్లు మాట్లాడగానే సరిపోయిందా?"—

"నోర్ముయ్!" - దవడ ఊడేటట్టు కొట్టాడు తండ్రి. "సమాధానంకూడా చెబుతున్నాడు వెధవ."

రంగడు మౌనంగా వెళ్ళిపోయాడు. భార్య అందుకుంది "అయిందేదో అయిపోయింది. వాడిల్లా ఎన్నిరోజులనుండి ఇలాయిన్ని మైళ్ళు వెళ్లివస్తున్నాడో? ఇలానే అయితే వాడి ఆరోగ్యం కాస్తా పాడై కూర్చుంటుంది."

"చస్తాడంటావు" ఉరిమాడు నర్సిమయ్య.

"అలా అనకండి. అశుభం కోరుకోకూడదు. పిల్లను తెచ్చుకుందాం. ఆ తరువాత మన కక్షలు, మనం ఉండనే ఉన్నాం."

"వీల్లేదు" చిందులు త్రొక్కాడు నర్సిమయ్య.

"ఇన్నిరోజులనుంచి వాడి సంగతి మీరేం గమనిస్తున్నారు? మనిషి పూర్తిగా మారిపోయాడు. నామాట వినండి గోళ్లతో పోయేదాన్ని గొడ్డళ్ళవరకు తేకండి"

ఆరోజల్లా కొడుకునుగురించి నర్సిమయ్య ఆలోచించాడు.


ఆరోజల్లా ఇంట్లో వంట పొయ్యిమీదికి ఎక్కలేదు.

ఆరోజల్లా రంగడింటికి రాలేదు.

తెల్లవారి పొలంలో రంగడితో వీరయ్య చెప్పాడు "కోడలిని తీసుకొని రావటానికి నిశ్చయించుకున్నారు. ఆ తరువాత మీ అత్తగారి చిన్నపేగులు త్రెగేస్తారట."

"నిజంగా!-" ఆశ్చర్యంతో రంగడన్నాడు.

"అవును. అబద్ధమెందుకు చెబుతాను. రేపు చూడరాదా అని. అప్పుడే చాకలాళ్లు కూడా వెళ్ళిపోయారు." ★



విద్యుద్గర్భ

శివసముద్ర దృశ్యం. —ఫోటో: విఠల్‌ప్రసాద్, మద్రాసు.

★ వ్యక్తులూ - విలువలూ ★

ఒక వ్యక్తికోసం నేను చాలాకాలంగా అన్వేషిస్తున్నాను. పోనీ అతడు కనిపిస్తాడేమోనని చూస్తున్నాను. ఏనాటికైనా అతను నా చూపుల్లో పడితే పట్టుకుని మనసారా అతనికి క్షమాణ చెప్పుకోవాలి. ఎంచేతంటే అతనికి తెలియకుండా దారుణమైన ద్రోహం ఒకటి అతనికి చేశాను.

చాలాకాలం క్రింద రామ్మూర్తికోసమని వాళ్ళయింటికి వెళ్ళాను. రామ్మూర్తి లోపల ఏదో పనిలో వున్నట్లున్నాడు. డ్రాయింగురూమ్‌లో ఒక నూతనవ్యక్తి కూర్చునివున్నాడు. నేనూ ఓ సోఫాలో కూర్చున్నాను.

నేను వచ్చానని తెలిసి రామ్మూర్తి తను చేస్తున్న పని మధ్యలోనే ఆగి మా దగ్గరకు వచ్చాడు: తనని కొంతసేపటిదాకా క్షమించాల్సింది అన్నట్లుగా మొహం పెట్టాడు. "పర్వాలేదులే. ఒక పావుగంట కూర్చుంటాం. పనిచూసుకురా" అన్నాను సానునయంగా

"సరే అయితే. అంతవరకూ మీ రిద్దరూ కలిసి కాలక్షేపం చేస్తూవుండండి. సారీ! మీ యిద్దర్నీ పరిచయం చేయటం మరిచే పోయాను" అంటూ.

నా గురించి అతనికి చెప్పాక:

"ఈయన మిస్టర్ ముకుందరావు. వీరికి ఒక ఊరంటూ లేదు. వ్యాపారంమీద అనేక వూళ్ళు తిరుగుతూవుంటారు ఇన్నాళ్ళకి— యివాళ్టికి యీ వూరు రావటం తటస్థించింది. చిన్నప్పుడు యిద్దరం బడిలో కలిసి చదువుకున్నాం" అని చెప్పాడు. తర్వాత తనపని తీరిపోయినట్లుగా లోపలకు వెళ్ళిపోయాడు.

చాలా మామూలుగా మేమిద్దరం లోకాభిరామాయణంలో పడ్డాం. రామ్మూర్తి గడువుపెట్టిన పావుగంటలో పదినిమిషాల్లో మేము యించుమించు ప్రపంచాన్ని చుట్టి వచ్చాం కాని ముకుందరావంటే నాకేం ఆప్యాయత గౌరవం కలగలేదు. ఆయన వ్యాపారం మీద అనేకవూళ్ళుతిరిగే మనిషి. అటువంటి వాడికి నీతి, ధర్మంవున్నాయంటే ఎలా నమ్మేది? మా సంభాషణ కేవలం లాంఛనప్రాయంగా గడిచింది. పైపెచ్చు ప్రపంచంలో తనకు తెలీని విషయం, తను వేలుపెట్టని వ్యవహారం లేనట్లు అతను మాట్లాడటంతో అతని డాంబికంచూసి ఒకవిధమైన జుగుప్సకూడా కలిగింది.

"నాకు యితర విషయాలంటే ఎంత ఆసక్తివుందో తమాషాలు చేయటంలోనూ అంతే అభిలాషవుంది" అంటూ "మనం యిప్పుడో తమాషా చేద్దామా?" అన్నాడు.

చేద్దాం అనకుండా "చేయండి" అన్నాను.

"అయితే యిలా చూడండి."

అతను చూడమన్న వైపు చూశాను; అంటే బల్లమీదవున్న లావైన ఒక పుస్తకంవైపు. ఆ పుస్తంకం రెండువందల డెబ్భయ్యో పేజీలోంచో, మూడొందల ఎనభయిమూడో పేజీలోంచో ఒక కాయితం తొంగి చూస్తోంది. మామూలు కాగితం కాదు. ఆ కాయితంమారిస్తే నూరు చిన్న కాగితాలు వస్తాయి.

"ఏం చేద్దాం?" అన్నాను బిక్క మొహం పెట్టి.

కొమ్మూరి వేణుగోపాలరావు

"వాడి నిర్లక్ష్యం చూడండి. ఇన్నాళ్లుగా యిన్ని వూళ్లు తిరుగుతున్నాను. ఒక అణా డబ్బులయినా ఆవ మరుపున పారేసుకున్నానా? ఊహు వీడిలా వందలకు వందలు అలా పుస్తకాల్లో పెట్టేస్తూంటే పిల్లలు పెడతాయనా వీడి అభిప్రాయం?" అని ఓ క్షణం ఆగి "దీన్ని తీసి దాస్తాను. వాడెలా కంగారు పడతాడో చూద్దాం. ఆ కంగారుతో డబ్బువిలువ తెలిసివస్తుంది" అని ఆ నోటు తీసి జేబులోకి తోసేశాడు.

నా కేమిటో యీ తమాషా అంత నచ్చలేదు పైగా మోటు హాస్యంలా భావించాను. రామ్మూర్తితో యిన్నాళ్లుగా స్నేహంచేస్తున్నా, యిటువంటి తమాషాలు చేయగల అవకాశాలు చాలా వచ్చినా ఎప్పుడూ అటువంటి వాటిల్లో తలదూర్చలేదు. కాని కొత్తగా పరిచయమైన వ్యక్తి. ఏం చేయను?

రామ్మూర్తి యింకో నిమిషంలో ఊడి, బయట పడతాడనగా "విషయం క్లయిమాక్సు అందుకొనేసరికి అసలు విషయం నేనే బయటపెడతాను. మీరు మాత్రం తొందరపడి బయటపెట్టేరుసుమా. తమాషా చెడిపోతుంది" అని సలహా యిచ్చాడు.

రామ్మూర్తి ముఖాన్ని తెలుపు చేసుకుని బయటకు వచ్చాక ముగ్గురం అటు బజారు వైపు వెళ్లాం. దార్లో కాఫీ తాగాం. కాసేపు అటూ ఇటూ తిరిగాక రామ్మూర్తి వెచ్చాలు కొనాలంటే ఆ షాపుకు వెళ్ళాం రామ్మూర్తి చేతిలో ఆ లావాటి పుస్తకం వుంది.

కొనవలిసిందంతా కొని వెచ్చాలు యింటికి పంపించే ఒప్పందం అయాక రామ్మూర్తి వంద రూపాయల నోటుకోసం పుస్తకమంతా కలయ వెదికాడు. ఏవేవో పేజీ నంబర్లు గుర్తు తెచ్చుకుని ఆ పేజీల్లో చూశాడు. తర్వాత మొహం తేలవేశాడు. మళ్ళీ తను అలా మొహం పెటినందుకు మేము బాధపడతామనో, వ్యాకులపడతామనో మామూలుగా వుండేందుకు ప్రయత్నించాడు. అతని ఆలోచన్లు రకరకాలుగా సాగాయి. కొంచెంసేపు తను ఆ నోటు పుస్తకంలో పెట్టిన మాట ఖాయమేనా కాదా అని ఆలోచించాడు. "పుస్తకంలో పెట్టకపోతే యింకా ఎక్కడ పెట్టివుంటాను?" అని ప్రశ్నించుకున్నాడు. ఈవిధంగా ఆలోచన రకరకాలుగా సాగాక చివరికి ఆ నోటు డ్రాయర్లో ఎడంవైపు సొరుగులో ఫైల్సు మధ్య పెట్టినట్లు గుర్తు వచ్చింది రామ్మూర్తికి. ఈ ఆలోచన్లు అతను లోపల్లోపలే చేసుకోక బయటకు కూడా వెలువరిస్తూన్నందువల్ల అతనే విధంగా ఊహించుకుంటున్నాడో మాకూ తెలిసింది.

అయితే రామ్మూర్తి యిలా ఆత్మద్రోహం చేసుకుంటున్నాడంటే నాకు చెప్పరాని బాధ కలిగింది. అతను పుస్తకంలో పెట్టినమాట ముమ్మాటికీ నిజం. కాని ఆ పుస్తకందగ్గర పావుగంటసేపూ, అంతకంటే ఎక్కువసేపూ కూర్చున్న యీ ఆప్తమిత్రులు తమాషాకో, నిజంగానో ఆ నోటుని అపహరించివుంటారని అతను అనుమానించకపోవటం నాకు మరీ ఆశ్చర్యం కలిగించింది. రామ్మూర్తిస్థితిగతులు నాకు తెలీనివికావు. వందరూపాయల కాయితం అంటే అతనికి ఎంత పెద్దవస్తువో కూడా నాకు తెలుసు. అటువంటప్పుడు అది డ్రాయర్లోనో ఎక్కడో వుండివుంటుందను

★ వ్యక్తులూ — విలువలూ ★

కుని ఎంత సమర్థించుకుంటున్నా బాధ పడకుండా వుంటాడని ఎలా నమ్మేది?

షాపువాడిని డబ్బు తర్వాత యిస్తానని ఒప్పించి "పదండి. అలా లైబ్రరీదాకా పోయివద్దాం. ఈ పుస్తకం అక్కడ యిచ్చెయ్యాలి" అన్నాడు. ఎంత కూడదనుకున్నా అతనిగొంతులో కంగారు అనేది ధ్వనిస్తూనే వుంది. ఈసమయంలో నేను ముకుందరావు మొహంవంక చూశాను. అతనూ నావంక చూసి చిన్నగా నవ్వాడు. అతని నవ్వు చూస్తే నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. అతనంటే కలిగిన జుగుప్స యింకొంచం పెరిగింది. ఎంతసేపని తమాషా? తమాషాలకి కూడా ఒక హద్దూ పద్దూ వుండాలా? అదీ గాక క్లయిమాక్సు యిందాకే అందుకున్నాడాయె. ఓవిధమైన అసహ్యంతో తల ప్రక్కకి తిప్పుకున్నాను.

లైబ్రరీలో పుస్తకాన్ని యిచ్చివచ్చేందుకు రామ్మూర్తి లోపలకు పోయినప్పుడు అతను నాతో అన్నాడు. "చూశారా? మనుషులస్వభావాలు ఎంత వింతగా వుంటాయో! కొద్దిగంటలక్రితం రామ్మూర్తి తన చేతుల్తో యీ పద్యకాయితాన్ని ఆ పుస్తకంలో పెట్టాడు. ఇప్పుడు ఆ విషయాన్ని తనే నమ్మలేనిస్థితికి వచ్చాడు. పైగా యింకా ఎక్కడెక్కడో పెట్టాననుకుంటున్నాడు. ఇటువంటి చిన్న చిన్న సంఘటనలవల్లే వివిధమన స్తత్త్వాల పరిశీలన చేయవచ్చు..." అంటూ ఏదో సైకాలజీ చెబుతున్నాడు. 'ఊఁ' కొట్టటంమినహా నేను యింకేమీ చేయలేదు. చేయలేక పోయాను.

రామ్మూర్తి ఆ పుస్తకాన్ని లైబ్రేరియన్‌కి అప్పజెప్పేలోపల రెండుమూడు సార్లు మళ్లీ ఆ పేజీలన్నిటినీ వెతికి వుంటాడనటంలో సందేహంలేదు. కొంతసేపటికి మాదగ్గరకు వచ్చాడు.

చీకటిపడబోతూండగా యింటిదారి పట్టాము. దార్లో రామ్మూర్తి "అదికాదు ముకుందం. ఇవాళే వెళ్లాలని తొందరేముంది? రేపు వెళ్ళకూడదూ?" అన్నాడు.

"కాని రామ్మూర్తీ ఎలా వీలవుతుంది? నా వ్యవహారాలూ, వ్యాపకాలు అదంతా నీకు తెలుసాయె. టైమంటే నాకు ప్రాణప్రదం. ఒకనిమిషం వేస్టు చేయాలంటే మనస్సు చివుక్కుమంటుంది. ఇవాళ రాత్రికే వెళ్ళిపోవాలి" అన్నాడు ముకుందరావు.

రామ్మూర్తి నావైపు తిరిగి "అయితే నువ్వు మా యింట్లోనే యివాళ భోజనం" అన్నాడు.

"ఎందుకులే? మాయింటికి వెళ్లిపోతాను" అన్నాను ముక్తసరిగా.

"అలాకాదు. సరదాగా ముగ్గురం కలిసి కబుర్లు చెప్పుకోవచ్చు. తర్వాత యిద్దరం కలిసి ముకుందాన్ని ట్రెయిన్ ఎక్కించి వచ్చేద్దాం" అని పట్టుబట్టాడు. నాకు ఒప్పుకోక తప్పలేదు.

రామ్మూర్తి యింట్లో భోజనాలతోసహా, కబుర్లలో రెండుగంటలు గడిపాము. నా విషయం ఎలావున్నా రామ్మూర్తి మాత్రం చాలా హాయిగా వున్నాడు. ముకుందరావు జోక్సు, మాటల చాతుర్యం అతనికి చాలా సంతోషం కలిగించాయి. ఆ సంతోషంలో అతను యింటికి వచ్చాక పద్యకాయితాన్ని వెదుక్కోవటం కూడా మరిచిపోయాడు. ఇందాక ముకుందరావు చెప్పిన సైకాలజీ నాకు యిప్పుడు కొంచెంగా అర్థమయింది.

ట్రెయిన్ టైము అయేసరికి ముగ్గురం స్టేషన్‌కు వెళ్ళాం. రైలు ప్లాటుఫారంమీద సిద్ధంగావుంది బయలుదేరేందుకు యింకో అయిదు నిమిషాలకన్నా ఎక్కువ వ్యవధి లేదు. ముకుందరావును ఒక యింటర్ క్లాస్ కంపార్టుమెంటులో ఎక్కించి మేము ప్లాటుఫారంమీద నిలబడి మాట్లాడసాగాము. కొంతసేపటికి సిగ్నల్ యివ్వబడటం కూడా జరిగింది. నాకు మండిపోతోంది. ఏమిటీ పెద్దమనిషీ? ఈ తమాషాకేమన్నా అంతూ పొంతూ వుందా? మరీ విసిగిపోయి నేనే బయటపెడదామనుకున్నాను. కాని సభ్యత అడ్డువచ్చింది.

చూస్తూ చూస్తూండగానే రైలు కూత వేయటం, ప్లాటుఫారం విడిచి వెళ్లిపోవటం కూడా జరిగింది. నా ఆశ్చర్యానికి, అసహ్యానికీ అంతులేకుండాపోయింది. వెళ్తూండగా మహావినయంగా సెలవు పుచ్చుకున్నాడు. ఆ దొంగపెద్దమనిషి మాటలు వినటానికి కూడా నాకు యిష్టం లేకపోయింది.

తిరిగి వస్తూ దార్లో రామ్మూర్తిని అడిగాను "అతన్ని గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

ఇహ రామ్మూర్తి వర్ణించుకువచ్చాడు. ఇంటికి చేరేదాకా అతని గురించి మంచి విషయాలే చెబుతూవచ్చాడు. ప్రతి విషయంలోనూ అతని ఘనతను నిరూపించాడు. అతను యీరాత్రి వెళ్ళిపోవటం తనకి సుతరామూ యిష్టం లేదన్నాడు. రామ్మూర్తి ధోరణి నాకేం నచ్చలేదు. ముకుందరావును రామ్మూర్తికన్నా నే నెక్కువ అర్థం చేసుకున్నాను. అదయినా అత నీవూరు విడిచి వెళ్ళిపోయే క్షణంలో. అతనా కాయితం దాచి తమాషా ఎందుకు చేయాల్సివచ్చిందో యిప్పుడు గ్రహించాను. అయితే యిటువంటి మనుష్యుల్ని నే నిదే ప్రథమంగా చూడటం. కాని రామ్మూర్తికిమాత్రం అతనంటే అభిప్రాయం మారదుగదా. జరిగిన విషయం అతనికి చెప్పటం నాకిష్టంలేకపోయింది. అతని హృదయంలో ముకుందరావు ఒక ఉన్నతమైనస్థానం ఆక్రమించి కూర్చున్నాడు. దాన్ని కదిలించటం ఎందుకు? "ఇందాకపోయిన డబ్బును యిది కావా?" అని అడగటంకూడా యిష్టంలేకపోయింది అడిగినట్లయితే ఆ రాత్రికి అతనికి శాంతిలేకుండా చేయాల్సివస్తుంది.

అందుకని ఆ రెండువిషయాలని గురించీ ఒక్కమాటయినా బయటకి చెప్పకుండా,

మా యింటికి చేరేసందు వచ్చేటప్పటికి "గుడ్ నైట్" చెప్పివెళ్ళిపోయాను. ఆరాత్రి ముకుందరావు చేసిన "తమాషా" గురించి చాలా ఆలోచించాను. అంత వ్యాపారస్థుడు అయివుండి, బాగా డబ్బుగలవాడు అయివుండి అతనటువంటి "తమాషా" ఎందుకు చేయవల్సి వచ్చిందో అర్థం కాలేదు ఇంకో ఆలోచన కలిగేటప్పటికి విస్మయంకూడా కలిగింది. నా ముందు అతనటువంటి పనిచేసి నేను రామ్మూర్తిముందు బయటపెడతానని ఎందుకు అనుమానించలేదు? నేను చెప్పేస్తే అతనికున్న గౌరవం ప్రతిష్ఠ ఏమయిపోతాయి?

కాని దానికి సమాధానంగా యింకో ప్రశ్న లాంటిది ఉదయించింది.

"అతను భయపడవలసిన అవసరం ఏముంది?

ముకుందరావు తెలివితేటలకు ఆశ్చర్యం వేసింది. నేను బయటపెట్టలేనని అతనికి తెలుసు. వ్యక్తుల తత్వాలను అవగాహనం చేసుకుంటే వ్యవహారాలు ఎంత సులభంగా నడిపించవచ్చో అర్థమైంది.

ఇది జరిగిన మూడో నాటి సాయంత్రం రామ్మూర్తి, నేను చల్లగాలికి బయల్దేరాము. మా యిద్దరిమధ్యా అనేక విషయాలు వచ్చాయి. నాకుమట్టుకు ఏదో వెలితిగానే వుంది రామ్మూర్తి ముందు ఏదో దాస్తున్నానని బాధగావుంది రామ్మూర్తిముందు ఏదో దాస్తున్నానని బాధగావుంది. ఈ రెండు రోజుల్లోనూ నేను ముకుందరావును మరిచిపోలేదు. అతన్ని ఎంత నీచంగా చిత్రించుకొనాలో అంతనీచంగా చిత్రించుకుని అతనికి నాలో ఒక స్థానాన్ని ఏర్పరిచాను.

అకస్మాత్తుగా రామ్మూర్తి అన్నాడు. "ఇవాళ చిత్రం జరిగింది."

అతనామాటలు అనకుండా వుంటే "రెండురోజులక్రితం నేనో విచిత్రమైన దొంగనుచూశాను..." అంటూ ఆ దొంగను గురించి, దొంగతనాన్నిగురించి పరోక్షంగా అసలువిషయం బయటపెటకుండా ఉపాయంగా చెప్పను పోదామనుకుంటున్నాను.

కాని అతనా మాట అనటంతో అదంతా మరిచిపోయి "ఏమిటి?" అనడిగాను కుతూహలంగా

"నాకు ముకుందరావు వందరూపాయలు ఎమ్. ఓ. చేశాడు?"

"అదేమిటి?? తెల్లబోయాను.

"ఆ వేళ నా వందరూపాయలనోటు కనిపించలేదు. గుర్తుందా?"

"ఊఁ."

"మరునాడు యిల్లంతా వెదికాను. కనిపించలేదు. పోయిందని నిస్పృహచెంది వూరుకున్నాను" అని కొంచెం ఆగాడు.

నా గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"కాని యివాళ ముకుందరావు వందరూపాయలు పంపిస్తూ ఓఉత్తరం రాశాడు. ఆరోజున పుస్తకంలో పెట్టివుంటే తమాషా చేసి ఏడిపిద్దామని తీసి దాచాడుట. విషయం క్లయిమాక్సుకరకూ పోయాక యిద్దామనుకున్నాడుట. కాని అతననుకున్నంత క్లయిమాక్సు రాలేదు. స్టేషన్‌లో యిద్దామనుకుని మాటల్లోపడి మరిచిపోయాడుట. ఇప్పుడు పంపించేస్తూ క్షమాపణ అడిగాడు" అని కొంచం ఆగి.

"అందుకే ముకుందరావును నేనంత గౌరవిస్తాను. ప్రతి విషయంలోనూ యితరుల కెవరికీ కనిపించని ప్రత్యేకత అతనికి కనిపిస్తూ వుంటుంది. ఇతరులెవ్వరూ వూహించని పనులు అతను చేస్తూవుంటాడు. ఉదాహరణకి నువ్వే ఆ నోటుని చూశావనుకో; ఆ స్థితిలో. నువ్వు అలా తీసి దాచి ఏడిపించటానికి యిష్టపడవు. మెదలకుండా వూరుకుంటావు. లేకపోతే నా అజాగ్రత్తకు నాలుగు చివాట్లువేసిదాన్ని తీసి భద్రపరచమంటావు. అంతే నా?" అంటూ అంతటితో ఆగక, యీ అవకాశాన్ని పురస్కరించుకుని ముకుందరావును గురించి యింకా చాలా చెప్పాడు. కాని యీసారి నేను అతను చెప్పేది త్రోసివేయక శ్రద్ధాభక్తులతో విన్నాను.

రామ్మూర్తి యిలా వున్న విషయం బయటపెట్టటంతో నేను తల్లక్రిందులైపోయాను. ఒకరకం సిగ్గు నన్నావహించింది. ముకుందరావును గురించి యిదివరకు నాకున్న ఊహల్లో ఏ ఒక్కటీ రామ్మూర్తికి చెప్పలేకపోయాను. ఆ విషయా లేవీ అతనికి తెలియకుండా వుంటేనే బావుంటుందని నా ఉద్దేశం.

అయితే వందరూపాయలు విలువగల కాయితాన్ని తమాషాకే సంగ్రహించి, మళ్లీ అది యివ్వకుండా మరిచిపోయి వెళ్లిపోవటం నమ్మదగిన విషయమా?

ఏం? ఎందుకు నమ్మదగిన విషయం కాదు? వందరూపాయలు పోయాయనో, ఎక్కడో డ్రాయర్లో పెట్టి వుంటాననో సందేహంలోవుండి, యింటికిపోయి వెతకాలి అనుకున్న రామ్మూర్తి కబుర్లకులాసాలోపడి ఆ విషయం మరిచిపోలేదా?

ఇలా సమాధానం చెప్పుకున్నాక నన్ను తృప్తీ, అసంతృప్తీ రెండూ ఆవహించాయి ముకుందరావును ఎప్పుడో ఓసారి కలుసుకుని, రామ్మూర్తికి తెలియకుండా మానసికంగా అతనికి చేసిన ద్రోహానికి క్షమాపణ కోరుకుంటేగాని నాలో అసంతృప్తి అణగారదు.

★

★ శవపంచాయతి ★

పంతులు మరణవార్త క్షణంలో వూరంతా వ్యాపించింది. గ్రామపెద్ద గరటయ్య - షావుకారు రంగయ్య యింకా కొందరు గ్రామస్థులు పంతులు యింటి ముందు వీధిఅరుగుపై సమావేశమయ్యారు. పంతులు శవాన్ని పంచాయతిచేసి దహన క్రియలు జరిపించే సదుద్దేశం వారందరిని ప్రొద్దుపొడవకముందే అక్కడకు చేర్చింది. అందరూ పంతుల అకాలమృతికి తమ సంతాపాన్ని వెల్లడిస్తూ మాట్లాడసాగారు.

"పాపం! ఎక్కడ పుట్టాడో - ఎక్కడ పెరిగాడో - యీవూళ్లో కాలందీరింది -" రంగయ్య చుట్ట ముట్టించుకుంటూ తాపీగా అన్నాడు.

"ఇంతలోవుంది మనస్థితి. అందుకేగా జీవితం బుద్బుదప్రాయ మన్నారు." గరటయ్య గంభీరంగా ముఖం పెట్టి అన్నాడు.

"వృధాగా గ్రామస్థులతో పేచీ పెట్టుకొన్నాడు. లేకుంటే యింతఘోరం జరిగేదికాదు -"

"తెలిసీ తెలియని మూర్ఖం - లేకుంటే షావుకారు రంగయ్యతో ఢీకోటం మాటలా -"

"నన్నొక్కడినే గిరిలో పెడతావేం గరటయ్యా. నీమాటమాత్రం ఆపంతులు ఏమంత ఖాతరుచేశాడు."

"కాగితపాలలాగ బుస్సుమని పొంగే వయసు - కొంచెంపిల్లతరహాలో పోయాడు. ఇక్కడుండేవాళ్లు పోమాపోమీాలని తెలియదు పాపం! -"

"పోటీ స్కూలు పెట్టినప్పుడు కొత్త తెలుసుకొన్నాడు -"

"నీకు చెప్పానో లేదో - ఆరోజు నా దగ్గరకొచ్చాడు పంతులు - వచ్చి ఏవో మాటలప్రస్తావనలో - నాతో జారవిడిచాడయ్యా -"అంటూ ఆరిపోయిన చుట్టను వెలిగించుకొనేపనిలో మునిగిపోయ్యాడు గరటయ్య.

"ఏమన్నాడూ - ఆ పాడుచుట్ట ఇప్పుడే ఆరిపోవాలీ?" పంతులు ఏమి చెప్పాడో వినాలనే కుతూహలంతోవున్న రంగయ్య ఆలస్యాన్ని భరించలేకఅన్నాడు.. రెండు మూడు అగ్గిపుల్లలు గీచినా గరటయ్య చుట్ట వెలగలేదు.

పి. పరంధామయ్య

"ఆచుట్ట పారవేయ్ - నల్లంగా నుసి, అదేం కాలి ఏడుస్తుంది. నేనిస్తా గాని, చుట్ట- ఏమన్నాడో చెప్పు -"

గరటయ్య చుటను విసిరిపారేస్తూ "ఏదో పొట్ట చేతోపట్టుకొని వచ్చాను యీవూరు. పోటీ స్కూలుపెట్టి నాకు అన్యాయం చేస్తున్నారు. దీనిగ్గా నేను ఎప్పటికైనా పగ దీర్చుకుంటాను చచ్చి దయ్యమై అయినా సరే..."అని ఆరోజు తనసొద వెళ్లబోసుకున్నాడు పంతులు -"

"ఆ..." రంగయ్య గుండె గుభిల్లుమనగా వులిక్కిపడ్డాడు.

"దేనికోయ్. అంతబితరపోతావ్. చచ్చినోళ్లంతా దయ్యాలైతే యిక బ్రతికున్న మనకి లోకంలో చోటుంటుందా -"

"నిజంగాఅన్నాడా - అయితేఎప్పుడూ చెప్పలేదేం"

"పంతులంటే అప్పుడు ఎవరికీగిట్టకుండా వుంటావుండె. ఈమాట చెప్పితే అంతా అతనిమీద విరుచుకపడతారని చెప్పలేదు."

"చచ్చేలోపల వూళ్లో కొత్త చిచ్చుపెట్టిపోవాలనుకున్నాడు. బంజర్లని - అసలు మిగాలని - అయితే ఆ ఎత్తు పారలేదు గాని..."

"సరే! అతని పీడా యీరోజుతో వదలిపోయిందిగా—"

"ఇంత త్వరగా వదలిపోవటం నాకు యిష్టమున్నట్టు లేదే—"

"ఇష్టమున్నా లేకపోయినా వదిలే మాటయితే పరవాలేదు. ఏ దయ్యమో - భూతమో అయి సాధిస్తే..."

"కొత్తఅయ్యోరు అందుకనే భయపడి వెళ్ళిపోయాడు -" అప్పుడే అక్కడకు వచ్చిన రామయ్య యీ తాజావార్త అందించాడు.

"వెళ్లిపోయాడూ - భలేవాడే."

"చచ్చి దయ్యమై పట్టుకొని అయినా నిన్ను సాధిస్తాను అని కొత్తయ్యోరుతో యీ పంతులు అన్నాడంట ఎప్పుడో - దాంతో భయపడి - పంతులు చచ్చిపోయాడని తెలియగానే - వుడాయించేకాడు అయన."

"ఇక రాడటనా."

"ఎప్పుడూ యీవూరుకొట్టు మొదలవని చెప్పిపోయాడట."

రంగయ్య తొట్రుపడుతూ - "ఒరే - కేప్రమారిలా వున్నావే." అన్నాడు.

"ఏమిటోయ్ - ఆ కంగారు. పెట్టుబడేమున్నా పెట్టావా."

"అంతా యింతా కాదు వందరూపాయలు."

"ఆ అయ్యోరుకు నీ సొమ్ము ఎగ్గొట్టానికి మంచి సాకే దొరికింది."

"ఎగ్గొటం మాటలా - నోటుంది."

"దేశంమీద వాడు పోతే - నోటుపెట్టుకొని ఏంచేస్తావ్."

"సరే నా సొమ్ము ఎంతమంది ఎగ్గొలేదు. వాళ్ళలో వీడూ వొకడని అనుకుంటాను"

"పంతులుపై పగంటే సామాన్యమా రంగయ్యా - వందకు వందా పోయింది - పైగా దయ్యమో - భూతమో అయి..."

"ఆ. వాడిబొంద. పెద్ద చిన్నా లేకుండా పాటుపడిందానికి బాగా అనుభవించాడు."

"పాపం!—అన్యాయంగా చచ్చాడు."

"ఏమిటా అన్యాయం."

"ఇంత చిన్నవయసులో చావటం అన్యాయంగాక మరేముంది?"

"సరే! దానికి ఎవరేంజేస్తారు."

"చేసిందంతా మనమే - ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా అతని చావుకు మనమే కారణం."

"ఏడిసినట్టేవుంది నీ వాదన - కాలందీరి ఆయన జస్తే నీ వాగు డేమిటి."

"ఆయన కాలం తీరటానికి మనం కారకుల మయ్యామనే నే చెప్పటం."

ఇంతలో హఠాత్తుగా వొక నూతనవ్యక్తి పట్నవాసపు దుస్తులతో అక్కడి కొచ్చాడు. అతడు అంతకుముందు కొంతసేపటినుండి చెట్టుచాటున నిలబడివుండటం ఎవరూ గమనించలేదు. హఠాత్తుగా వొక కొత్తవ్యక్తి తమ మధ్యవచ్చి నిలబడటంతో అక్కడ సమావేశమైనవారంతా నిశ్చేష్టులయ్యారు.

"మంచి సమయానికే వచ్చాను. వచ్చి రావటంతోటే యింత విలువైన సమాచారం దొరకటం ఎప్పుడోగాని జరుగదు. మీ పేరు గరటయ్య అనుకొంటాను. వీరు రంగయ్యగారు. మీ పరిచయం నా మహాద్భాగ్యంగా ఎంచుకుంటున్నాను..."

"మీ రెవరండి-" రంగయ్య చురచుర అతనివైపుచూసి అడిగాడు.

"నేను పోలీసుఆఫీసర్ను. సి. ఐ. డి సెక్షను. పంతుల్ని ఎవరో చంపారని టెలిగ్రాం వచ్చింది ఇన్వెస్టిగేషన్ కార్యభారం నా నెత్తినబడ్డది నా బాధ్యతను నెరవేర్చటంలో మీలో కొందరికి బాధ కలుగవచ్చు. కాని అశోక ధర్మచక్రం క్రింద వున్న మనం న్యాయంకొరకు అవన్నీ భరించాల్సి వుంటుంది. ఇంతకుముందే మీరు ముచ్చటించుకొనే మాటలు వినే అత్యుత్తమభాగ్యం నాకు కలిగింది. దానివల్ల అత్యంత క్లిష్టమనుకున్న యీ కార్యం చాలావరకు సులువైనట్లు కనబడుతుంది. మీరు మాట్లాడుకున్న దాన్ని బట్టే పంతులును చంపింది మీరేననే అనుమానం నాకు తోస్తోంది." అని గడగడా మాట్లాడేశాడు.

"మేమేం అనుకోలేదండి." గరటయ్య - రంగయ్య దీనంగా అన్నారు.

"పంతులు చచ్చాడు. పీడ వదలిపోయింది - అని అనుకోలేదూ."

"లేదండి."

"నిజం చెప్పండి- అన్యాయంగా చచ్చాడని గూడా అనుకున్నారు."

"బడి తీసేశారు. జీతం రాలేదు. పస్తులుపడి తిండిలేక చనిపోయాడు. అందువల్ల ఆమాట అన్నామండి."

"అన్నారు కాబట్టే నేను చెప్పగలుగుతున్నాను. చూశారా - మీరు చెప్పిన కారణం యింకా గొప్పదైనటువంటి నేరానికి పాత్రమౌతుంది. స్వతంత్ర భారత దేశంలో తిండిలేకుండా చచ్చాడని చెప్పడానికి ఎవరికీ హక్కు లేదు."

"చచ్చాడు కాబట్టి చెప్పానండి."

"కాదు. మమ్మాటికీ గాదు. అతడు చావటానికి కారణం మీరు. ఆ మాటే మీరు అనగా నేను విన్నాను. ఒరే అప్పన్నా. ఏదీ - ఆ ఫైలిటివ్వు."

అప్పన్న చెట్టుదగ్గరనుండి వచ్చి ఫైలు తీసి యిస్తాడు.

"ఈ గరటయ్యకు ఎటొచ్చీ మాటా తెలవదండి. ఏదో తెలివితక్కువగా అన్నాడు. మమ్మల్ని కాస్త దయ చూడండి-" రంగయ్య వణకుతూ దీనంగా అన్నాడు.

"ఏదో పిల్లలు గలవాళ్లం. దీంట్లో మమ్మల్ని యిరికించబాకండి." పులుల్లాంటి వాళ్లు యీలా పిల్లులైపోవటంతో చుట్టూ చేరిన జనం ఆశ్చర్యపోయారు.

"అతని చావుతో మీకేమీ సంబంధం లేకపోతే మీ కెందుకయ్యా అంతిభయం-"

"ప్రమాణపూర్తిగా లేదండి."

"ఆ విషయం కోర్టులో చెప్పండి."

"ఈ పంతులు చచ్చికూడా సాధించేట్టున్నాడు. మామీద కాస్త కనికరంచూపించి ఆ కోర్టులచుట్టు తిరిగేట్టు చేయబాకండి."

"మీరతన్ని బ్రతికివున్నప్పుడు సాధిస్తే- అతను మిమ్మల్ని చచ్చి సాధిస్తున్నాడు. అతని ప్రాణాన్ని తీసేప్పుడు మీకు కొంకె కనికరం కాస్తన్నా లేకపోయిందా."

"అతని ప్రాణాన్ని మేము తీలేదండి."

"అయితే ఎందువల్ల చచ్చాడు. ఏ రోగం లేకుండా మనిషి అకస్మాత్తుగా ఎందుకు చస్తాడు."

"అకస్మాత్తుగా చావలేదండి. రెండు మూడు రోజులు మాటా పలుకు లేకుండా పడివుండి..."

"ఒక్కసారి ప్రాణం తీయకుండా చిత్రవధ చేశారన్నమాట."

"ఒకరు చేసేదేముందండి యిందులో - అతని విధాయకం అట్టుండింది. చనిపోయాడు"

"ఏదో బడిపంతులు. కడుపు చేత్తో పట్టుకొని మీ వూరు వచ్చాడు. అతన్నింతపని చేస్తారా——"

"మేమేం చెయ్యలేదు బాబూ అంటున్నా అయ్యగారు చిత్తగించటం లేదు"

"ఇక చాలించండయ్యా సొద - నేను కొన్ని ప్రశ్నలడుగుతాను. సూటిగా జవాబు చెప్పండి."

"పంతులిది యీ వూరేనా-"

"కాదండి - ఏ వూరైందికూడా మాకు తెలవదు."

"భార్యా పిల్లలు వున్నారా."

"లేరండి"

"ఈ వూరికొచ్చి ఎంతకాలమయింది."

"దాదాపు మూడేళ్ళయింది."

"అతని స్వభావమెట్టిది"


"కొంచెం కొసరిమనిషి"

"అంటే——"

"ఎవరితో ఎట్టా మెలగాలో తెలవదండి"

"స్కూలు పరిస్థితి?"

"నిరుటివరకు బాగానే జరిగింది."



"తర్వాత—"

"ఒంటిపూట బడి వచ్చిందన్నారు. దాంతో అతని స్వభావం మారిందండి."

"ఏం జేశాడు."

"అందరిని ఒంటిపూట రమ్మన్నాడు."

"సరే రూలునుబట్టి ఆ విధంగా అన్నాడు."

"ఏదో కనిపెట్టి పోవద్దండి"

"ఓహో - మిమ్మల్ని కనిపెట్టిపోలేదు గనుక యీపని జేశారు"

"మేమేం చేయలేదండి"

"పోటీ స్కూలు పెట్టారు కదూ."

"మా పిల్లలకు చదువురాదని పెట్టుకొన్నామండి."

"అతని బడికి పిల్లల్ని పోనీలేదు గదూ."

"మేము పోనీకపోతే ఆగుతారా - వాళ్ళే వెళ్ళలేదు."

"సరే ఆవిధంగా అతనికి మీకు మన స్పర్థ బయలుదేరింది. అతడు మీపాలాల్లో అసలు మీనా ప్రదేశాలు వెదికి పేదవాళ్ళకు చెప్పి అర్జీలు పెట్టుకోమన్నాడు. అతడు బ్రతికివుండటం మీకు మహాప్రమాదంగా పరిణమించింది. అందువల్ల పోకనిండు ప్రాణాన్ని నిలువునా హత్యచేసి పారేశారు."

"మీరీ విధంగా అభిప్రాయపడితే మేము చెప్పేదేముంది అతనికి రెండు నెలలనుండి జీతంరాలేదు. బడి ఎత్తివేశారు. పొత్తిగా జరుగుబాటులేకుండా పోయింది. ఆఖరికి తిండికి నసిగి చచ్చిపోయాడండి."

"హుష్ - ఆమాట అనబాకవయ్యా. అది అన్నిటికంటె గొప్ప నేరం. తిండిలేక చావటం మన రాజ్యాంగం ఒప్పుకోదు. అదీకూడా గాక మన ఆంధ్రరాష్ట్రంలో కావలసినంత మిగులు ధాన్యంవుంది."

"ఏదో పల్లెటూరోళ్ళం బాబూ - ఆమాత్రం తెలిసి చచ్చినోళ్ళం కాదు. కాస్త మామీద దయచూపండి"

"సక్రమంగా విచారణచేసి రిపోర్టు పంపటం నా విధి."

"ఆ రిపోర్టులో నన్ను యిరికించవాకండి."

"ఎందుకూ. ఝాముసేపయింది యిక్కడికొచ్చి - ఎవ్వరూ కాఫీకూడా యిచ్చిన పాపాన పోలేదు."

"నేను నిమిషంలో పెట్టించుకొస్తానండి భోజనం ఏర్పాటుకూడా చేసి వస్తాను."

"త్వరగా రావయ్యా అప్పన్నా! ఆయన వెంట వెళ్ళరా."

రంగయ్య అప్పన్న వెళ్లారు.

"కరటయ్యగారూ - యింతకూ ఆ పంతులు చచ్చినట్లు ధృవపడిందా-"

"చచ్చినట్టే చెప్పారండి."

"చెప్పారుకాని మీరు చూడలేదు. ఈ వూళ్ళో వైద్యుడుంటే పిలిపించు."

ఇంతలో కాఫీతీసుకొని అప్పన్న, అతని వెంట రంగయ్య వచ్చారు

"రంగయ్యా! తిండికూడా మీ యింట్లోనేనా?"

'అవునండి."

"అప్పన్న చెప్పాడుకదూ"

"చెప్పాడండి. అన్నీ తయారైపోతాయిలెండి"

"అప్పన్నా! యిటురా.." అంటూ అప్పన్నను కొంచెం దూరం తీసుకపోయి ఏదో గుసగుసలాడాడు. ఇంతలో వైద్యుడు వచ్చాడు.

"వైద్యుడు శరభయ్య వచ్చాడండి" రంగయ్య చేతులుకట్టుకొని అన్నాడు.

"పోదాం పదండి-" అందరూ పంతులుండే వసారాలోకి వెళ్ళారు. చాపమీద పంతులు పండుకొని వున్నాడు. వైద్యుడు చాపమీద కూర్చుని పంతుల చెయ్యి తీసుకొని నాడి చూస్తాడు.

"నాడి దొరకటంలేదండి."

"ఎంతకాలమయివుంటుంది చనిపోయి"

"ఒక గంటసేపుకూడా అయివుండదండి"

"వోరి పిడుగా - రాత్రే చచ్చిపోయాడనుకున్నాం."

ఇంతలో పంతులు మెల్లిగా కళ్లుతెరిచాడు. వైద్యుడు కెవ్వున కేకేసి వెనక్కి విరుగబడ్డాడు. అందరూ వాకిలివద్దకు పరుగెత్తారు.

"నేనింకా చావలేదు." పంతులు హీనస్వరంతో అన్నాడు.

"ఆ..." అందరు భయ సందేహాలతో అతనివైపు చూశారు.

"దాహం యివ్వండి-"

"దాహమే కాదు. కాఫీ కూడా యిస్తాం నీవు బతికుంటే అంతే చాలు. ఎవ్రా అక్కడ. వెంకడూ కాస్త మంచినీళ్లు పట్టుకరా - కాఫీ పెట్టమని చెప్పు."

"నీవు చనిపోయావని పెలిగ్రాం వచ్చింది వైద్యుడు కూడా అట్లనే అన్నాడు. ఇక్కడున్న ప్రతివాడూ అదే మాట చెప్పాడు. నా ఫైల్లోకూడా అదే రాశాను. నీవు బ్రతికిచాలామందిని ఇబ్బంది పెట్టేట్లున్నావు."

"ఏం యిబ్బంది లేదు. నేను చచ్చి చాలాకాలమయింది కొత్త విద్యావిధానం రాగానే చచ్చిపోయాను"

"అట్లా జెప్పు - అయితే నిన్ను చంపిందెవరో కాస్త జెప్పు."

"వూళ్లోవారు—"

"ఏ ఆయుధంతో చంపారో అదికూడా చెప్పండి."

"నూతన విద్యావిధానమనే గన్‌తో పోటీస్కూలనే తూటా బెట్టి కాల్చేశారండి"

మంచిది అవిగో మంచినీళ్లు త్రాగండి. మీరు కోర్టులోకూడా యిదేవిధంగా చెప్పాలి. పంతులు గ్లాసెడునీళ్లు గటగటా త్రాగేశాడు.

"ఏంరంగయ్యా! పంతులు వాఙ్మూలాన్నిబట్టి మీ పై కేసు బాగా చార్జి అయ్యేట్టుంది"

"పంతులు బతికున్నాడు కదండి."

"అబ్బే! అతనే చెప్పుతున్నాడుగా - చచ్చిపోయినానని."

"మాట్లాడుతూ చచ్చానంటా వేమయ్యా పంతులూ."

"ఎప్పుడో చచ్చిపోయాను బాబూ మీ వలవన. పోటీ స్కూలు బెట్టి నన్ను ఖూనీ చేశారు."

"పంతులూ! నీవు బతికున్నానని ఒప్పుకో. నీవు స్కూలు మళ్లీ పెట్టుకొందువుగాని. నీబడికే పిల్లల్ని పంపుతాం. కొత్తయ్యోరు కూడా వెళ్లిపోయాడట అదీగాక ఒంటిపూట బడికూడ పొయ్యిందట. దాంతో వచ్చిందేగా మనకు పేచీ"

"అబ్బే! ఆలా వీలులేదండి అతను చచ్చినట్టు రికార్డయిపోయింది."

"మాఫండి - ఆ రికార్డు కాస్త మార్చు చేయిండండి."

"అలా వీలులేదండి —"

పరవాలేదులే బాబూ — మహామహా రిపోర్టులు మాయమైపోతున్నయ్ — అదికూడా గాక పంతులు బతికున్నాడు."

"ఏదో చాన్సువల్ల బ్రతికాడే అనుకుందాం. అంతమాత్రంచేత మీ రతన్ని చంపాలనిచేసిన ప్రయత్నం క్షమించటానికి వీలు లేనంత దారుణమైంది."

"చెప్పపంతులూ — నిన్ను చంపాలనే వుద్దేశం మా కెప్పుడైనా వున్నదా ?"

"నాస్కూలుసంగతి చెప్పండిబాబూ—"

"మారాజుగా పెట్టుకో — యిదిగో కాఫీ తెచ్చారు. ముందిది తాగు." పంతులు కాఫీ త్రాగుతూ "చచ్చేవాణ్ణి బతికిస్తున్నారు. తీరా బ్రతికినతర్వాత — స్కూలు లేదు పొమ్మంటే —"

"ఎంతమాట పంతులూ — గరటయ్య మాట తప్పేవాడని యీవూళ్లో ఎవరిచేతయినా పలికించు —"

"ఏదో మీదయ..."

"అంతే కాదు — జీత మిచ్చిందాకా కాస్త గింజలుకూడా పంపిస్తాలెండి —"

"ఇక నా విషయం ఫైసలు చెయ్యండి రంగయ్యగారూ —" కొత్తవ్యక్తిఅన్నాడు.

"భోంచేయండి — మాట్లాడుదాం —"

"ఇక మాట లేమున్నయ్ — అనుకొన్న దేదో యిచ్చేయండి —"

"పంతులు బ్రతికాడు. బ్రతికానని చెపుతున్నాడు."

"పంతులు బ్రతకబట్టే మీపై కేసు బాగా చార్జి అయ్యేట్టుంది. అతని సాక్ష్యమొక్కటే చాలు మిమ్మల్ని జైలుకు పంపటానికి. అతన్ని చంపబోయారు. ... ఏమిటిరా అప్పన్నా కారుశబ్దంలాగుందే —"

"అవునండి. మనకారే —"

"చెంబుతో కాస్త నీళ్లు పట్టుకురా — అలా వెళ్ళొస్తాం — ఆలోచించి చెప్పండి ...త్వరగావస్తాం — రారా అప్పన్నా —" అని పొలంవైపు వెళ్ళిపోయారు.

"ఏం పంతులూ బతే యాపక తిన్నావే..."

"నేనేం చేశానండి అయ్యా."

"సరేగాని — నీవు వొక్కసంగతి చెప్పవయ్యా. నన్నెవరూ చంపదలుచుకోలేదు. ఆ వుద్దేశం ఎవరికీ లేదు అని చెప్పు. ఏం. నీ స్కూలుమాత్రం ఖాయం. జీత మిచ్చిందాకా వూళ్ళో గింజలు దండి పంపిస్తాం."

"చిత్తం తమ దయండి బాబూ. అలాగే నని చెపుతున్నాగదండీ" ఇంతలో అక్కడికి పోలీసులతో వొక జీపు వచ్చింది.


"ఓ రయ్యో — పోలీసుకారే." రంగయ్య భయపడుతూ అన్నాడు. జీపులోనుంచి పోలీసు సబిన్స్పెక్టరు దిగి వాళ్లదగ్గిరికివస్తూ—

"ఇటేమన్నా వొక బక్కపల్చటి ఎఱ్ఱటి కుర్రోడు — వొక కన్ను కొంచెం మెల్లిగా వుంటుంది — వచ్చినట్టు చూశారా."

"వచ్చాడండి-యిప్పుడే బైటికి వెళ్లాడు."

"ఎటుపోయాడు — వీళ్లకి అతను వెళ్ళిన దిక్కు చూపండి — పోండిరా — జాగ్రత్తగా పట్టుకరావాలి."

"ఎవరండి అతను."



కృష్ణవొడ్డునుంచి బెజవాడ కొండలు, పట్టణం. ఫొటో: వై. రామకృష్ణరావు—బందరు.

"ఎవరని చెప్పుతుంటారు. వొకచోట మంత్రిగారి అల్లుడు - మరోచోట సేల్సు టాక్సు ఆఫీసరు - యింకోచోట పోగాకు యిన్స్పెక్టరు. ఇట్లే వేషాలు వేసుకొని ప్రజలను బెదిరించి డబ్బుగుంజే వుద్యోగం."

"ఓరి - యీ డిల్లు ... యిప్పటిదాకా అదిరిపించి చంపాడండి మమ్మల్ని."

"ఇక్కడే అవతారం ఎత్తాడు"

"పోలీసు సి. ఐ. డి నని చెప్పి—యీ పంతులు బైర్లుగమ్మి పడుంటే ఆయన్ని మేము చంపామని కేసు పెట్టతానని గోల చేశాడండి."

"వాడు పోయినచోట ఏదో ఒక గలభా వుండాల్సిందే. ఒరే కేపుమారి - మా కొరు మోతవిని వెళ్లివుంటాడు కదూ."

"అవునండి కారు మోత వినగానే- వీళ్లు పట్టుకరమ్మని - చెంబుతో నీళ్ళుతీసుకొని వెళ్ళాడు..."

"కారు దూరంగా నిలిపివస్తే చిక్కవాడే..."

"ఇప్పుడుమాత్రం ఎక్కడికి వెళ్లివుంటాడండి - వీళ్లు పరుగెత్తి వెళ్ళారుగా"—

"చూస్తుండగానే కళ్ళలో దుమ్ముకొట్టి వెళ్లే అసాధ్యుడు వాడు...అరుగో - ఏమిటోయ్ - చిక్కలేదూ?"

"చాకలోపులండి అంతాను. ఎక్కడ్డో పత్తా చిక్కలేదు."

"ఆ...నావెంట రండి - వాడి నివాళి యీ ప్రాంతాలన్ని గాలించి అయినా పట్టాలి - జీపు యిక్కడే వుంటుంది. జాగ్రత్తగా చూస్తుండండి."

పోలీసులు, యినస్పెక్టరు వెళ్లిపోయారు.

"ఓరి వీడికేపు బంగారంగానూ. భయపడి చస్తిమికద గరటయ్యా"

"వాడి మాటలు - వేషం మాను. ఎవుడు మాత్రం బోల్తా పడకుండా వుంటాడు."

"ఆయన ఎవడయితే నాకేంగాని. ఇంత జీవనాధారం కల్పించాడు మహారాజు -" పంతులు భక్తితో అన్నాడు.

"ఏంది పంతులూ - బడి పెట్టుకోమంది మేము, గింజలు దండి యిప్పిస్తామంది మేము, ఆ కేపుమాగోడిని మా గాజాని నేశావే"

"చిత్తమండి అయ్యా! వారు రాకపోతే మీకు యీ మంచిబుద్ధి పుట్టేది కాదేమోనని నా అనుమానం."

"సరెలే. ఏమైతేనేం వచ్చినట్టు పనుండి కార్యం సాధించావు."

"ఏదో తమ దయ - రేపటినుండి బడి పెట్టుకోమంటారుగదూ."

"బడి పెట్టుకొని - మనపని పిచ్చి వేషాలు వేయకుండా"

"ఒంటిపూట బడి పద్ధతికూడా పోయిందటలేండి. రెండు పూటలా పిల్లలు యద్ధేచ్ఛగా రావచ్చు."

"సరే, పోయి, యీ గో కెక్కడయినా జాగ పెట్టించుకో..."

"చిత్తం అండి అయ్యా - రేపటినుంచి బడి పెట్టుకొంటాను."

"అట్లనే - పో. గరటయ్యా యిక రా పోదాం." ★

మూషిగిరి-శేషకాలూ

ఆదివారం సాయంకాలానికి ఇంటికి వచ్చాను సెలవులకి. ఆరాత్రి వరాండాలో కూర్చున్నాము అందరం రేడియో వింటూ. మధ్యమధ్య నేను మా కాలేజీ విశేషాలు చెప్తున్నాను. శేషగిరి (వాడు మా అన్నయ్యలెండి) కాళ్ళు పైన పెట్టుకొని కుర్చీలో కూర్చున్నాడు. ముందు అలా ఎందుకూర్చున్నాడో తెలిసిందికాదు నాకు. తర్వాత మా చెల్లి చెప్పింది. ఇంట్లో ఎలుకలు ఎక్కువగా తిరుగుతున్నాయని. మా యిల్లు చాలా పురాతనమైనది. (మా రాజమండ్రిలాగే మా యిల్లు కూడా రాజరాజనరేంద్రుడి కాలంనాటిదై వుంటుంది) మునుపు పందికొక్కుల బాధ ఎక్కువగా ఉండేది. నేలఅంతా సిమెంటు గచ్చుచేసి, గోడలన్నీ గరుజుచేసిన తర్వాత వాటి బాధ తగ్గింది. కాని మళ్ళి యీ ఎలుకలు పట్టుకున్నాయన్నమాట పైగా శేషగిరివాలకం చూస్తే నవ్వొస్తుంది. ఎలుకలకి భయపడి కాళ్లు కుర్చీలో పెట్టుకున్నాడు. పైగా జూఆలజీ క్లాసులో ఎలుకలతో ఎక్స్పరిమెంట్స్ చేశానని కోస్తాడు వీడు! ఇంతల్లోకే ఓ ఎలక కీచుకీచుమంటూ నా కాళ్ళమీదనుంచి పరుగెట్టింది. చెప్పద్దూ, నాకు నిజంగా ఒళ్లు గగుర్పొడిచింది నేనూ కాస్త భయస్థుణ్ణే కాని మా శేషగిరంత పిరికివాణ్ణి కాదు

మర్నాడే వాటిపని పట్టేయాలనిపించింది. దానికి కావలసిన పరికరం ఎలుకబోను. అదెక్కడో అటకమీద ఉండే వుంటుంది. బ్యాటరీలైటు శేషగిరి కిచ్చి అటకెక్కి ఎలుకబోను తీయమన్నాను. వాడెక్కనుగాక ఎక్కనన్నాడు. వాడి పిరికితనానికి మా అమ్మలగాయితు, మా చెల్లివరకు నవ్వేశారు. నే నొక పీటో బోజాపెట్టి అటకెక్కాను. ఎక్కానన్న మాటే గాని అక్కడ నరకంలా వుంది. చాల ఉక్కగావుంది. చెమటతో ఒళ్లంతా తడిసిపోయింది. కాని ధైర్యంగా బ్యాటరీ లైటు వెలిగించి చూశాను ఒక మూల ఆ బోను కనబడింది. ఒక అరడజను ఎలుకలు దానితో దాగుడుమూత లాడుకుంటున్నాయి. వాటిమీద ఒక బెడ్డ విసిరి అవి పారిపోయిన తర్వాత బోను తీసికొని దిగివచ్చాను ఇంక దానిలో ఒక ఎర పెట్టాలి. వాసనకొట్టే ఒక చేప పెట్టితే అన్నిటికంటె బెస్టు అని చెప్పి మా ప్రక్కింట్లోంచి ఒక ఉప్పుచేప తెప్పించి ముక్కు మూసికొని దానికి తగిలించాను. అది తెగ వాసన కొట్తోంది. రాత్రి 9 గంటలకి వంటింట్లో పెట్టి వరాండాలోకి వచ్చి పడుకొన్నాము. పడుకొన్నామన్న మాటే గాని ఎవరూ నిద్రపోవడానికి ప్రయత్నించడం లేదు. ఆ బోనులో ఎప్పు డెలుక పడుతుందా అని ఎదురుచూస్తున్నాము. కొంతసేపటికి వంటింట్లో అలికిడయింది. పరుగెట్టుకొని వెళ్ళా మందరమూ.

లైటు స్విచ్చివేశాము బోనులో నిజంగా ఎలకేపడింది. కాని నేను స్విచ్చి వేశేసరికి హడిలిపోయి కీచుమంటూ బోను ఊచల ద్వారా బయటికి పారిపోయింది. (ఆ ఊచల మధ్య *space* కన్నా చిన్నది ఆ ఎలుక) గుమ్మందగ్గరున్న మా శేషగిరి "బాబోయ్" అని ఎగిరి గంతేశాడు. ఆ ఎలక వాడి కాళ్ళ మధ్యనించి పారిపోయిందట! ఎలక పారిపోయినందుకు విచారించాలో లేక శేషగిరిని చూసి నవ్వాలో తెలియలేదు మాకు. బోనులో ఎర సగంవరకు తరిగిపోయింద. సరే ట్రై అండ్ ట్రై ఎగైన్ అనుకుంటూ మళ్ళీ లైటు ఆర్పేసి వచ్చాము. ఈసారి మంచాలమీద కూర్చుని ప్రక్కగదిలో బాంబు ప్రేలుతుందేమో నన్నంత ఆదుర్దాగా చూస్తున్నాము. మా శేషగిరింకా షాక్ నించి తేరుకోలేదు. ఇంతల్లోకే పెద్ద పెద్ద శబ్దాలు వినబడ్డాయి. మళ్ళీ అందరమూ పరుగెత్తాము. ఈసారి పెద్ద ఎలకే పడింది. ఘుర్ ఘుర్రుమంటూ బోనులో కొట్టుకుంటున్నది. సరే మన పాచిక పారింది. ఇంక దీన్నెలా చంపడమో ఒక సమస్యయి కూర్చుంది. బయటికి తీసికెళ్లి వదిలిపెట్టడము సమంజసంగా లేదు. బయట వదిలిపెట్టే మళ్ళీ ఇంట్లోకే దూరితే. ఇంతలోకే మా చెల్లి ఒక సజెషన్ చేసింది. నీళ్లున్న గుండిగలో వదిలిపెట్టి రాత్రంతా అందులో వుంచి ప్రొద్దున్నే చచ్చినతర్వాత దాన్ని దానిచేత బయట పారేయించడం. ఆగుండిగ మేం ఉపయోగించడంలేదు కాబట్టి ఈ సజెషన్ చాలాబాగుంది. మా శేషగిరిగాడికి ఏం బుద్ధి పుట్టిందో ఆ ఎలకను గుండిగలోకి నేను వదుల్తాను అన్నాడు. మేం ఆశ్చర్యపోతూ సరేనన్నాము. వాడు ఎలుకబోను ఎత్తి నెమ్మదిగా గుండిగదగ్గరకు వెళ్ళాడు. నేను ఇంకా ఎలుకలు పట్టాలనే వుద్దేశంతో ప్రక్కింటి వాళ్ళని ఇంకో చేప అడగటానికి వెళ్తున్నాను. ఇంతట్లోకే కెవ్వుమని శేషగిరి అరవడం, బోను నీళ్ళలోకి వదిలెయ్యడం జరిగింది. నేను పరుగెట్టి వెళ్లేసరికి వాడొక కాలుమీదే నించుని గోలెత్తున్నాడు. రెండవ కాలు మోకాలు వరకే ఉంది. తర్వాత భాగము కనబడటం లేదు. "ఒరే గిరీ! నీ శేష (మిగిలిన) కాలు ఏదిరా?" అని అరిచాను. వాడప్పుడు ముడిచి వున్న రెండవ కాలు క్రిందికి దించాడు. వేళ్లదగ్గర రక్తం కారుతున్నది. బాధతో వాడు కాలు మోకాలివద్ద వంచి వెనక్కి చేతితో పట్టుకొన్నాడు. ఎదుట్నించి చూస్తున్న నాకు మోకాలివరకే కనబడుతున్నది. అందుకని అలా అడిగాను. ఏంజరిగిందో మా చెల్లాయి చెప్పింది. వాడు ఎలుకబోను పట్టుకొని తలుపు తెరిచాడట ఎలకను నీళ్ళలోనికి వదలడానికి. కాని వీడికంటె జిత్తులమారిది ఆ ఎలక. నీళ్లలోకి పడటం బదులు ఎగిరి వీడి కాలిమీదబడి కసికొద్దీ వేళ్లు కొరికి పారిపోయిందట. ఇది వినేసరికి నాకు నవ్వాగిందికాదు. వాడు కడవలతో కళ్లనుండి నీళ్లు గుమ్మరించేస్తున్నాడు. ఎలుకల బాధ వదలలేదుగాని వాడి కాలు నయమయేసరికి వారంరోజులు పట్టింది. అప్పట్నించి వాడ్ని "మూషిగిరి" (మూషికం + శేషగిరి) అని పిలుస్తుంటాం. నేనుమాత్రం "నీ శేషకాలు ఏదిరా" అని ఏడిపిస్తూనే ఉంటాను.

★

పిడిపార

"పిడిరాయిలాంటి మనిషి ఎలా అయిపోయాడో!" అన్నారు కొందఱు ప్రయాణీకులు, కొందఱు ఉద్యోగస్థులు, కొందఱు కార్మికులు, ఆ రైల్వేప్లాటుఫారమున "ప్రయాణి" వచ్చి ఆగీ ఆగటంతోటే! వెంటవెంటనే ఒక "స్ట్రెచర్" అక్కడ అప్పటికి సంసిద్ధముగా ఉన్న దాన్ని, బండిలోకి చొప్పించి, కొందఱు కార్మికులు ఒక కళేబరాన్ని "స్ట్రెచర్" మీదకు ఎక్కించి దింపారు ఉద్యోగస్థులు ఆ భోగీ అంతా ఖాళీచేయించి, భోగీని బండి నుండి విడదీయించి, వేఱే వెనుకపట్టాల మీదకు తీసుకుపోజేశారు. తట్టలు, పిడి పారలు, గునపాలు ఎన్నెన్నో దించివేయబడ్డాయి. ప్రయాణీకు లందఱూ ఆ భోగీలోను ఈ భోగీలోను మఱోచోట సర్దుకున్నారు. అంతా అరగంటలో పూర్తిఅయి బండికి, బయలుదేఱే ముందు ఇచ్చే అయిదు నిమిషాల కాలం ప్రోత్సాహింపబడింది. బండిలో ప్రయాణించేవారు, ప్లాటుఫారమ్ మీదున్న వారు ఏకచూపు చూచేలా. రైల్వే డాక్టరు కళేబరాన్ని పరీక్షించి "కేవలం చనిపోలేదు ఇంకా ఈ ముసిలివానికి కొస ప్రాణం గుండెల్లో కొట్టుకొంటూవుంది. కునికే దీపాన్ని ఒక్కొక్కప్పుడు ఎగసందోస్తే పూర్తిగా ఆరిపోవడం కద్దు. లేకుంటే మహాజ్వాలగా ప్రజ్వరిల్లడం కద్దు. ప్రయత్నించి చూస్తాను." అంటూ అప్పటికక్కడ ఒక "ఇంజెక్షన్" ఇచ్చాడు. రైలు వెళ్లిపోయింది.

కవికొండల వేంకటరావు

స్ట్రెచర్ మీద మనిషి కదలలేదు. మెదలలేదు. ఊపిరికూడా వదుల్తూ వున్నట్టు అగపించలేదు. "మనిషి బతికి బాగావుంటే భోగీ అంతా ఖాళీ చేయించడమెందుకు?" అని కొందఱి ఉద్యోగస్థుల వాదం.

నేను 'స్ట్రెచరు' మీద పరున్న మనిషిని తిలకించాను. చుట్టూకూడా పరికించాను. నాకు వాని యొక్క ప్రాణం పోవడంకన్న ఆ నిమిషమప్పుడు వాని యొక్క ప్రాబడిన మోము, కడనే పండాకులు రాల్చే చెట్లు, కూడు లేకుండా తిరుగాడే పక్కులు ఇలాంటి వేవో మనస్సుకు నాటజొచ్చాయి.

నేను ఊరికే ఆ దారినిపొయ్యే వ్యక్తిమాత్రుణ్ణి మాత్రమే! ఏ సాయం ఎవరికీ చేసే ఆలోచనగాని, అంతరంగంగాని ఆ నిమిషమప్పుడు నాలోలేదు. నా నేత్రాలు మాత్రమే పనిచేస్తున్నాయి. తదితరింద్రియాలు విరామంగొన్నాయి నాలో తత్క్షణం!

ఆకులన్నీ రాలిపోయి, కొమ్మలన్నీ గోలుపోయి, ఏకైక స్కంధమాత్రంగా వున్న ఒకానొక ఎండుచెట్టు, అదిరా' వాడూ,వా అన్నట్టు ముమ్మొదట సందేహంతోపిస్తూ, క్రమంగా ఆనవాలు పట్టబడి "ఇది అదే!" అన్నంత జ్ఞాపకం వచ్చింది ప్రకృతిమధ్య! దానిలో ప్రాణం లేకపోయినా దానిమీద ప్రాణి నిలబడేని అన్నట్టు ఒక నల్లని పిట్ట ఏదో వాలివుంది కూడాను. ఆ పిట్టను చూచినకొద్దీ అదీ ఆ చెట్టుకు సంబంధించిన దేమో అని కొంతసేపు ఆశ్చర్యము వేసింది కాని, ఇట్టే తుర్రోమని ఎగిరిపోయినంత అది ఆ చెట్టుది కాదనిపించింది.

మఱిచుట్టూ పొలం ప్రకృతి, ఆకుపచ్చగా ఆకులువేసి పసుపుపచ్చగా పూవులుపూసి, అదో వేషం దాల్చిన స్త్రీలా మందమలయానికి చలింపుగంటూవున్నది. కాని ఈ చెట్టుమాత్రం చలనం ఏమాత్రం లేనిదై, స్పర్శకుకూడా తడిచెరడులేనిదై ఉండిపోయింది. దాని నంటి బదనికాలేదు. నాచూలేదు పీచూలేదు. మఱి దాన్ని చెట్టు అనడమా? కట్టెఅనడమా? ఈలా ఆ చెట్టు వంక చూస్తూనే వున్నాను. 'ప్లాట్ ఫారమ్' మీదను ఉన్న ఆ కళేబరాన్ని ఎటకో కార్మికులు మోసుకుపోయారు. సామానేమైందో? ఆఘాగా అంతా ఒక లిప్తలో ఖాళీ! అతి నిశ్శబ్దం! మఱోలిప్త అక్కడే నిలబడానా అంతా సందడే అంతా జనసమ్మర్దమే. ఎంచేతా అంటే మఱో రైలు రాక మానదు కనుక.

నిజంగా ఒక లిప్తకు మఱోలిప్తకు అంత తేడానా అని ఆశ్చర్యము వేసింది, రెండూ అనుభవించాను కాబట్టి నాకు! అలా ఆశ్చర్యము పొందుతూనే వున్నాను కాలం ఆగకుండా జరిగిపోయింది. గంట లెక్కడివో సాయంకాలం ఆరు కొట్టాయి.

మఱో కొంతసేపట్లో సూర్యుడు పూర్తిగా పడమట పడిపోయి, సంధ్యారాగం తెలసే జాడలు పొడగట్ట సాగినాయి! సంధ్యారాగంలో కలిసి చిన్న వజ్రంలా ఒక నూతననక్షత్రం కనబడ జొచ్చింది. క్రమంగా సంధ్యారాగం అంతరించింది. ఆకాశంలో అక్కడక్కడ ఇంకా చుక్కలు విస్పష్టంగా మఱికొన్ని కనిపించ సాగినాయి.

నా నడకయొక్క నాణ్యాన్ని ఆ నిమిషమప్పుడు కడితే, ఏదో అప్పటికప్పుడే మందడి గట్టుపుచ్చుకు, నేను ఈ ప్రపంచాన్నే మఱచి పోయాను ఒకళ్లిద్దఱు మనుష్యులు రెండుమూడు పసువులూ దసులైనా ఎవరో అన్నట్టు నేను పలకరించలేదు. ఎవనివా అన్న విచింతనం పోలేదు.

అయితే పొలంలో మేత పూర్తిగా మేసి, ఇంటికి వచ్చే రెండు గేదల వెనకాల

ఇద్దఱు చిన్నపిల్లలు, ఆడపిల్లలు, ఒకరైకు ఎనిమిదేళ్లు, ఒకరైకు పదేళ్లు ఉండబోలు; వాళ్లిద్దఱూ చేతో చిన్న చొప్పపుల్లపుచ్చుకుని, ఆ పుల్లలతో 'చోచో' అని గేదెల్ని వారి యిళ్లకు తోలుకుపోతూ వున్నారు. వారి ఆ అదలింపునకు నేను మెలకువను గొన్నట్టు, తిరుగ ప్రపంచంలోబడి వాళ్ల సంభాషణ విన్నాను. అది ఇలా నడిచింది

"మాతాత పిడిపార ఎప్పుడూ ధగధగా మనే మెఱసిపోతూవుంటుంది"

"మా బాబు జెండాలు అలాంటి వేలే!"

"అబ్బో! నే నూడనట్టు చెపుతున్నావు! మీ బాబు జెండా లొక్కొక్కప్పుడు రంగు వెలిసిపోయేను. చిఱిగిపోయేను. కాని మాతాత పిడిపార ఎప్పుడూ వాడే! ఎప్పుడూ ధగధగే!" అంది పదేళ్ల పిల్ల

"ఆ స్తమానం తవ్వబోలు మీతాత!"

"కాబోలు! ఆను తవ్వుతూంటే చూచావా ఏనాడైనా! ఇంటికి తెచ్చేలో ధగధగా మెఱసిపోయేని! నా సెప్పడూ చూడలే దాన్ని? తవ్వింది తే మట్టి వుండదూ?

"అవి తే నీళ్లల్లో కడిగేదు కాబోలు రోజూను?"

"కాదే! ఉక్కుతో సేయబడ్డదంట!"

"మీతాత సెప్పాడా?"

"మాతాత సొప్పడమేంటి! అది వాడి బుజంమీద అలా మెఱసిపోవడం నేను సాయంగా చూచేని!"

ఇలా వాళ్లనుకుంటూంటే, ఆ పిల్లతో నేను చెప్పడమా? "ఆ చనిపోయింది దాని తాతేమో?" అని నావితర్కింపు తుద కేమాటా వాళ్లతో చెప్పకుండా అనకుండా, నా మానాన్ని నేను వెళ్లిపోయాను.

....

ఆ పిల్ల ఎంతసేపు మఱివెదకినా ఆ పార కనిపించదు. పారతో తాతా కనిపించడు. తన తాత, అతని పిడిపార ఒకచోటి కెక్కడకో పోయి ఉన్నాయనే ఆమె నమ్మకము అని ఇప్పటికీ నా అమరగానము. ★



వనితాలోకం

మనము - మనసంతానము

'మొక్కై వంగనిది మ్రానై వంగుతుందా?' అన్నది నిత్య సత్యమూ సార్వజనీనమూ అయిన సామెత. శైశవములో వంగనిది మ్రానై వంగదని అర్థమిస్తున్నదీ నానుడి. ఇంతేకాక శైశవములో ఎటుకావాలంటే అటు వంచటానికి సాధ్యమవుతుందనికూడా సూచిస్తున్నది.

బిడ్డల మనసు అతిసున్నితముగా తడిపిన పిండివలె ఎటు తిప్పితే అటు తిరగటానికి అవకాశము కలది కనుక ఈనానుడి బిడ్డల విషయములో నూటికి నూరుపాళ్లు నిరూపితమయింది. ఉరిశిక్షకు పాత్రుడైన ఒక నేరస్థుడు తల్లిని దగ్గరికి పిలిచి "చిన్ననాడే చెప్పకపోతివికదా!" అని విలపించి నిందించాడట. నిజముగా అతడు చేసిన నేరానికి బాల్యములో అతడికి తల్లియిచ్చిన శిక్షణే కాలావరణా కారణమని అందరూ ఎరిగినదే.

బిడ్డలలో మంచి గుణాలుగాని చెడ్డగుణాలుగాని బాల్యమునుండే పొడచూపుతాయి. అప్పుడు వాటిస్వరూపాలు అంకురప్రాయముగా ఉంటాయి. ఈ అంకురాలు బిడ్డలకేర్పడిన వాతావరణాన్నిబట్టి పెరుగుతాయి. బిడలకేర్పడిన వాతావరణము తల్లిదండ్రులచే కల్పించబడినది కనుక వాళ్ల మానసికాభివృద్ధి తలిదండ్రుల చేతిలో ఉన్నది. ఆ కారణముచేత బిడ్డలశీలము నైతికాభివృద్ధులకు తలిదండ్రులతోడ్పాటు చాలా అవసరమూ ముఖ్యమూనని అనుభవజ్ఞులు పదేపదే చెప్పుతున్నారు.

'స్వభావసిద్ధములైన గుణాలను పెకలించి కొత్తగుణాలను సృష్టించటము సాధ్యమా?'

ఇల్లిందల సరస్వతీదేవి

అన్న సందేహము సహజమయినదే. ప్రాణి పుట్టినదగరనుండీ సహజస్వభావాలను పురస్కరించుకొని వాతావరణసహాయముతో మేధస్సును పెంపొందించుకొంటుంది. ఆ కారణముచేత ఆరోగ్యకరమైన వాతావరణము కల్పించటము తలిదండ్రుల విధ్యుక్త ధర్మము.

బిడ్డల స్వభావములో పిరికితనము ఈర్ష్య దురాశ మొదలైన గుణాలు ఉండటము సహజము తల్లిని గుర్తుపట్టగల శక్తి వచ్చిన దగ్గరనుండీ మాటలు రాకపోయినా — సామాన్యముగా బిడ్డలు తల్లి చేతిలో మరొక బిడ్డను చూడగానే ఏడుస్తారు. మరి కొంత పెరిగిన తరువాత ఎదటిబిడ్డచేతిలో ఏ వస్తువయినా చూసి అది తనకు కావాలని ఏడుస్తారు. ఏడాదిలోపు బిడ్డకు ఎదటి బిడ్డ చేతిలో ఉన్న వస్తువును తీసుకోవాలనే కోరిక కలగటము సహజము. కాని దానిని తీసుకోవటము మంచిదో చెడ్డదో తెలియదు. ధర్మమో - అధర్మమో అంతకంటె తెలియదు. ఆ సమయములో ఆ బిడ్డకు ఏది యుక్తమో తెలియచెప్పవలసిన బాధ్యత తల్లిది. ఏ బిడ్డగాని ఎదటిబిడ్డ చేతిలోఉన్న వస్తువును చూసినవెంటనే పైనబడి లాక్కోదు కదా. చూడగానే మొదట కోరికను వెల్లడించి తీరుతుంది. ఆ సమయములో తల్లి ఉపేక్షిస్తే బిడ్డ స్వయముగా వస్తువుకొరకు ప్రయత్నిస్తుంది. అందుకొరకే బిడ్డకు నైతిక శిక్షణ ప్రారంభమయేది సరిగా ఈ కాలములోనే - ఈ సమయములోనే అంటారు శాస్త్రజ్ఞులు.

సామాన్యముగా ఈ సమయములో ఎదటి బిడ్డ ధగ్గరనుండి ఆ వస్తువును మొదటి బిడ్డకు ఇప్పించటానికే తల్లులు ప్రయత్నిస్తారు. సాధ్యమయితే బ్రతిమిలాడిగాని భయపెట్టిగాని బలవంతపరచిగాని ఆ వస్తువును ఆ బిడ్డవద్దనుండి తీసుకోవటానికే ప్రయత్నిస్తారు. ప్రయత్నాలు సాధ్యముకాక - ఆ బిడ్డ పట్టుదలకలదయితే - ఇటువంటి కోరికను కోరినందుకు మొదటిబిడ్డను మందలించటమో-కొట్టటమో సాగిస్తారు.

ఆ సమయములో మొదటిబిడ్డను కొట్ట

టమూ తిట్టటము ఉచితమా? చేయవలసిన పని అదేనా? యోగ్యురాలైన తల్లి ఆపనులు చేయదు. అటువంటి వస్తువు మరొకటి తెచ్చియిచ్చి గాని, అది సాధ్యముకానప్పుడు బిడ్డ మనసును మరొకవైపుకు మళ్ళించటము గాని ఉచితమూ సాధ్యమైన పని; కాని ఎదటిబిడ్డ చేతిలోఉన్న వస్తువును కోరగానే ఇప్పించటము తాత్కాలికముగా ముద్దు చెల్లించినట్లవుతుంది కాని బిడ్డ యొక్క శ్రేయస్సుదృష్ట్యా మంచిదికాదు. ఇటువంటి సందర్భాలు రెండు మూడు తటస్థించిన తరువాత - తాను కోరినదానిని ఏ విధముగానైనా - ఎదటి బిడ్డవద్దనుండి అధర్మముగా - అన్యాయముగానైనా సరే - తల్లి యిప్పించుతుందనే నమ్మకము ప్రలో

భము బిడ్డకు కలిగి బలపడటానికి హేతువు లవుతాయి. ఇవే కాక ఎదటిబిడ్డకంటె - తోటివారందరికంటె - తనలో ఏదో ప్రత్యేకత, గొప్పతనము ఉండబట్టే తనకా వస్తువు లభిస్తున్నదని ఆ బిడ్డలో ఒక రకపు తలంపు ఏర్పడి క్రమముగా అహంభావము క్రింద మారటానికి అవకాశము కలుగుతుంది. అంతేగాని - తల్లి స్వార్థపరత్వమువల్ల గాని - లేక దూరాలోచన లేకపోబట్టి గాని - బద్ధకమువల్లగాని తనకా వస్తువు లభించినదని ఆ పసిబిడ్డ కెట్లా తెలుస్తుంది? ఈ కారణాల ఫలితముగా బిడ్డ స్వభావములో అనుచితమైన ప్రలోభము నిస్సంకోచము - ముందడుగు కలుగుతాయి అవి ఏ రకపువంటే-'అన్నీ తనకే కావాలి - అందరిలో తనకొక ప్రత్యేకత ఉండాలి. తనకు ప్రాముఖ్యము కావాలి-అది అందరి ముందర ప్రదర్శింపబడాలి' ఈ ధోరణిలో బుద్ధి తిరుగుతూ ఉంటుంది. పెరిగినకొలదీ ఈగుణాలు బలపడతాయి.

ఇక రెండవబిడ్డసంగతి ఆలోచిస్తే: 'నీవు చాలా మంచిదానవుగాని నీ చేతిలోఉన్న బొమ్మను ఇవ్వమ్మా' అంటే ఏబిడ్డఅయినా సామాన్యముగా ఇవ్వదు. అందులోనూ - ఇంకొకబిడ్డకు ఇవ్వటానికే అడుగుతున్నారంటే అసలే యివ్వదు. సాధారణముగా పెద్దవాళ్లు ఈబిడ్డకు స్వార్థత్యాగము నేర్పాలని చూస్తారు. ఆ మంత్రము పారకపోతే భయపెట్టి తీసుకోవాలని చూస్తారు. కొద్దిగా జంకు గల బిడ్డలకు ఇటువంటిసంఘటనలవల్ల జంకు మరింత దృఢమైపోతుంది. క్రమముగా ఇది ఒకవిధమైన పిరికితనముక్రింద స్వభావములో నిలచిపోతుంది. 'ఆవస్తువును తాను కోరకూడదుకాబోలు - కోరితే ఎవరైనా కొట్టుతారేమో!' నన్న వెరపు బిడ్డ స్వభావములో నిలచి ఉత్సాహభంగము కలిగిస్తూ ఉంటుంది. ఈ కారణముచేత కొందరు పెద్దవాళ్లయినా జీవితములో 'వెనుకగుడు'గానే ఉండిపోతారు. స్వాతంత్ర్యము - అధికారము - హక్కులు తనకు కూడా ఉంటాయన్న జ్ఞానము నశించిపోతుంది. జీవితములో '*Push*' లేకపోవటానికి ఇదొక కారణము.

మరికొన్ని సందర్భాలలో చేతిలోనివస్తువునుయివ్వనిబిడ్డకు పెద్దవాళ్లు మొదటి బిడ్డమీద అసహ్యాన్ని కలిగిస్తారు. అది 'చెడ్డపిల్ల - గయ్యాళి - దయ్యము - రాక్షసి' కనుక చేతిలో ఉన్న వస్తువును యిమ్మంటారు - ఇచ్చి మంచితనము సంపాదించుకోమన్న అర్థములో. 'నీవు చాలా మంచిదానవు' అని పొగడుతూ ఉంటారు - మంచిదానవు కనుక ఆ వస్తువును ఉంచుకోకూడదు. ఇచ్చివేయాలి' అని సూచిస్తూ. వీటన్నిటితో ఎదటిబిడ్డమీద అసహ్యము కలిగించటము తిట్టటము బొత్తిగా కూడనిపనులు. ఆ బిడ్డ ఎప్పుడు కనబడినా 'రాక్షసి - దయ్యము, గయ్యాళి' అన్నభావాలు ఈబిడ్డ మనసులో నుంచి పోవు ఇటువంటి దురూహాలు నిర్మలముగాను నిష్కల్మషముగాను - ఉండతగిన బిడ్డల మనసులకు చీడపురుగులు.

బిడ్డలసంగతి అట్లా ఉంచి తల్లులసంగతి విచారిస్తే ఎన్నో విచిత్రాలు కనబడుతూ ఉంటాయి ఇద్దరు ముగ్గురు తల్లులు ఒకచోట చేరి మాట్లాడుతూ కూర్చుంటే - ఒక్కొక్క తల్లి దృష్టి బిడ్డమీదనే ఉంటుంది. తన బిడ్డకేమయినా ఇబ్బంది కలుగుతున్నదేమో - అన్యాయము జరుగుతున్నదేమోనని ఒక కన్ను అటే ఉంచుతుంది. ఒక తల్లి నిశ్చింతగా ఉంటుంది - ఎందుకంటే తన బిడ్డ నలుగురిలో ఏ విధముగానైనా గెలుచుకొని రాగలదని. మరొక తల్లి 'ఆ పిల్లలు కొట్టినా నీవు ఏమీ అనకు. నీవు ఎవరినీ కొట్టకూడదు'-అని నిషేధాలను బోధిస్తుంది. 'కొట్టకూడదు - తిట్టకూడదు' అన్నవి ఇక్కడ చెప్పకూడదు. మరొక సందర్భములో - మరొకచోట చెప్పాలి. ఇప్పుడు చెప్పినందువల్ల ఈ బిడ్డకు ఒక విధమైన నిరుత్సాహము, జంకు కలుగుతాయని ఆ తల్లికి తోచదు. మరొకవిధంగా ఈ తగవును పరిష్కారము చేయవచ్చుననుకోదు. 'కొట్టకూడదు' అని కొట్టిన ఎదటిపిల్లలకు ఈమె చెప్పలేక - ఆ కోపాన్ని పోడించి తన బిడ్డకే ఈ బోధచేయటము మంచి శిక్షణావిధానానికి విరుద్ధమని తెలియదు.

మరొక విచిత్ర మేమంటే నీళ్లుగాని పాలుగాని క్రింద పోయినా - ఏ వస్తువయినా పగిలిపోయినా నలుగురు తల్లులు ఉన్నచోట 'ఈపని మా పిల్ల చేయలేదంటె మాపిల్ల చేయలేద'నటము మామూలు. 'మా పిల్ల ఎప్పుడూ అటువంటివి చేయనే చేయదని వ్రాసియిచ్చే తల్లులుకూడా ఉన్నారు. ఎంతకయినా - తమ బిడ్డ ఆపని చేసినదని ఒప్పుకోరు - అనుకోవటానికే అవమానముగా భావిస్తారు. ఇది తెలిస్తే - ఇక పిల్లల కెట్లా ఉంటుందనీ! తానే పనిచేసినా తల్లి కప్పుకొని పోతుందనీ - రక్షిస్తుందనీ ఎంత సంతోషముగానూ - ఎంత గర్వముగానూ ఉంటుందో చెప్పటానికి శక్తిచాలదు.

బిడ్డలుచేసిన పొరపాట్లను తల్లి గ్రహించి సరిదిద్దితేనే కదా ఆ బిడ్డలకు సరియైన మార్గమూ - విధానమూ తెలిసేది?

తనబిడ్డ పొరపాటువల్ల గాని తెలియక గాని తప్పుపనిచేస్తే ఏతల్లీ అవమానకరముగా భావించనవసరములేదు. బిడ్డతప్పును తెలిసికోవటమే తల్లి పరిశీలనాశక్తికీ శిక్షణావిధానానికి తార్కాణము

బిడ్డలకు మంచిబోధచేయాలని కొందరు తల్లులు నీతులను మందులు వాడినట్లుగా వాడుతూ ఉంటారు. అవి అవిఘంగా వంటబట్టవు. ప్రతి మాటలో ప్రతి పనిలో ఈ బోధ అంతర్వాహినిగా ఉండాలి; పుష్టికరమైన ఆహారము దేహానికి బలమును కలిగించినట్లుగా బిడ్డల మనసు నైతికశిక్షణకు అలవాటుపడి ఆరోగ్యకరమైన మనసుతో నిర్మలముగా ఉంటుంది.

బిడ్డల ఆటపాటలు కృతిమించితే తల్లుల స్నేహభావాలు వికటిస్తాయి బిడ్డల విషయములో ఏతల్లికయినా స్వార్థము ఉండనే ఉంటుంది. సభ్యత అనే తెర తొలగిస్తే తల్లికి తనబిడ్డతప్పు మరొకటి కనబడదు. ఇది సహజము.

కాని ప్రతితల్లీ తన బిడ్డయెడల తనకు ప్రేమ ఉండటము సహజముకదా అని ఒక్క తనబిడ్డసంగతేవిచారించితే (అదైనా ఆబిడ్డకు తాత్కాలికమైన ఆనందము చేకూర్చేది) సంకుచిత స్వభావ మనిపించుకుంటుంది. తనబిడ్డక్షేమాన్ని విశాలదృష్టితో చూడటము తల్లి విధ్యుక్తధర్మము తనబిడ్డమీదఉన్న ప్రేమను మరికొంత విస్తృతము చేసి విశాలదృష్టిని అలవర్చుకోవాలి 'అమ్మా' అన్న పిలుపు ఎవరిదయినా తాను ఆదుకోవటానికి సిద్ధపడాలి తన బిడ్డలకే తల్లి నన్న భావము విడచి విశ్వజనని ననుభావము ప్రతి తల్లికీ కలగాలి. అప్పుడు గాని మాతృవాత్సల్యము పరిపూర్ణము కాదు. ★

మరపురాని స్త్రీపాత్ర: "స్వయంసిద్ధ"లో చండి

గాయకుడికి నాదము, స్వరము ఎటువంటివో, చిత్రకారుడికి రంగులు ఎలాంటివో, కవికీ రచయితకీ తమచుట్టూ వుండే వ్యక్తులూ, వారి జీవితాలలోని వివిధ సంఘటనలు అటువంటివే. ముఖ్యంగా నవలారచయిత తన తోటి మానవుల స్వభావాన్ని వారు జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను, ఏఏఘట్టాలలో వారు ఏవిధంగా ప్రవర్తించినదీ, ఏ అనుభూతికి లోనైనదీ అనుక్షణము పరిశీలిస్తూవుంటాడు. తన జీవితంలో తారసిల్లిన వివిధవ్యక్తుల జీవితాలలో నుంచి వివిధ సంఘటనలను క్రోడీకరించి, విభిన్నమైన పద్ధతిలో ఒకదానితో ఒకటి కూర్చి చక్కనికథగా అల్లుతాడు. ఒక్కొక్కప్పుడు మనకు వాస్తవికజీవితంలో తారసిల్లే వ్యక్తులకంటెకూడా ప్రతిభాశాలియైన రచయిత వ్రాసిన నవలలో అతడు సృష్టించిన పాత్రలే అతి సన్నిహితమైనవిగాను, ఆత్మీయమైనవిగాను కనిపిస్తాయి.

ఒక నవలలో ఒక నిరుపేదకుటుంబాన్ని గురించి, వారు పడే కష్టాలనుగురించి రచయిత వ్రాసిన ఘట్టాలను చదువుతూ మనము పొందే అనుభూతి వేరు. నిత్యజీవితంలో అటువంటి కుటుంబాన్ని చూసి మనము పొందే అనుభూతి వేరు. కళావేత్త ప్రతిభవల్ల అతడు సృష్టించిన పాత్రలే మనస్సుకు మరింత చేరువలో కదులుతూ వుంటాయి. నిత్యజీవితంలో మనకి కనిపించే సాధారణమైన విషయాన్నే పాఠకుల, లేదా ప్రేక్షకుల హృదయానికి చేరువగా తేగల శక్తి కళలన్నిటిలోను వుంది. ముఖ్యంగా అటువంటి అవకాశం నవలా రచనలో ఎక్కువగా వుంది; అవకాశం వున్నప్పటికీ ప్రతి రచయిత సృష్టించిన ప్రతిపాత్రా మన హృదయాలకి చేరువగా రాదు. మనం ఎన్నో నవలలు, ఎన్నో కథలు తరుచుగా చదువుతూ వుంటాము., చదువుతున్నంతసేపూ అందులో పాత్రలు మనల్ని ఎంతగానో ఉత్తేజితుల్ని చేస్తాయి. ఆ సమయంలో మనం ఎంత ఉత్తేజితులమయినప్పటికీ, మరుక్షణంలో ఆ పాత్రలను మరిచిపోవటం కూడా సర్వసాధారణంగా జరిగేవిషయమే. ఎన్నటికీ మాయనంత స్పష్టంగా మన మనఃఫలకం మీద చిత్రితమై తలుచుకున్నప్పుడల్లా మనల్ని ఉత్తేజితుల్ని చెయ్యగల పాత్రలుకూడా కొన్నివుంటాయి. అటువంటి మరపురానిపాత్రే 'స్వయంసిద్ధ'నవలలో 'చండి.'

మణిలాల్ బంద్యోపాధ్యాయ రచించిన 'స్వయంసిద్ధలో' 'చండి'పాత్ర అద్భుతమైన సృష్టి. కథాప్రారంభంలో చండిపాత్రను పాఠకులకు పరిచయం చేస్తూనే "చండప్రచండుడయిన 'బాగులీ' జమీందారు హరినారాయణ గంగూలీ, ఆయుర్వేద వైద్యుడయిన కరాలీ చటర్జీగారి కూతుర్ని —త్రాచులాంటి పిల్లఅయిన చండిని చూడటానికి వచ్చాడు" అని ప్రారంభించాడు రచయిత—స్త్రీ ప్రవర్తనలోని లోపాలను పేర్కొంటున్నప్పుడే స్త్రీని త్రాచుపాముతో పోల్చటం సాధారణంగా చాలమంది రచయితలు చేసేపని. కాని చండిని హరినారాయణ గంగూలీ యింటి పెద్దకోడలిగా చిత్రించి, అపారమైన

వి. ప్రభావతి

విజ్ఞానం, అపూర్వమైన నేర్పరితనం, సూక్ష్మగ్రాహ్యత, సంభాషణాచాతుర్యం, నిరంతర కార్యదీక్ష - ఇవన్నీవుండి గొప్ప వ్యక్తిత్వంగల చండి, అత్తవారింట ఎదుర్కొన్న సమస్యలను, వాటిని ఆమె పరిష్కరించిన విధానాలను చిత్రిస్తూ, 'త్రాచులాంటి పిల్లఅయిన చండి'అన్న తన వాక్యాన్ని ఒక ప్రత్యేకమైన పద్ధతిలో సమర్థించుకున్న రచయితప్రతిభ శ్లాఘనీయం.

చండికి ప్రధానం నాడు ఇవ్వవలసిన బహుమతిని గురించి "నీయిష్టమైనది నువ్వు కోరుకునేటట్లయితే, దాన్ని నీ నోటిమీదుగా అడిగితే చాలా సంతోషిస్తాను నేను" అని జమీందారు అనగానే, "తమరు మా వూళ్లో ఒక చక్కని విద్యాలయాన్ని స్థాపించండి. వివాహమయిన మర్నాడు నేను ఆ నూతన విద్యాలయానికి ప్రారంభోత్సవం చేసి, తమ యింట 'గృహప్రవేశం' చేస్తాను" అంటుంది చండి ధైర్యంగా.— ఇది చదువుతూంటే,.. ఈ ఘట్టంలో చండి పాత్రకు ప్రాణప్రతిష్ఠ చేశాడు రచయిత - అనిపిస్తుంది. వివాహానంతరం, 'చండీవిద్యామందిరా'నికి ప్రారంభోత్సవం చేసిన చండి నుద్దేశించి, "చూడు తల్లీ! లోకుల దృష్టికి మానవుడెంత దుర్బలుడుగాను, తీసికట్టుగాను కనుపించినా, అతడి పేరు నిర్మలమైనదీ, శక్తివంతమైనదీ అయివుండాలి. అలా అయితే భగవంతుణ్ణి ఉద్దేశించి ఆ వ్యక్తి చేసే ప్రార్థన ఎప్పుడూ వ్యర్థంకాదు.... నువ్వు స్వార్థంకోసమై భగవంతుని [illegible] ఏమీ అర్థించలేదు...ఈ పాఠశాలా ప్రతిష్ఠాపనకి గంభీరమైన నీ భావనకి సాధనే హేతువు. నువ్వు నిజంగా 'స్వయంసిద్ధ'వి తల్లీ!" అని మామగారంటున్న ఈ ఘట్టం, పాఠకుల మనస్సు అలరించింది.

జమీందారు హరినారాయణ గంగూలీ, రాధానాథ బాపూలీ, పూజామందిరంలో వున్న చండిని చూడవచ్చినప్పుడు, చిత్రాసనంమీద పద్మాసనం వేసుకు కూర్చుని భావోద్దీపితమైన దృష్టిని దేవి చిత్రపటం మీద నిలిపి మృదుమధురంగా దేవీస్తోత్రాన్ని పఠిస్తూ తన్మయురాలైన చండి, పాఠకుల మనోనేత్రానికి కూడా ప్రత్యక్షంగా కనిపిస్తుంది.

చండి శోభనపు గదిలో, తన భర్త ఒట్టి మొద్దనీ, జడభరతుడనీ, పిచ్చివాడనీ, తన అత్తవారి ఉపేక్షవల్ల అతన్ని అలా తయారు చేశారనీ మొదటిసారిగా తెలుసుకున్న ఘట్టం, వివాహానంతరం తల్లికి కనకాంజలిని సమర్పిస్తూ, "పెంచిన ఋణం మాత్రం ఎలాగో తీర్చుకుని సెలవు తీసుకుంటున్నానమ్మా," అని చండి అత్తవారింటికి వెళ్ళిపోతున్న ఘట్టం పాఠకుల హృదయాలను కదిలించివేసింది.


"భర్తకి అత్తవారింట్లో ఏ మాత్రం గౌరవం, ఆదరణ లేవు......తానా పేదయింటిపిల్ల. అటువంటి అమాయకుడికి సహధర్మచారిణిగా ఎలా మసులుకోవటం? తన ఆత్మగౌరవానికిమాత్రం భంగం కలగదని ఎవరు చెప్పగలరు? -" ఇవన్నీ ఆలోచించుకుని ముందుగానే ఒక నిర్ణయాన్ని తీసుకుని బాగులీ జమీందారుల ప్రాసాదంలో అడుగు పెట్టింది చండి. - గోవిందుడి వివాహం ఇష్టం లేకపోయినా, పుత్రుడు వెర్రిబాగులవాడు, వధువు పేదయింటి పిల్ల కనుక, ఇక్కడికిరాగానే తమ ఐశ్వర్యమంతా చూసి నోరు నొక్కుకుని పడివుంటుందనీ, అటువంటిపిల్లని 'తనదాసిగా' ఆమాటకొస్తే 'క్రీతదాసిగా' కూడా చేసుకోవటం సులభమేననీ సమర్థించుకుని మనస్సులోని మాలిన్యాన్ని కప్పిపుచ్చుకుంటూ, ఉత్సాహం తెచ్చిపెట్టుకుంటుం




త్రేతాయుగంలో శ్రీ సీతారాములు నివసించిన "కనకభవనం"—
తదుపరి కాలాలవారొనర్చిన మార్పులతో

అయోధ్యానగరదృశ్యాలు


ఫొటోలు: సి. సీతారాం—మద్రాసు.



కనక భవనం—సీతారాముల నిజనికేతనంలో లోపలిభాగం



కనకభవనం చరిత్రను తెలిపే శిలాశాసనము



అయోధ్యలో వానర సమూహం

గోవిందుడి సవతి తల్లి, రాణీ మాధురీదేవి. కాని, గాంభీర్యంతో, గర్వంతో, ప్రతిభతో తొణికిసలాడుతూ, జడ భరతుడిలాంటి భర్తను తనతోపాటు చురుకుగా నడిపించి, 'మహిమాన్వితయైన మహారాణి' లా వస్తున్న 'చండి' ని తొలిసారి చూడగానే, అత్తగారి అహంభావం దెబ్బతిన్నది. అంతటితో వివాహితయై అత్తవారింట అడుగుపెట్టిన ప్రతి హైందవ వనితా ఎదుర్కొనే సమస్యలే, ఆ జమీందార్లయింట అడుగుపెట్టిన చండికూడా ఎదుర్కొన్నది. అయితే, అత్తవారింట జరిగిన సంఘటనలను ఆమె ఎదుర్కొన్న తీరు, అక్కడ సమస్యలను ఆమె పరిష్కరించిన రీతి ఆహ్లాదకరమైనవి.

పూలపానుపునాటి రాత్రి, ఎలాగయినా చండిని అవమానించాలని కంకణం కట్టుకు వచ్చినమరిది నివారణుని, మృణాళినిని తన సంభాషణాచాతుర్యాన్ని చూపించి ఓడించింది. ఆమెతో యుద్ధానికి సన్నద్ధులై వచ్చినవారిద్దరూ తమ అక్షరతూణీరంనుంచి తీసి ఒక్కొక్క మాటనే ఆమెపైకి విసురుతూంటే చండి వాటిని నిర్భయంగా అందిపుచ్చుకుని, తిరిగి ఆ బాణాలనే, లక్ష్యస్థానం చూసి నేర్పుగా వారిపైకి విసురుతుంది. చివరికి నివారణుని అక్షరతూణీరం ఖాళీఅయి, అస్త్రసన్యాసం చేసి, అవమానం భరించలేక మండిపడుతూ అక్కడినుంచి వెళ్ళిపోతాడు. - ఆదేవిధంగా నివారణుడు చేసిన ఫిర్యాదులన్నీ నమ్మి, విచారణకు వచ్చిన మామగారితో చండి సంభాషించిన తీరు పాఠకులకు మరపురానిది.— "దేహదార్ఢ్యం చూపి, మాటకారితనం చూపి, నన్ను మోసగించావు..." అని మామగారు అన్నప్పుడు, చండి తన మనస్సులోని క్షోభను అణిచిపెట్టుకుని, "నేనూ వంచింపబడ్డాను మామగారూ! మీరే స్వయంగా నన్ను వంచించారు .. కుమారుడి సంగతంతా కప్పిపుచ్చి కేవలం మీ జమీందారీ పటాటోపంతో అమాయకుడైన మా నాన్న చేత అవునని ఒప్పందం చేయించుకున్నారు... మీరు నన్ను ఎలా వంచించిందీ, మీరు నాకు ఎంత ఋణపడివున్నదీ మీకు తెలుసు, మీ మనస్సుకు తెలుసు. నా యీ నష్టాన్ని - మీరు కూడబెట్టుకున్న ధనంతో, మీకున్న శక్తిసామర్థ్యాలతో, మీ పలుకుబడితో, తీర్చగలరా...నా ఋణాన్ని తీర్చగల సామర్థ్యం మీకు లేదు మామగారూ, లేదు." అంటుంది చండి ఉద్దీప్తకంఠంతో. ఇది చదువుతూంటే, చండికి జరిగిన అన్యాయాన్ని, ఆమె మనస్సంక్షోభాన్ని అర్థం చేసుకోగలిగిన ఏ యువతి హృదయం వ్యాకులపడదు! - స్వర్గస్తురాలైన అత్తగారినీ, శిశువుగా వుండగా తన భర్తకి ఆ యింట్లో జరిగిన అన్యాయాన్నీ, తన భర్త విషయంలో జమీందారు చేసిన ఉపేక్షను, ఆ కుటుంబంలో 'స్వార్థపరుల అత్యాచారాల'ను, మామగారి స్ఫురణకు తెచ్చి, ఆయన ఫిర్యాదులన్నీ ఖండించివేస్తుంది. ఆ యింట్లోని "స్వర్ణ గార్దభం" నివారణుడేననీ, గోవిందుడు కాదనీ, ఋజువుచేస్తుంది. తన అసాధారణ ప్రతిభవల్ల జడుడు, మూర్ఖుడు అయిన భర్తకి చక్కని శిక్షణనిచ్చి, విద్యాంసుణ్ణి చేస్తుంది చండి ఉపదేశ ప్రభావంవల్లను, తన కఠోర సాధనవల్లను, గోవిందుడు సరస్వతీదేవిని ప్రసన్నురాలిని చేసుకుని కృతార్థుడవుతాడు.

నివారణుడు, విశ్వామిత్ర మజుందారు చేసిన కుట్రవల్ల, అసత్యప్రచారాలవల్ల, ప్రేరేపణవల్ల కలెక్టరు, కమీషనరు చండిపై కొన్ని అభియోగాలను తీసుకుని, విచారణకు వస్తారు. చండి ఆ అభియోగాలను వారి యెదుటనే అతి మెలకువగా ఖండించి అవన్నీ అన్యాయంగా చేసిన ఆరోపణలేనని ఋజువుచేసి వారిని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ఆ విధంగా 'బాసలీ' ఎస్టేటును, గంగూలీ వంశమర్యాదను, కాపాడిన చండిని చూసి, "అన్ని విషయాల్లోనూ నువ్వే జయించావు. పాషాణానికి చైతన్యం తెచ్చి, సరస్వతీ ప్రసన్నం చేయించావు. 'బాసలీ' పరువు ప్రతిష్ఠలను నిలబెట్టావు. నువ్వు నిజంగా 'స్వయంసిద్ధ'వి తల్లీ!" అంటాడు మామగారు ఆనందంతో. చండి వినమ్రంగా "అంతా దైవేచ్ఛ మామగారూ!" అంటుంది. —ఈ ఘట్టంతో నవల సమాప్తమయింది.

నవల పూర్తిగా చదివి, అందులో పాత్రలనుగురించి ఆలోచిస్తే, ముందుగా చండి, ఆతరువాత హరినారాయణ గంగూలీ మాత్రమే మన మనోనేత్రానికి గోచరిస్తారు. కాని అంతటి ఔదార్యంగల జమీందారు, తన కుమారుని పెంపకంవిషయంలో బాల్యనుంచీ ఉపేక్ష చేశాడు. వివాహవిషయంలోకూడా, తన కుమారుని శ్రేయస్సుమాత్రమే కోరి, తద్వారా చండికి జరుగుతున్న అన్యాయాన్నీ, వంచనను విస్మరించాడు. ఆమె భావిజీవిత సౌభాగ్యము, ఆమె మాంగల్యబలము,—అన్నీ, తాను బహూకరించిన బంగారు కోరడాలోనే వున్నాయని భ్రమించాడు. అయినా చండికి బాల్యంలోనే దైవికంగా లభ్యమైన తాతగారి శిక్షణ, ఆమె అభ్యసించిన విద్య, ఆర్జించిన విజ్ఞానం, వివేకం-ఇవన్నీ ఆమెకు ఒక రక్షాకవచంగా ఉపయోగించి, అత్తవారింట ఆమె ఎదుర్కొన్న వికృత సంఘటనల బారినుండి, అక్కడ జరిగిన వంచననుండి ఆమెను రక్షించాయి. ఆవిధంగా చండి తనను తాను కాపాడుకొని, భర్తను కూడా ఆ 'నల్లమందుమైకం' నుంచి తప్పించుకొని 'విద్యార్థి'వి కమ్మని ప్రబోధించింది. స్వార్జితమైన విద్యవల్ల, విజ్ఞాన వికాసాలవల్ల, వ్యక్తిగత సమస్యలను పరిష్కరించుకొనే శక్తి స్త్రీలకు కూడా కలుగుతుందని 'చండి' ఈ నవల ద్వారా నిరూపించింది.

ఊహాజనితమై, మానవకల్పితమైన ఈ 'చండి' పాత్ర, వనితల హృదయాలలో విశిష్టస్థానం సంపాదించుకుంటుంది. రచయిత కేవలం తన మేధాశక్తితో సృష్టించి వదిలిన ఈ పాత్ర, మన మనస్సులపై మహత్తర ప్రాబల్యాన్ని సంపాదించి, మన చుట్టూ వుండే - అనేకమంది బ్రతికివున్న వ్యక్తులకంటె ఆత్మీయురాలు, చిరస్మరణీయురాలు కాగలిగింది. ★

వనితాలోకం

వెలుబడి

(పెద్దకథ)

జి. పార్వతి

11

లలిత రోజురోజుకూ నల్లబడిపోయి చిక్కిపోతూంది. శాంత రెండేళ్ల పిల్లయినా అస్తమానూ, ఏడుపుతోనూ, పేచీలతోనూ విసిగిస్తోంది. బుజ్జిగాడు ఏంచేస్తూంటాడో ఏమోగాని ఎప్పుడూ డబ్బులు కావాలని ఏడ్పే! .. ఇదంతా కాక తోటికోడలుగారి రాక, కొత్తచుట్టాలు యివన్నీ అర్థంకాని పరిస్థితిగా మార్చాయి ఆండాళుకి. విశాల వేవిళ్లబాధకూడా కొంత సంతోషం కల్గించింది తనకి. ఇప్పుడు భోజనంకూడా మేడమీదే జరుగుతోంది. వంటావిడ, నూకాలు బుగ్గలు నొక్కుకుంటూ "ఏమన్నా! ... వేవిళ్లు అయితే మాత్రం, అంత అపురూపమా!.. ఏమైనా చిన్నబాబు మోసపోయాడు." అని ఏమేమో అంటున్నారు. ఆండాళు కళ్ళెత్తిచూసి "ఎందుకండే దాన్నంటారు? నేను యీ యింట్లో పని నడిపిస్తుంటిని, వంటకి మనిషి పైమనుషులు వుండగా దాని అవసరమేముంది? అందుకనే మేడమీద వుండమన్నాను"అని ఎదటివాళ్లనోరు నొక్కింది.

లలిత పెద్దమనిషి అవటంతో ఆండాళు మరికాస్త కలవరపడింది. ఆరాత్రి శర్మగారు ధైర్యంగాకోడలుఎదుటకువచ్చిమాట్లాడారు. సుబ్బారావు విశాఖపట్నం వుద్యోగానికి ప్రయాణం కట్టాడు రమణ లలితని స్కూల్ ఫైనలు ప్యాసుకానిదే పెళ్ళి వద్దని పట్టుపట్టాడు. ఆండాళు ఏమీ అనలేకపోయింది. శర్మగారు కోడలువేసి, కొడుకులవేసి ఒకసారి చూసి "లలితకి పెళ్లి చేయటమే మంచిదిరా, ఆపని తీరిపోతే ఎవరిదార్ని వాళ్లుండొచ్చు. ఆపైన కావాలంటే అత్తవారే చదివించుకుంటారు" అని వెల్లడించారు. రంగారావు, రమణ ఏమీ అనలేకపోయారు. వాళు నవీనప్రపంచంలో వున్నా తండ్రిని ధిక్కరించే దమ్ము లేనివులే!...

విశాల, సుబ్బారావు విశాఖపట్నం ప్రయాణం కట్టారు. క్రితం రోజున విశాలని బజారు తీసికెళ్ళి చిన్న సంసారానికి సరిపోయే సామాన్లు కొనియిచ్చింది. ప్రసాదరావుగారు కూతుర్ని పంపమని రాసినా సుబ్బారావు అలా వీలుకాదన్నాడు. ఇంక మామగారు అల్లుడి ఎదుట గట్టిగా ఏమీ అనలేకపోయాడు కూడాను. ఆండాళు తోటికోడలికి చీర్లు, దుప్పట్లు అవి కొనియిచ్చింది. విశాల ఎంత యింటితో సంబంధం కల్పుకోకపోయినా ఆఖరు రోజున పెద్దకోడలి ప్రేమ, అభిమానాలకి అమితాశ్చర్యం పొందింది. వెళ్లేరోజు పెద్దావిడ కాళ్ళకి నమస్కారం చేసి "అక్కయ్యా!...నావల్ల ఎన్నో తప్పులు జరిగుండొచ్చు. అవన్నీ నువ్వు క్షమించాలి" అని అంది ఆండాళు నవ్వుతూ "తప్పులు చేయటానికి క్షమించటానికి నేను లెక్కల మేష్టర్ని గాదు నువ్వు విద్యార్థినివి కావు" అని నవ్వింది. సుబ్బారావు ఆఖరిసారిగా బుజ్జిగాడ్ని శాంతని ఎత్తుకుని ముద్దాడి యిద్దరికీ తలొక రూపాయి చేతిలో పెట్టాడు. శర్మగారు కొడుకు కోడల్ని దీవించారు. ఆండాళు మరిదిని పక్కకి పిలిచి "చూడు...నువ్వు అన్నీ తెలుసున్నవాడివి. నీ పెళ్లాం ఏదో తెలీక ఏమాటలయినా అన్నా గాని నువ్వు ఈ యింట్లో అలవాట్లని ఆచారాన్ని పాటించాలి నా తరువాత అదే యీ యింటికి అధికారి తెలిసిందా?..."అని అంది. ఈమాటకి అర్థం సుబ్బారావు గ్రహించకపోలేదు. ఒదినగారి ఎదుట తలవూపి "ఒదినా!...ఈ యింటిని ఏలే చాకచక్యం నీకుగాని మరెవరికీ వుండదు. లలితని, నన్నూ, రమణని తల్లికన్నా ఎక్కువ అభిమానంగా చూశావు ఈ యిల్లు ఏ అశాంతీ లేకుండా నడిచిందంటే అదంతా నీ పలుబడే" అని అన్నాడు. అంతా వింటున్న రంగారావు, శర్మగారు అంతర్యంలో చెప్పలేని బాధ అనుభవించారు.

12

శర్మగారు తన అప్పకొడుకు భాస్కర్ యింజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతోన్నట్టు గుర్తు వచ్చింది. భాస్కర్ తల్లితో తను యింటర్ ప్యాసైన కొత్తలో కాబోలు మేనమామయింటికి వచ్చాడు. లలితను చేసుకోవాల్సుందని అన్నది మేనత్త. కాని చాటున రంగారావు, సుబ్బారావు "కాద"న్నారు. నిజానికి శేషమ్మ లేనిదనే చెప్పాలి ఉన్న నగలూ యిల్లూ తాకట్టుంచి కొడుకు చదువు చెప్పిస్తోంది. డబ్బు సహాయంకోసం అన్నగార్నడిగింది అన్నగారు ఎంతిచ్చాడోగాని అంత తృప్తిగా లేదు శేషమ్మకు. పైగా మరొక యిద్దరు మొగపిల్లలు, ఒక కూతురు వున్న యింట్లో లలిత సుఖపడలేదని గ్రహించి తరువాత ఆలోచిస్తానన్నాడు అన్నగారు. ఈ మాట ఎత్తేసరికి ఆండాళు అదిరిపడింది. "ఏమైనా అనండి కానీ, మన లలితనిచ్చి ఎంత సుఖపడతామో మీకు తెలిసిందే... పిల్లాడు ఒంటరిగాడు కూడా కాదు, ఏది ఎలా వున్నా లేని యింట్లో, తెల్లారి లేచి ప్రతీదీ తడుముకునేచోట, యిటువంటి తల్లిలేని పిల్ల చిట్టితల్లి వెళ్ళివుండలేదు ఏమైనా కానీండి అన్నగార్లకి ఒదినగారికి ముఖ్యంగా కన్నతండ్రికి ఒక్క చిన్నదలుసులాటి పిల్ల, ముద్దుబిడ్డ బరువయిందా? - మీరు వెంటనే వాళ్ళకి లలిత మీకు కాదని రాయండి..." అని ధాటీగా చెప్పేసరికి మామగారు మాట్లాడలేకపోయాడు.

దైవవశాత్తు భాస్కర్ సెలవుల్లో మేన

★ ఏలుబడి ★

మామదగ్గరికి వచ్చాడు. రమణ, రంగారావు అతని రాకకు సుతరామూ యిష్టపడలేదు. లలిత గదిలోకెళ్లి మాట్లాడటం అదీ మాసేసరికి ఆండాళ్లు ఖంగారుపడింది. లలిత వయస్సు వచ్చిన పిల్ల. నిజంగా ప్రేమసముద్రం భాస్కర్‌తోటి కట్టు తెగి ప్రవహిస్తే యింకేమైనా వుందా!...ఈ వయసులో అలాటి మొగాడితో సంబంధం తప్పక ఏర్పడి తీరుతుంది. అంతా బుర్రలో తిరిగేసరికి భాస్కర్‌మీదుంటే ఏహ్యభావం కఠినరూపం దాల్చింది. భాస్కర్, లలిత పుస్తకాలన్నీ చూసి "ఏమే లల్లూ!...నీ సైన్సుపుస్తకం మీద అట్ట చాలా బాగున్నట్టుంది. అట్ట చూస్తుంటే లోపలి గ్రంథం చదువుతూన్నట్టు లేదే!..." అని వేళాకోళం చేశాడు. లలిత కోపంగా "చూడు అబ్బాయి, నువ్వు నన్ను లల్లూ అని పిలిస్తే బాగు లేదు. పూర్తిగా పేరెట్టి పిలిస్తే పిలు. లేకపోతే నాతో మాట్లాడే అవసరం లేదు" అని అంది. భాస్కర్ నవ్వుతూ "మరైతే పిల్చేవాళ్ళందర్నీ ఎలా ఆపగలవు?..." అని అడిగాడు. "పిల్చేవాళ్లెవరు?......అన్నయ్యలు, నాన్నాను. వాళ్లకి నాకు పేరెట్టే అధికారం ఎలా వుందో, పిల్చే అధికారమూ అలాగే వుంది" అని అంది. "ఓహో! పేరు మీ నాన్న అమ్మ పెట్టారుగాని అన్నలు వాలాగే ప్రేమతోనే పిలుస్తారు" అన్నాడు. "నిజమే...మా అన్నలకుంటే ప్రేమ ఎవరివ్వగలరో వాళ్లే పిలవాలి. ఆ ప్రేమ నాకెవ్వరు యివ్వలేరు..." అని అంది. "లేదు...ఆ ప్రేమ మరొక వ్యక్తి కూడా యిస్తాడు. అదెవరో నీకే తెలుసు" అని గుటకరించాడు. అర్థంకానట్టు ఒకసారి భాస్కర్‌ముఖంలోకి చూసి తల వంచుకుంది. ఒళ్ళంతా విద్యుత్ ప్రవహించినట్టయింది. అక్కడ ఆ వాతావరణంలో ఒక క్షణం కూడా వుండలేకపోయింది. అలాటి మాట ఎందుకు తను అన్పించాలి అని అనుకుంది. భాస్కర్ కుర్చీలో కూర్చుని నోట్సులన్నీ తిరగేస్తున్నాడు.

ఒదినగారు లలితను పిలిచి "అత్తకొడుకైతేమాత్రం, అంత మితిమీరి మాట్లాడకూడదు లలితా... నువ్వు వయస్సు వచ్చిన పిల్లవి నీకు సంబంధాలు చూస్తుంటిమి మరి జాగ్రత్తగా మసులుకోవాలి తెలిసిందా?" అని అరిచింది. లలిత ఈమాట విన్నంతనే చాలా బాధపడింది. రాత్రికి తలనొప్పి వచ్చింది కూడాను. భాస్కర్, రమణ అంత శత్రువులులా లేకపోయినా ఏదో కాస్త మాటామంతి వున్నదిగా!...రమణ గది మేడమీద వుండటంచేత భాస్కర్ కూడా అక్కడే వుంటున్నాడు. రమణ స్నేహితుడి పెళ్ళికోసం పక్క వూరు వెళ్ళాడు. లలిత తలనొప్పితో గదిలో కూర్చుంది. ఒదినగారు కాంతకు అన్నం పెడుతోంది. బుజ్జిగాడు మేడమీదికి రమ్మని గొడవ చేశాడు. బుజ్జిని తీసుకుని మేడెక్కింది లలిత. కొబ్బరిచెట్లగాలి ఎగరకొడ్తోంది మేడమీద కెళ్లగానే బుజ్జి పడుకున్నాడు లలిత అన్నగారి పుస్తకాన్ని తీసి తిరగేస్తోంది "లలితా!..." ఎవరిస్వరమో వినిపించింది డాబామీదకి వచ్చింది. "నువ్వా..." "అవును నేనే. నేనే పిల్చా నిన్ను..." అన్నాడు భాస్కర్. లలిత వెనక్కి తిరిగి వెళ్లబోయింది. భాస్కర్ చెయ్యిపట్టుకుని ఆపి "నాతో మాట్లాడకూడదు కాబోలేం ... నిజానికి మేము లేనివాళ్లం. మీ నాన్న అన్నలు నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తారు. గొప్పవాళ్ల బిడ్డలు మాతో ఏం మాట్లాడుతారు లలితా!.." అని అన్నాడు. లలిత నిశ్చేష్టురాలయింది. "కాదు ... భాస్కర్...నా మనసులో గొప్ప, బీదకి తేడా లేదు. నేను తల్లిలేని పిల్లని. నాకీ ప్రపంచంలో నా జన్మలేదు" అని అంది. భాస్కర్ యింకా చనువుగా దగ్గరకు జరిగి "నినొక్క విషయం అడగనా?..." అన్నాడు కంకిస్తూ లలిత తల ఒంచుకుంది. "నిన్ను పెళ్ళి చేసుకోవాల్నుంది లలితా... యిప్పుడు కాదు రెండేళ్లదాకా పెళ్ళిచేసుకోను యింతలో కొంత డబ్బు చేరవేసి మాతమ్ముడికి చదువు చెప్పిస్తా..."

13

లలిత జవాబీయకపోవటంతో భాస్కర్ మనసు కొంత ఖేదపడింది ధైర్యం చేసి రాత్రి మేనమామని అడిగాడు "లలితని ...చేసుకోవాల్నుంది నాకు, నీ కిష్టమేనా?" అని. మేనమామ తెల్లబోయి చూశాడు. సమాధానం యివ్వకపోవటం చూసి తనేదో అపచారం చేసినట్టు బాధపడ్డాడు. కొంత తమాయించుకుని అన్నాడు "అలాగే ఆలోచించి చెప్తానే ..." అని. భాస్కర్ యింక అక్కడ ఆ యింట్లో వుండలేకపోయాడు. ఆ మర్నాడు ప్రయాణమై వెళ్ళిపోయాడు. లలిత ఏదో దెబ్బతిన్నట్టు బాధపడసాగింది. భాస్కర్ అన్న ప్రతీ ముక్క చెవుల్లో

ప్రతిధ్వనిస్తున్నాయి. బీదవాళ్ళా...వాళ్ళూ తిని డబ్బున్నవాళ్ళకిమల్లే కాకపోయినా స్వల్పంగా బ్రతుకుతారుగా!...అయినా తనకి డబ్బుతోకన్నా మనసే ప్రధానంగా కన్పించింది.

లలిత జ్వరంతో ఏమేమో పలవరించటం అదీ చూచేసరికి అండాళు ఆందోళిత అయింది. శర్మగారు కంట్లో వత్తులు వేసుకుని రాత్రీ పగలూ మంచం మీదే కూర్చుంటున్నారు. "అమ్మా...చిట్టితల్లీ...నీకు జ్వరం ఎందుకు వచ్చిందమ్మా?...ఈ ప్రాణిని యింకా ఎంత బాధపెట్టదల్చుకున్నావమ్మా!" అని వాపోయారు. లలిత తండ్రిచేతిని తన నుదుటిమీద వుంచుకుని "నాన్నా...నాకు అమ్మ జ్ఞాపకం వస్తోంది నాన్నా...నేను బ్రతికేమి ప్రయోజనం?..." అని అనసాగింది. అండాళు కళ్ళలో నీరు తిరిగింది. శర్మగారి పెదిమలు ఒణకసాగాయి. ఇంట్లో ఎవరికీ శాంతి లేదు. రంగారావుగారు కోర్టుకూడా మానేసి డాక్టరుయింటికి తెగతిరుగుతున్నారు. అండాళు అనుకుంది మనసులో. శాంతి...మనుష్యులు తెచ్చే అశాంతి కొంత, భగవంతుడు కల్పించేది కొంత. లలిత సుఖపడాలని, అత్తవారింట్లో ఒక మహాలక్ష్మిలా నగలతోను, పట్టుచీరలతోను కలకల మంటూ వుండాలనీ వూహించింది. కాని భగవంతుడు ఏంచేస్తాడో...

నాల్గవరోజు రాత్రి చాలా ఖంగారుపడ్డారు. ఏ టైఫాయిడో అని అనుకున్నారు. లలిత ఏదో మూడు అక్షరాల పదం అన్నట్టు వింది అండాళు. "భాస్కర్! నువ్వు బీదవాడివి కాదు...నాకు మనసే ప్రధానం..." అని. అండాళు అనుకున్నంతా అయింది. శర్మగారు నిట్టూర్చారు. భాస్కర్ నాల్గురోజులకోసం వచ్చి పెద్ద అపచారం అంటే ఏది అవకుండా ఆపుదామని ప్రయత్నించారో అదే జరిగి తీరింది.

శర్మగారు ఏమీ అంతు కనుక్కోలేకపోయారు. లలిత జ్వరం తగ్గుతుందని డాక్టర్ ధైర్యం చెప్పినా అది తగ్గేదికాదని అండాళు తనూ కూడా నమ్మారు. శర్మగారు లలిత తల నిమురుతూ "లలితా!...బంగారుతల్లీ! ... భాస్కర్‌ని పిలువమన్నావా?..." అడిగారు. లలిత కన్ను విప్పి చూసింది. ఏదో తెలీని చిరునవ్వు పెదాల మీద మెరిసింది. రంగారావు అభిమానంతో తల వంచుకున్నాడు. అండాళు అంతు తెలీ-గాని ఆవేదన పడింది.

14

భాస్కర్ రావటంతో లలితజ్వరం పటాపంచలయింది. భాస్కర్ లలిత చేతిని తన చేతిలోకి తీసుకుని "లలితా!...నీకు జ్వరం తగ్గేవరకు నేను వెళ్ళను. మందు తీసుకుని విశ్రాంతి తీసుకుంటె అదే తగ్గుతుంది" అని లాలించాడు. నిజానికి ఆ మర్నాడు లలిత మంచంనుండి లేచి మామూలుగా మసలుకోవటంతో అందరూ ఆశ్చర్యపడ్డారు. లలిత యిప్పుడు పెద్దక్లాసు చదువుతోంది. పైగా శరత్ రాసిన నవలలు పత్రికలు చదవటంతో తను మహావిజ్ఞాని అయింది "పరిణీత"లో జమీందారు బిడ్డయితేనేం? శేఖర్ లలితను ప్రేమించలేదూ?...అదే తన బుర్రలో మెదలసాగింది. కానైతే అక్కడ శేఖర్ గొప్పవాడు యిక్కడ తను గొప్పది.


ఆ రోజును భాస్కర్, లలిత ఒక మహా సుదినంగా భావించారు. భాస్కర్ లలితకు దగ్గరగా జరిగి అడిగాడు. "నావల్ల నీకు జ్వరం వచ్చిందా?...... నేనుండి ఏం ప్రయోజనం.. బీదవాడిని లలితా!..." అన్నాడు లలిత ఆ కౌగిలింత వేడిలో కరగిపోయింది. జీవితంలో ఎప్పుడూ పొందని ఆనందాన్ని పొందింది. "భాస్కర్!...బీదతనం నీ ప్రేమలో మాత్రం లేదు. అందుకనే నువ్వే...యిక నా బీదా బిక్కి తేడాలు ఎత్తవద్దు నా ఎదుట..." అని అంది.

తెల్లారేసరికి అందరూ కొత్త వికాసాన్ని పొందారు. అండాళు మనసులో ఖేదపడినా ఏదోవిధంగా లలితమనస్సు స్థిరమే తనకి ఆనందం. మధ్యాన్నం విశాలకి కొడుకు పుట్టాడనివుత్తరం వచ్చేసరికి లలిత,అండాళు చాలా ఆనందపడ్డారు. బారసాలకి కావలసిన వస్తువులన్నీ సమకూర్చి ప్రయాణమయ్యారు. సుబ్బారావు లలిత జ్వరం తగ్గిందనగానే పెద్ద వుత్తరం రాశాడు లలితకి "తను వచ్చేప్పుడు లలితకి మంచి చీర తెస్తానని." రమణ ఖంగారుపడుతూ వెళ్ళి గాము లిచ్చాడు. లలితకి యింకేం కావాలి?... నెత్తిపైన వుంచుకుని పూజించే అన్నలు,

★ ఏలుబడి ★

ఆదరించే ఒదిన గారు, ప్రాణాధికంగా ప్రేమించే భాస్కర్ లలిత కొత్త మేనల్లుడికి సేటిన్ చొక్కా అదీ కొని వేరే ఇచ్చింది. బుజ్జిగాడు పెద్దవాడయినట్టు లలితా!... కొత్త తమ్ముడు నన్ను "అన్నా!" అని పిలుస్తేనే వూరుకునేది లేకపోతే నేను కొడ్తాను అని అన్నాడు లలిత నవ్వుతూ "నువ్వు నన్ను అత్తా! అని పిలుస్తే, వాడు నిన్ను అన్నా! అని పిలుస్తాడు" అని అంది. అత్తా మేనల్లుడి సంభాషణ విని అండాళు నవ్వుకుంది

శర్మగారు తన కూతురు సుఖపడటం కోసం అడ్డు లేకుండా భాస్కర్ తమ్ముళ్ళకి



తనే చదువు చెప్పిస్తున్నాడు. ఒక చెల్లెలు మూడు నాళ్ళేళ్ళది. మరొక చెల్లిని ఏదో మామూలు సంసారులకిచ్చి పెండ్లి చేశారు. లలితని ఏడాదిదాకా పెండ్లి చేసుకోనన్నాడు భాస్కర్. ముందర కొంచెం నసిగినా రంగారావు అండాళు ఒప్పుకున్నారు. భాస్కర్ చదువు ఆవిటితో సరి. లలిత స్కూలు ఫైనల్ పరీక్షకూడా అంతే!...

15

రమణ, రామంమామయ్య రాసినవుత్తరం చదివి చికాకుపడ్డాడు. అన్నగారిని పిలిచి ఆబ స్త్రీపిల్ల నాకు రోత పుట్టించిందిరా. నేను దాన్ని పనేమీ చేసుకునేది లేదుఅని అన్నాడు. అండాళు అంతా వింటూనే పమిటచాటున నవ్వు నాపుకుంది.

రమణచదువుకూడా అయిపోయింది. జబ్బల్‌పూర్‌లో వుద్యోగానికి వెళ్లాడు. లలిత పరీక్ష ప్యాసవటం భాస్కర్ క్లాసు తెచ్చుకోవటం యింట్లో వాళ్లంతా సంతోషపడ్డారు. అండాళు ముహూర్తం చూసి కానియ్యమంది పెండ్లి శ్రావణమాసంలో పెళ్ళి వైభవంగా జరిపి అంతా చేతులు దులుపుకు కూర్చున్నారు భాస్కర్, లలిత విజయగర్వంలో ఆరాత్రి మైమరిచారు. వాళ్లు కొన్ని నెలలుగా వేచివున్న రోజు అదే!.. కొత్తఆనందం కొత్తశోభ అంతా కొత్తే ఆ దంపతులకి.

అండాళు లలితను విడువలేక విడువలేక వదిలింది. వెళ్తూ లలిత తండ్రి భుజంపైన తలుంచి బావురుమంది. రంగారావు తల నిమిరి "లల్లూ! ... నీకెప్పుడు ఏది అవసరమైతే అది వెంటనే క్షణాలలో పంపుతా" అని అన్నాడు. అండాళు గదిలోకి తీసికెళ్ళి పాతిక రూపాయిలు చేతిలోవుంచి యిది నాసొమ్ము నీకేదికావాలో అది కొనుక్కో అని అంది. భాస్కర్ లలితను తీసికెళ్ళిపోయాడు.

విశాల పిల్లాడ్ని తీసుకుని వచ్చింది పిల్లాడికి పాకడం వస్తే పడిపోతాడన్న భయంతో తోటికోడలుగది పక్కగదిలోనే వుంటోంది. సుబ్బారావు సెలవుమీద యింటికి వచ్చాడు పెళ్లాళ్ళ తరువాత పెళ్ళాన్ని తీసికెళ్ళవచ్చని అప్పటికి బాబుకి అయిదవనెల వచ్చి కాస్త ఎత్తుకునేందుకు వీలుగా వుంటాడని...బుజ్జిగాడు అప్పుడప్పుడు తమ్ముడ్ని ఎత్తుకోటానికి ప్రయత్నించటం వాడు ఏడవటం ఒక అలవాటయింది. శాంత ఐదేళ్ల పిల్లయింది. అండాళు, శర్మగారు లలిత బదులు శాంతని చూసి తృప్తిపడుతున్నారు. అండాళు లలితకి తరుచూ వుత్తరాలు రాస్తూనే వుంది. కొత్తకాపరానికి అన్నీ అమిర్చి పంపినా వెంటనే భర్తతో చెప్పి ఐదువందలు పంపించింది.

అండాళు రెండురోజులుగా ఒంట్లో బాగోలేక బాధపడుతోంది. ఆరోజు జ్వరం కూడా ఎక్కువగా వుండటంతో యింట్లో కొంత అలజడిగా వుంది వంటావిడ ఎదురుగా వచ్చి "ఈవాళ ఏకూర చేయమన్నారమ్మా? ..యింట్లో చింతపండు తక్కువగా వుంది. మిరియాలు, ధనియాలు ముద్దకైనా లేవు" అని మొదలెట్టింది. నూకాలు విసుక్కుంటూ వచ్చి "సూడండమ్మా... బుజ్జి అబ్బాయిగారు ఆ కర్రపుల్లతో నా వంపు బద్దలుకొట్టేశారు, చీపురు పాడు చేసేశారు" అని మొత్తుకుంటోంది. అంతా వింటున్న అండాళుకి ఏం చేయాలో తోచలేదు తను రెండురోజులు బాగోలేక లేవకపోతే అంతా ఎవరిపనులు వాళ్లు మర్చిపోతారు అని అనుకుంది సుబ్బారావు పెళ్లాన్ని పిల్చి "ఒదిన బాగోలేక పడుకుంటే నువ్వు చూడకూడదుటే..." అన్నాడు. విశాల తిప్పుకుంటూ "బాబు నేను లేనికే ఒక క్షణం వుండడు. అయినా నేను ఈ యింటిని ఏలే చాకచక్యం కలదాన్ని కాదని మీరే అన్నారుగా!..." అంది నిష్ఠురంగా.

సుబ్బారావు తన భార్య చదువుకున్నదని ముందర సందేహించినా తన యింట్లో పరిస్థితులవల్ల కొంత మారకపోదని తలిచాడు. కాని అలా కాకుండా స్త్రీలోవుండే ఈర్ష్య, అభిమానం ఏకమై విశాలమనసుని మరింత కఠినపర్చాయి తన అభిప్రాయం యింట్లో వున్నవాళ్లందరూ పెద్దావిడ్ని కొక తన్నికూడా అడిగి అన్నీ చేస్తుండాలని. కాని అలవాటుపడ్డ తరువాత వాళ్లు వుప్పు, పప్పు ఎక్కడుందో తెలీని కొత్తమనిషితో ఎలా సంప్రతిస్తారు? ఈ మాత్రం కూడా ఆలోచించలేకపోయింది విశాల. ఆవేళ పెద్దావిడ ఒంట్లో బాగోలేకపోతే తనెందుకు అడగకూడదు? అదే తనని కలవరపర్చింది.

సుబ్బారావు సెలవు అఖరయింది. అండాళుకుకూడా కొంతనయమయింది. విశాలని తీసుకుని వెళ్లమని చెప్పింది అండాళు. పెళ్ళాన్ని, పిల్లాడ్ని తీసుకుని ప్రయాణమయ్యాడు సుబ్బారావు. బుజ్జిగాడు, శాంత వెళ్లిపోతామని అమ్మ చీర

టికెట్ కలెక్టర్:—ఈ పిల్లవాడు చూస్తే చాలాపెద్దగా కనిపిస్తున్నాడు. ఇంకా అరటికెట్టు చూపిస్తారేమండీ.

పిల్లవాని తండ్రి:—ఏమిటయ్యోయ్. మే మీ పిల్లవాడికి పదిహేను సంవత్సరాలనుంచీ అరటికెట్టే తీసుకుంటున్నాము తెలుసా? నువ్వు మహావచ్చి రూలు మార్చేస్తున్నావే.

—యమ్. నర్సింహారావు,
హైదరాబాద్.

పట్టుకుని ఏడుపు ఆరంభించారు. అది వాళ్ళ కెప్పుడూ మామూలే.

16

సంవత్సరం తిరిగేలోపునే లలితకి గాజులు పెట్టించటం పురిటికి రావటం జరిగింది. ఇంక పదిహేనురోజులు వుండనగా అండాళు జ్వరంతో పడుకుంది. లలిత తల్లిలేకపోయినా ఈ ఒదినగారితో తృప్తి పడింది. కాని తన ఆపత్సమయానికి భగవంతుడు ఆ సహాయంకూడా లేకుండా చేశాడని తల్లడిల్లింది. శర్మగారు స్వయంగా సుబ్బారావుకి పెళ్ళాన్ని పంపించవలసిందిగా వుత్తరం రాశారు. రంగారావు పెళ్ళానికి వైద్యం చేయిస్తూనే వున్నాడు. అండాళు భర్తని పిల్చి "నామాట ఎలా వున్నా లలితని లేడీడాక్టరుకి చూపించండి" అని గట్టిగా చెప్పింది.

మర్నాడు సాయంత్రం విశాలవచ్చింది. లలిత కొంత ఓపికలేని మనిషయినా ఒదినగారిదగ్గర కూర్చుని కొంత వుపశాంతి పొందుతోంది. ఇంక ఆఖరిరోజు వచ్చింది. ఆరోజు అండాళు చాలా బాధపడింది. మొగుడితోను లలిత గది విడిచి రావద్దని చెప్పింది. తనకి ఏదో అంత్యక్షణాలు వస్తున్నవని ఎవరో తరిచి చెప్పారు. బుజ్జి శాంత తల్లిని విడవకుండా కూర్చున్నారు వెర్రి మొహం వేసుకుని. విశాల లలితపక్క కూర్చుంది. శర్మగారు, రంగారావు లలిత పక్కదగ్గర కూర్చుని కష్టాన్ని చూడలేక బాధపడుతున్నారు. లలిత బాధలో ఏడ్చింది. "నాన్నా!..అమ్మ లేకపోయినా ఒదిన వుందనుకున్నా. ఒదినకి ఎలా వుంది నాన్నా!..." అని ఏడ్చింది రంగారావు పెళ్ళాంపక్కదగ్గరకి వచ్చాడు. ఆమె చెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు "ఎలా వుంది?..." అడిగాడు. "కొంచెం నీళ్ళు కావాలి..." అంది. మంచినీళ్లు అందించాడు. "లలిత కష్టపడుతోంది ఏ పిల్ల పుట్టిందీ వెంటనే చెప్పండి...వెళ్ళండి... అక్కడే వుండండి..." అంది అండాళు. రంగారావు చెల్లెలుగదిదగ్గర కెళ్ళాడు. పదిహేను నిమిషాల్లో కూతురు పుట్టిందని చెప్పింది మంత్రసాని.

అంతే...రంగారావు సంతోషంతో పెళ్ళాంగదిని చేరాడు. బుజ్జి, శాంత తల్లి చెరొకవైపూ పడి ఏడుస్తున్నారు "అమ్మా లేవే..." అని. రంగారావు పెళ్ళాం చెయ్యి పట్టుకున్నాడు. పెద్ద గావుకేక వేశాడు. సంతోషం, విచారం......అన్నీ ఏకమయాయి. ఇల్లు అశాంతి!...అశాంతి ...శాంతి...ఏదీ నిర్ణయించలేము. ఆఖరి క్షణంలో కూడా కన్నపిల్లలకన్నా ఆడబిడ్డ సంగతికే బాధపడింది. ఆమె ఏలుబడిలో ఎవరికీ అశాంతి లేదు

(అయిపోయింది)

బొమ్మరిల్లు

కోరిక

"పరాశర"

అందముగ నే నొక్క
మందారమైతేను
బాలల్లు నాకొరకు
గోల చేస్తా రెంతో;
వచ్చి పోయేవాళ్లు
మెచ్చుకుంటా రెంతో;
తేనియలు గ్రోలుటకు
తీయగా పాడుతూ
కొదమతుమ్మెద లెన్నో
ముదముతో వస్తాయి.

పక్షివృతము నాకు
మహారాజ అవుతుంది.

కాను, పువ్వును కాను,
పెద్ద పక్షిని యాదు.
పక్షి నైతే నేను
తోటలందున పక్షి
గుంపు లెన్నో వచ్చి
గూళ్లు కడతాయి.
గొడ్లుకాసేవాళ్లు
గోలచేస్తూ వచ్చి—
నీడలో గుమిగూడి
ఆడుకుంటారు; నా
కొమ్మల్లో కోయిలలు
కమ్మగా పాడేను.

కాను పక్షిని కాను,
గండుకోయిల నౌదు.
కోయిలను ఐతేను
హాయిగా నేను, లే
జిగురుటాకులు మేసి
ఎగురుతుంటాను.
కొండల్లో కోనల్లో
తోటల్లో తోపుల్లో
ఇచ్ఛవచ్చిన చోట్ల
స్వేచ్ఛగా తిరుగుతూ,
హాయిగా ఆడెదను,
తీయగా పాడెదను.

వడగాడ్పు వీచినా
జడివాన కురిసినా
ఎక్కడకు వెళ్ళేది?
దిక్కెవరు నాకు?
నిద్ర ఎక్కడ నాకు?
భద్రమెక్కడ నాకు?
వలదు నాకీకోరి
కల కలలువద్దు.
అమ్మ వొడిలో నెపుడు
హాయిగా ఉంటాను.
అన్నింటికంటేను
అమ్మపెట్టే ముద్దు
అధికమ్ము నాకు.

బొమ్మరిల్లు సీరియల్



టామ్‌సాయర్ ప్రపంచ యాత్ర

మార్క్ ట్వేన్

టామ్‌సాయర్, హాకల్ బెరీ ఫిన్ నవలలు పాఠకులకు సుపరిచితాలు. బాలుర మనస్తత్వానికి మనోహరమైన రూపకల్పన టామ్‌సాయర్ పాత్ర. పై రెండు నవలలూ చదివినవారు టామ్‌సాయర్, అతని ప్రియశిష్యుడూ, అనుచరుడూ అయిన హాకల్ బెరీ ఫిన్ పాత్రలను ఎన్నటికీ మరిచిపోలేరు. అదొక విచిత్రమైన వాతావరణం. ఆ వాతావరణం కిందటి శతాబ్దపు ప్రథమార్థభాగంనాటిది. అయితేనేం, ఈ నవలలద్వారా ఆ వాతావరణం మన కళ్లకి కట్టి సుపరిచితమైనట్లే కనిపిస్తుంది. పై రెండు నవలలకూ తరవాతి కథ ఇప్పుడు మీరు చదవబోయే సీరియల్. టామ్, హాక్, జిమ్ ఈనవలలో చేసే సాహసాల్లో, వినోదాల్లో మీరూ పాల్గొని ఆనందించండి.

1

ఇంతవరకూ చేసిన సాహసాలతో టామ్‌సాయర్ తృప్తిపడి ఊరుకున్నాడనుకున్నారా? ఉహు; లేదు. నీగ్రో జిమ్‌ను బానిసతనంనుంచి విముక్తుని చేయడం, తనకాల్లో తుపాకి తూటా ఇరుక్కుపోవడం మొదలైన సాహసాలెన్ని జరిగినా అతనికి తృప్తి మాత్రం కలగలేదు. పైగా ఇంకా ఎక్కువ సాహసాలు చెయ్యాలనే ఆరాటం కలిగింది.

మీకు తెలుసోలేదో—మేము నదిమీద దీర్ఘ ప్రయాణం చేసిచేసి, దిగ్విజయంచేసిన వీరాధివీరుల వలె, చివరికి మా స్వగ్రామం వచ్చేసరికి, గ్రామం యావత్తూ దివిటీలుపట్టి ఎదుర్కొని బ్రహ్మాండమైన స్వాగతమిచ్చింది. సభలు, సమావేశాలు, ఉపన్యాసాలు జరిగాయి. జయజయధ్వానాలు చెలరేగాయి. కొందరు మాగౌరవార్థం తప్పతాగి తందనాలాడారు. చూస్తుండగానే మేము జగజ్జేతలమైపోయినట్లనిపించింది. ఇంతకంటె టామ్‌సాయర్ కింకేమి కావాలి?

కొంతకాలంపాటు అతడు బాగానే వున్నాడు. జరిగిన గౌరవం చాలుకని సంతృప్తిపడ్డాడు. ప్రతివాడూ అతన్ని మహావ్యక్తి అన్నట్టే చూసేవాడు.


★ టామ్ సాయర్ ప్రపంచయాత్ర ★

టామ్ కూడా తల ధీమాగా పైకెత్తుకుని, ఊరంతా తన సొంత ఆస్తి అయినట్టు సంచరించేవాడు. కొందరతన్ని "దేశసంచారి టామ్‌సాయర్" అని బిరుద పూర్వకంగా పిలిచేవారు. అతడు ఉబ్బి తబ్బిబ్బై పోయేవాడు. ముఖ్యంగా నేనన్నా, జిమ్ అన్నా లెక్క చేసేవాడు కాదు. ఎందుకంటే మేము నదిమీద మామూలు డింగీబోటులో ప్రయాణం చేసి, వచ్చేటప్పుడు మాత్రమే పొగఓడలో వచ్చాము. టామ్ సాయర్ వెళ్లేటప్పుడూ, వచ్చేటప్పుడూ కూడా పొగ ఓడలోనే ప్రయాణం చేశాడు. అదీ అతని అతిశయానికి కారణం. ఊళ్లో పిల్లలు నన్నూ, జిమ్‌నూ చూసి మా దేశాటనానికి అసూయపడేవాళ్లు. కాని టామ్ ముందు మేమెంత? అతనితో పోలిస్తే తాము కేవలం కీటకాధములని బాధపడేవాళ్లు.

మావూళ్లో నాట్ పార్సన్స్ అనే మానవుడు లేకపోయినట్లయితే, బహుశా టామ్‌సాయర్ తను ఇంతవరకూ చేసిన దేశాటనంతో తృప్తిపడి పూరుకునే వాడేమోనని నా అనుమానం. ఈ నాట్ పార్సన్స్ అనే మానవుడు మావూళ్లో పోస్టుమాస్టర్ గిరీ వెలిగిస్తున్నాడు. గడకర్రలాగ పొడుగ్గా, పల్చగా ఉండేవాడు; బోలెడు చాదస్తం; ఏళ్లు పైబడినందువల్ల సంక్రమించిన బట్టతల; వసపోసిన పిట్టలాగ విరామం లేనివాగుడు; ఉన్నంతలో పరోపకారిత్వం—ఇవన్నీ ఆయనగారి లక్షణాలు. గడచిన ముప్ఫయ్ ఏళ్లుగా అంత గొప్ప దేశసంచారి మావూళ్లో లేడని ఆయన కొక ప్రశస్తివుంది. దాన్ని చూసుకుని ఆయన తెగ మురిసిపోయేవాడు. ఈ ముప్ఫయ్ ఏళ్లలోనూ కనీసం మూడులక్షల సార్లైనా తన దేశసంచారం గూర్చి ఆయన ఉపన్యసించి, ప్రతిసారీ తన గొప్పతనానికి తనే చంకలు కొట్టుకుని వుంటాడు. అయితే ఆయనకి కొత్తగా ఒక ఆందోళన పట్టుకొన్నది. ముప్ఫయ్ ఏళ్ల నుంచీ ఆయన అనుభవిస్తున్న కీర్తిని కాస్తా, పదిహేనేళ్లయినా నిండని టామ్‌సాయర్ అనే కుర్రకుంక కాజేసేశాడు. ప్రతివాడూ టామ్ భజన చెయ్యడమే. ప్రతివాడూ టామ్ స్తోత్రం చెయ్యడమే. అటువంటప్పుడు నాట్ పార్సన్స్ అనే పెద్దప్రాణికి ఎలా ఉంటుంది చెప్పండి. ప్రాణం ఉసూరు మనదూ? నలుగురు సమావేశమైన ప్రతిచోటా టామ్‌సాయర్ తన సంచార కథ వినిపించేవాడు. శ్రోతలు "అబ్బా! ఓస్! ఏం సాహసం, ఏం సాహసం!" ఇత్యాది ఆశ్చర్యార్థకాలతో చిత్తుచిత్తు అయిపోయేవాళ్లు. టామ్ కథ మధ్యలో కొంచెం విశ్రాంతి తీసుకోడానికి ఆగగానే, నాట్ పార్సన్స్ కొంచెం సందేహిస్తూనే తన కథ ఎత్తుకునేవాడు. కాని అతనికథ పాతబడిపోయిందికదూ? అందుచేత ఎవరూ దాన్ని పట్టించుకునేవాళ్లు కాదు. నాట్ పార్సన్స్‌కు ఉసూరు మనిపించేది. విజయగర్వంతో టామ్ మళ్లీ తనకథ కొనసాగించేవాడు. అతడు ఆగేసరికి రెండోవాడు అందుకునేవాడు. రెండోవాడు ఆగగానే మొదటివాడు. ఈ విధంగా గంటాగంటన్నరసేపు ఒకరినొకరు మించాలని ప్రయత్నించేవారు.

అసలు నాట్ పార్సన్స్ దేశసంచార ప్రతిష్ఠకు ఆధారభూతమైన కథాక్రమం ఎట్టిదనగా:—అప్పటికి ఆయన కొత్తగా పోస్టుమాస్టర్ ఉద్యోగంలోకి వచ్చాడు. ఉద్యోగరీత్యా ఇంకా ముక్కుపచ్చలారని వాడున్నూ, చిదిమిన పాల్గారుపసిమిబుగ్గలవాడున్నూ. ఇలా ఉంటుండగా, ఒకరోజున ఒక ఉత్తరం వచ్చింది. ఆఉత్తరం ఎవరికి వచ్చిందో ఆపేరుగల మనిషి వూళ్లో లేనేలేడు. అందుచేత ఉత్తరం నాట్ పార్సన్స్ దస్కులోనే పోయింది. రోజులు, వారాలు గడిచినా ఉత్తరం అక్కడే ఉండిపోయింది. దాన్ని చూస్తేనే ఆయనకి వొంటిమీద తేళ్లూ, జెర్రులూ పాకేవి. పైగా ఆ ఉత్తరం రాసిన మహానుభావుడెవడోగాని తపాలా బిళ్లలైనా అంటించలేదు. అందుచేత ఆ పదిసెంట్ల బకాయీ అలాగే ఉండిపోయింది. ప్రభుత్వం ఆబకాయీకి తననే బాధ్యుడుగా చేస్తుందనీ, ఇంతవరకూ దాన్ని వసూలు చెయ్యనందుకుగాను తన్ను బర్తరఫ్ చేసినా చేయవచ్చుననీ నాట్ పార్సన్స్ భయపడ్డాడు. ఈభయంతో అతనికి రాత్రిళ్లు నిద్ర పట్టేదికాదు; అన్నం సయించేదికాదు; బెంగతో చిక్కి శల్యమైపోసాగాడు. సలహా అడుగుదామంటే ఎవర్నని అడుగుతాడు? ఎవరినైనా అడిగితే, అతగాడు కాస్తా తనమీద ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే? చివరికి ఆవుత్తరం ఎవరికంటాపడకుండా చేయాలని,

నేలతవ్వి పాతిపెట్టాడు. కాని ఆస్థలంలో ఎవరైనా నుంచున్నంతసేపూ, అతనితల భూగోళంలా తిరిగేది; చెమటపోసి తడిసి ముద్దయ్యేవాడు. ఇది లాభం లేదనుకుని ఆరాత్రి పొద్దుపోయేదాకా మేలుకుని, ఊరంతా మాటుమణిగిన తర్వాత లేచి ఆ ఉత్తరంతీసి వేరేచోట పాతిపెట్టేవాడు. గ్రామస్థులు మాత్రం అతనికి దూరంగా తొలిగిపోయేవారు. అతన్నిచూస్తుంటే, అప్పుడే హత్యచేసి వచ్చినవాడి



★ టామ్ సాయర్ ప్రపంచయాత్ర ★

వరిసో, మరేదో చెప్పరాని ఘోరంచేసిన వాడి వరిసో కనిపించేవాడు. అదే ఎవడన్నా కొత్తవాడైతే ఊళ్లో వాళ్లీపాటికి తన్నిపాతేసి వుందురు.

ఇంతకీ చెప్పొచ్చిందేమంటే, ఈ మానసిక హింసను అతడిక భరించలేకపోయాడు. అందుచేత ఏకంగా వాషింగ్టన్ కేపోయి, అమెరికా అధ్యక్షుని దర్శనం చేసుకుని, ఒక్కరవ్వకూడా దాచకుండా జరిగిన విషయం యావత్తూ ఆయనకి నివేదించి, ఉత్తరం తీసి ఆయనబల్లమీద పెట్టి, తనసంగతి అటో యిటో తేల్చేసుకోవా లనుకున్నాడు. "ఇదిగో ఆ ఉత్తరం! నాకు మీాయిష్టంవచ్చిన శిక్ష విధించండి; అనుభవిస్తాను. నేను నిర్దోషిని. నాకుదేవుడేసాక్షి. నేను శిక్షకు పాత్రుణ్ణికాను. పిల్లలుగలవాణ్ణి. నన్ను శిక్షిస్తే నా పిల్లలు మలమలమాడిపోతారు..." అని విన్నవించుకోవాలనుకున్నాడు.

అంతపనీ చేశాడు. కొంతదూరం పొగఓడలో, మరికొంతదూరం గుర్రపుబగ్గీలో, ప్రయాణంచేశాడు. కాని ఎక్కువదూరం గుర్రంమీాదే స్వారీచేశాడు. వాషింగ్టన్ చేరడానికి మూడువారాలు పట్టింది. దోవలో బోలెడుదేశం, బోలెడుగ్రామాలు, నాలుగు మహానగరాలు చూశాడు. మొత్తంమీాద వెళ్లి రావడానికి ఎనిమిదివారాలు పట్టింది. దాంతో ఆచుట్టుపక్కల అతడు చాలా గొప్పవాడై పోయాడు. ప్రతివాడూ అతన్నిగూర్చే మాట్లాడేవాడు. అతన్ని ఒక్కసారి చూసి జన్మలు సార్థకంచేసుకోడానికి జనం ముప్ఫయ్మైళ్ల దూరంనుంచి, ఇలినాయిస్ రాష్ట్రపు చివరలనుంచి వచ్చేవారు. ఆ దృశ్యాలు అమెరికన్ చరిత్రలో అపూర్వమైనవి.

ఇంతకీ, వీళ్లిద్దరిలో ఎవరెక్కువ దేశసంచారులో చెప్పడం దుర్ఘటమైపోయింది. కొందరు నాట్ పార్సన్స్‌ను వెనకేసుకొస్తే, మరికొందరు టామ్ సాయర్‌ను వెనకేసుకొచ్చేవారు. దేశపటంలో రేఖాంశాల్నిబట్టి చూస్తే నాట్ పార్సన్స్ తిరిగినంత అడ్డంగా టామ్ తిరగలేదని అంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. కాని టామ్‌సాయరేనా తక్కువతిన్నది? నాట్ అడ్డంగా తిరిగితే టామ్ నిలువుగా తిరిగాడు. అతడు దాటినన్ని అక్షాంశాలు నాట్ దాటలేదు. పైగా టామ్ భిన్నభిన్న శీతోష్ణస్థితులుగల దేశంచూశాడు. అందుచేత ఆ విషయంలో ఒకరికొకరు తీసిపోలేదు. ఇకపోతే, ఎవరెక్కువ ప్రమాదపూరితమైన సాహసాలు చేశారన్నది తేలవలసి వుంది. టామ్ కాల్లో ఒకానొకప్పుడు ఇరుక్కున్న తుపాకి తూటా సంగతి ఎత్తినప్పుడల్లా నాట్ పార్సన్స్ కొంచెం వెనక్కి తగ్గేవాడు. అయినా పూర్తిగా వెనుకంజవేయకుండా, తన సాహసాలే గొప్పవిగా వర్ణించేవాడు. ఈ వాగ్యుద్ధంలో టామ్ ఎంతప్రయత్నించినా లాభంలేకపోయేది. అతడు ఎంత కుంటుతూనడిచి, తన తుపాకితూటా ప్రమాదం అందరికీ ఎరుకపడేట్టుచేసినా, ఒకరోజున నాట్ పార్సన్స్ వాషింగ్టన్‌లో చేసిన సాహసం ముందు అది బలాదూరైపోయేది. (దీనికోసంగాను, టామ్ తన కాలిదెబ్బ పూర్తిగా నయమై పోయినతర్వాత కూడా, ఇంటిదగ్గర రాత్రిళ్లు కుంటడం సాధన చేసేవాడు.)

నాట్ పార్సన్స్ చేసిన సాహసంఇది— కాని వింటే అతడు చెబుతున్నప్పుడే వినాలి. వినేవాళ్ల నెత్తురు గడ్డకట్టేలాగ, మొహాలు పాలిపోయేలాగ, ఉచ్ఛ్వాసనిశ్వాసాలు నిలిచిపోయేలాగ చెప్పేవాడు. ఒక్కోసారి ఆడమ్మాయిలు మూర్ఛపర్యంతం అయ్యేవారు. అందుచేత శాయశక్తులా నాకు జ్ఞాపకమున్నంత వరకూ మనవి చేస్తాను:—

నాట్ పార్సన్స్ వాషింగ్టన్ చేరుకున్నాడు. గుర్రాన్ని కట్టేశాడు ఉత్తరంపట్టుకుని సరాసరి రాష్ట్రపతి భవనానికి వెళ్ళాడు. అక్కడివాళ్లు రాష్ట్రపతి శాసనసభాభవనానికి వెళ్లాడనిన్నీ, మరికొంచెం సేపట్లో ఫిలడెల్ఫియా ప్రయాణమై పోవచ్చుననీ కూడా చెప్పారు. కలుసుకోవాలంటే ఒక్కనిమిషమైనా ఆలస్యం చేయకుండా పరిగెత్తాల్సి వుంటుందని అన్నారు. రాష్ట్రపతి భవనానికీ శాసనసభాభవనానికీ గల దూరాన్ని తలుచుకునే సరికి నాట్ గుండె బద్దలైనంత పని అయింది. పోనీ గుర్రంమీాద తగలడదామా అంటే అది అడుగుతీసి అడుగు పెట్టేస్థితిలో లేదు. ఏంచేస్తాడు? ఇంతలోకే ఒకనీగ్రో గుర్రాలబగ్గీ తోలుకుంటూ అటు వస్తున్నాడు. వెంటనే వాణ్ణికేకేశాడు.

"అరగంటలో నన్ను శాసనసభకు తీసుకు

పడితే నీకు అర్థడాలరు ఇస్తా. ఇరవైనిముషాల్లో నే తీసుకు పడితే ఇంకో పావుడాలరు ఎక్కువిస్తాను."

"రెడీ," అన్నాడు నీగ్రో.

సాట్ పార్సన్స్ బగ్గీలోకి దూకికూర్చుని తలుపులు వేసుకున్నాడు. నీగ్రో శరవేగాన గుర్రాలు తోలుతున్నాడు. రోడ్డు గతుకులుగా వుంది. బండి అతుకులుగా వుంది. వేగం అమితంగా వుంది. కడ్డీలు పట్టుకుని ప్రాణాలు ఉగ్గబెట్టుకుని కూర్చున్నాడు సాట్.

ఇంతలో బండీ ఒక బండరాయికి ఢీ కొట్టింది. వెంటనే బండీ అడుగు ఊడిపోయి, బండీపైకెగిరింది. మళ్లీ కిందికి వచ్చేసరికి సాట్ తాలూకు కాళ్లు కిందికి వేళ్లాడు తున్నాయి. అతడు కడ్డీలుమాత్రం వదలలేదు. చాలాభయపడి పోయాడు.

"ఆపరాబాబో" అని పెడబొబ్బలు పెట్టాడు. రోడ్డుమీది జనంకూడా, అతడి పరిస్థితిచూసి ఆపమని అరిచారు. కాని వాళ్లు అరిచినకొద్దీ వేగంగా ఆ నీగ్రో వాడు తోలడం మొదలెట్టాడు.

"ఎందుకండయ్యా, అలా అరుస్తారు? మిమ్మల్ని చిటికెలో అక్కడికి తీసుకెళ్లనూ? కూకోండి మెదలకుండా" అన్నాడు. ఇంకా త్వరగా తోలమని వాళ్లరుస్తున్నట్లు వాడు భావించాడు. ఈ విధంగా ఆగుర్రాల బగ్గీ వాయువేగ మనోవేగాలతో అధమమేఘాల మీద పరిగెత్తింది.

రోడ్డుమీది జనంకూడా భయంతో నిశ్చేష్టులైపోయారు. ఎలాగైతేనేం శాసనసభకు చేరుకున్నారు. అంత త్వరగా అంత దూరం గుర్రాలు పరిగెత్తించడం ఎక్కడా కనలేదు, వినలేదు అని అంతా అంగీకరించారు. గమ్యస్థానం చేరడంతోనే గుర్రాలు కూలబడ్డాయి. సాట్ పార్సన్స్ దభీమని కిందపడ్డాడు. అతన్ని ఇవతలికీడ్చారు. బట్టలు చిరిగి తునాతునకలైపోయాయి; వళ్లంతా దుమ్ముకొట్టుకున్నది. కాని టైముకి చేరుకున్నాడు. రాష్ట్రపతిని కలుసుకున్నాడు. ఉత్తరం చూపించాడు. అంతా సలక్షణంగా జరిగిపోయింది. రాష్ట్రపతి అతన్ని చాలా ఉదారభావంతో సుంచున్నపళంగా క్షమించేశాడు. సాట్ పార్సన్స్ బండివాడికి వాగ్దానం చేసిన అర్థడాలరూ, పావుడాలరూ కాక ఇంకో పావుడాలరుకూడా అదనంగా బహూకరించాడు. ఆ బండీయే దారక్కపోతే అంత త్వరలో అక్కడికి చేరుకునే వాడా మరి?

సాహస కార్యమంటే ఇదీ, ఇలా వుండాలి. ఈ కారణంచేత, సాట్ పార్సన్స్‌తో సరితూగడానికి టామ్ తన కాలిదెబ్బను ఎంతప్రదర్శించి వుండాలో, ఎంత అద్భుతంగా కుంటివుండాలో మీరే ఆలోచించండి.

వివాహము



కెప్టన్. బ్రహ్మాండం శివ నాగేంద్రరావు (స్వర్గీయ బి. రామకోటేశ్వరరావుగారి పుత్రుడు) గారికిన్ని చి॥ సౌ॥ కృష్ణవేణి (శ్రీ పాటిబండ మార్కండేయులు ఎం. ఏ. బి ఎల్. రిటైర్డు జిల్లాజడ్జిగారి ద్వితీయ పుత్రిక) కిన్ని గుంటూరులో 16-10-54 న వివాహం జరిగిననాటి ఫోటో.

★ టామ్‌సాయర్ ప్రపంచయాత్ర ★

నెమ్మది నెమ్మదిగా టామ్‌కీర్తి మాసిపోసాగింది. గ్రామస్థులు కబుర్లు చెప్పుకుని కాలం వెళ్లదీసేందుకు ఇతర విషయాలు కావలసినన్ని కొత్తగా వచ్చాయి. మొదట ఒక గుర్రప్పందెం, దాని తర్వాత ఒక యిల్లుతగల బడిపోవడం, దాని తర్వాత ఒక సర్కసు, దాని తర్వాత నీగ్రోలను వేలంపాట పాడడం, దాని తర్వాత ఒక గ్రహణం. ఇన్నీ అయిన తర్వాత ప్రజలుమళ్ళీ మొదటి విషయాలకే వచ్చారుగాని, అప్పటికి టామ్‌నుగూర్చి కొత్తగా మాట్లాడుకోదగినది రవ్వంతైనా కనిపించలేదు. టామ్ పేరు చెబితేనే ప్రజలకి చిరాకు పుడుతోంది. అతడు రోజురోజుకీ బెంగపెట్టుకుని దిగులుగా ఉంటున్నాడు. ఒకరోజున అడిగాను, "ఏమిటి, నీస్థితికి కారణ" మని. అతడు తన హృదయం పగిలిపోతోందన్నాడు.

"కాలచక్రం దొర్లిపోతోంది. నేను పెద్దవాణ్ణయి పోతున్నాను. పోనీ ఏదైనా యుద్ధంవస్తుందేమోనని చూస్తే, అది కలలోకూడా అనుకోడానికి లేకుండా వుంది. ఎంత కాలమని నేనిలా జీవచ్ఛవంలా, ఊరూపేరూ లేని అనామకునిలాఉండిపోతాను? ఏదీ సాగతి?" అని బావురు మన్నాడు. నాకు తెలుసు. ఆయీడు కుర్రాళ్లలో ఎక్కువమందికి అలాంటి ఆలోచనలే వస్తూవుంటాయి. కాని పైకి చెప్పుకున్నవాడు ఒక్క టామ్ తప్ప ఇంకెవ్వరూ నాకు తగల్లేదు.

చాలా రోజులు టామ్ ఆలోచించాడు, తనకీర్తి దశదిశలా వ్యాపింపజేసే ఉపాయంకోసం. చివరకి ఓ చక్కని ప్లానుకుదిరింది. నన్నూ, జిమ్‌నూకూడా తన ప్లానులోకి తీసుకుంటానన్నాడు. ఇలాంటి విషయాల్లో టామ్‌సాయర్ అంత ఉదారుడు మరొకడు లేడు. మన దగ్గిర ఏదైనా మంచితాయిలం వున్నప్పుడు స్నేహంగా, వినయంగా దగ్గిరజేరేపిల్లలు చాలామందే వుంటారు. కాని ఆతాయిలం వాళ్లదగ్గిరే ఉన్నప్పుడు మన ఛాయలకైనా రారు. మన దగ్గిర ఆపిల్‌పండు వుందనుకోండి. తొక్కపెట్టినా చాలని కాళ్ళావేళ్ళాపడి బతిమాలే పిల్లలు వెయ్యినొక్కమందివుంటారు. కాని ఆ పండు వాళ్ళదగ్గిరే వుండనివ్వండి. 'నేనిదివరకు నీకు తొక్కపెట్టాను కదా, ఇప్పుడు నాకుపెట్టు' మని అడగండి.

'అమ్మో ఎంతాశే' అని ఒక్కసారిగా ఒంటంతా కరకరా నమిలేసి, వట్టిచేతులు చూపించి వెక్కిరిస్తారు. అది వాళ్ళస్వభావం. కాని అటువంటి వాళ్లు సాధారణంగా బాగుపడరు. మనం కొంతకాలం ఆగిచూస్తే, వాళ్లు బాగుపడేదీ లేనిదీ తెలిసిపోతుంది. మావూళ్ళో జేక్‌హూకర్ అనే అబ్బాయి ఏమయ్యాడు? పైనచెప్పినట్లుగా ప్రవర్తించినందుకు, రెండేళ్లు కాగానే నదిలోమునిగి, పాపం చచ్చిపోయాడు.

సరే, మేము ముగ్గురం కొండమీద అడవిలోకి వెళ్ళాము. టామ్ తనప్లాను వివరించి చెప్పాడు. అది 'క్రూసేడ్'

"'క్రూసేడ్' అంటే ఏమిటి?" అని అడిగాను.

ఆమాత్రం కూడా తెలియనివాడు తన స్నేహితుడైనందుకు సిగ్గుపడుతున్నట్టు మొహం పెట్టాడు.

"హక్‌ఫిన్! నీకు 'క్రూసేడ్'అంటే తెలియదా? నిజమేనా వేళాకోళమా?"

"నాకు నిజంగానే తెలియదు. తెలియకపోతే వచ్చేనష్టం కూడాలేదు. ఇంతవరకూ అదేమిటో తెలియకుండానే బతికాను; దానివల్ల నా ఆరోగ్యం కూడా చెడిపోలేదు. పైపెచ్చు దిమ్మచెక్కలాగా వున్నాను. నువ్వు యిప్పుడు చెబితే తెలుసుకుంటాను. లేనిపోని విషయాలన్నీ తెలుసుకుని వాటితో నాబుర్రంతా పాడుచేసుకోవడం నా కిష్టంలేదు తీరా తెలుసుకున్న తర్వాత వాటితో ఏంచెయ్యాలో తెలియదుకూడాను. మన వూళ్ళో లాన్స్‌విలియమ్స్ అనేవాడుండేవాడే? వాడు 'చోక్టా' భాష నేర్చుకున్నాడు. నేర్చుకుని ఏం చేశాడు? ఆ భాష మాట్లాడేందుకు ఒక్కడైనా 'చోక్టా' దొరికితేనా? అలాగే చచ్చిపోయాడు. వాణ్ణి పాతిపెట్టడానికి అప్పుడొచ్చాడు ఒక 'చోక్టా'. అది సరేగాని, 'క్రూసేడ్' అంటే ఏమిటి? దానివల్ల డబ్బేమన్నా సంపాదించవచ్చునా?"

"హక్! నువ్వు మూర్ఖుడివి. క్రూసేడ్ అంటే అదొకరకం యుద్ధం."

టామ్‌కు మతి పోతోందనుకున్నాను. కాని మతీ పోలేదు, గితీపోలేదు. తెలివిగానే మాట్లాడుతున్నాడు.

"క్రూసేడ్ అంటే మతయుద్ధం. పుణ్యక్షేత్రాన్ని మహమ్మదీయులనుంచి సంపాదించడానికి చేసేయుద్ధం."

"ఏ పుణ్యక్షేత్రం?"

"పుణ్యక్షేత్రంఅంటే ఒక్కటే; ఇంకోటి లేదు."

"దాంతో ఏంచేద్దాం?"

"ఏంచేద్దామంటావేమిటి? అది మహమ్మదీయుల చేతుల్లో వుంది. వాళ్ళదగ్గిర్నించి లాక్కోవడం మన కర్తవ్యం."

"మన పుణ్యక్షేత్రాన్ని వాళ్ళ నెందుకు తీసుకోనిచ్చాం అసలు?"

"మనం తీసుకోనివ్వడంకాదు. అసలు మొదటి నుంచీ అది వాళ్ళ చేతుల్లోనే వుంది."

"అయితే అది వాళ్ళదేనన్నమాట?"

"అవును. కాదని ఎవరన్నారు?"

చాలాసేపు ఆలోచించాను. కాని ఈ సమస్య తెగేటట్లు లేదు. చివరి కిలా గన్నాను:

"టామ్‌సాయర్! ఇది నా పేదబుర్రకు మించిన విషయంలా కనిపిస్తోంది. నా కొక పొలం ఉందనుకో. అది నాదైనప్పుడు ఇంకొకడు వచ్చి అది తనకు కావాలని చెప్పి—"

"అబ్బబ్బ! నీకేం తెలియదు హక్! అది పొలం లాంటిది కాదు. పుణ్యక్షేత్రంవున్న స్థలం మహమ్మదీయులదే కావచ్చు. కాని వాళ్ళది ఆ నేలమాత్రమే. ఆ నేలను పుణ్యక్షేత్రం చేసింది ఎవరు? మన యూదులూ, మన క్రైస్తవులూ. అవునా? అటువంటప్పుడు మన పుణ్యక్షేత్రాన్ని నానాభ్రష్టం చెయ్యడానికి వాళ్ళెవరు? అది మన కవమానంకాదా? ఒక్కనిమిషంకూడా దాన్ని మనం సహించకూడదు. వాళ్ళమీదికి దండెత్తి దాన్ని తిరిగి లాక్కోవాలి."

"నా కిందులో నబబేమీ కనిపించడంలేదు టామ్! నా కొక పొలం వుందనుకో. దాన్ని ఇంకోడు—"

"మళ్ళీ పొలం అంటాడూ? పొలం అంటే వ్యవసాయానికి సంబంధించినది. మామూలువ్యాపారం లాంటిదన్నమాట. కాని ఇది అంతకంటే ఉన్నతమైనది; మతసంబంధమైనది; పూర్తిగా భిన్నమైనది"—"

"ఇంకొకళ్ళస్థలాన్ని మనం ఆక్రమించుకోవడం మతసంబంధమైనపని అంటావా?"

"ఆ; అక్షరాలా. ఇది ఏనాటినుంచో వస్తున్న సంప్రదాయం."


జిమ్ నిట్టూర్చాడు: "టామ్‌గారూ! ఇందులో ఏదో తిరకాసు ఉందనుకుంటానండి. నాకూ దేముడూ, దయ్యం ఉన్నారు. దేముడంటే భక్తివున్న వాళ్ళని చాలామందిని చూశాను కూడాను. కాని మీరు చెప్పినట్టు చేసేమనిషిని నే నెక్కడా చూడలేదండి," అన్నాడు.

టామ్ చాలా చిరాకుపడ్డాడు: "అబ్బ! ఊరుకోండిరా. మీ బుర్రల్లో మట్టితప్ప ఏమీ లేదు. మీకు చరిత్ర కాస్తన్నా తెలిసి ఏడిస్తేనా? రిచర్డ్, పోప్, గాడ్ఫ్రీ డీ బులాయిన్, మొదలైన మహాపురుషులు, దైవభక్తులు అనేకులు రెండువందలఏళ్ళకు పైగా మహమ్మదీయులతో ఘోరాతిఘోరంగా పోరాడారు. పుణ్యక్షేత్రాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. నిలువులోతున రక్తపు నదుల్లో ఈదులాడారు. ఇంత మహత్కార్యం చరిత్రలో జరిగితే, మిస్సోరీరాష్ట్రపు పల్లెటూరి దద్దమ్మలు ఇద్దరుచేరి, ఆ మహాపురుషులు చేసినపనుల్లో మంచిచెడ్డలను నిర్ణయించడానికి పూనుకున్నారు! హు. ఇంతకన్న పిచ్చితనం ఇక వుందా?"

టామ్ ఉపన్యాసం వినేసరికి అప్పటిదాకావున్న మా బింకం సడలిపోయింది. మేము ఎంత తెలివితక్కువదద్దమ్మలమో తెలిసివచ్చింది. నేను నోరెత్తలేకపోయాను. జిమ్ కొంతసేపు ఊరుకుని ఇలాగన్నాడు:

"అంతేలెండి. అంత గొప్పగొప్పవాళ్ళకే అది తప్పని తెలియనప్పుడు, మనలాంటి పల్లెటూరి బైతుల కేం తెలుస్తుంది? అది మన కర్తవ్యమే అయితే, తప్పకుండా చెయ్యవలసిందే అయినా ఆ మహమ్మదీయులమీద జాలి కలుగుతూనే వుంది. చూడండి. వాళ్ళెవరో మనకి తెలియదు. వాళ్ళు మనకి కాస్తయినా అపకారం చెయ్యలేదు. మరి అలాంటివాళ్ళని పోయి చంపడం కష్టంగానే వుంటుంది. చూడండి. మనం ముగ్గురం వాళ్ళ దేశం వెడతామనుకోండి. మనకి చాలా ఆకలిగా ఉందనుకోండి. కాస్త ఏమన్నా పెట్టండని అడుగుతామనుకోండి. వాళ్ళుకూడా మనలాంటి మనుషులే కనక మనకి ఆహారం పెడతారనుకుంటాను. అటువంటప్పుడు——"

"ఊ—అటువంటప్పుడు?"



హరిణ యూధం — ఫోటో : సి. సీతారాం.—మద్రాసు.

★ టామ్ సాయర్ ప్రపంచయాత్ర ★

"టామ్‌గారూ! నేను చెప్పే దేమిటంటే— మనకేమీ అపకారం చెయ్యనివాళ్లని చంపడం, అది బాగా అలవాటైవుంటే తప్ప, చాలా కష్టం. నాకీసంగతి బాగా తెలుసు. మాటవరసకి, ఇవాళ రాత్రి, వెన్నెల పోయినతరవాత, నేనూ, మీరూ, హాక్‌ఫిన్ ముగ్గురం గొడ్డళ్లు తీసుకుని, నది దాటివెళ్లి, అవతల వొడ్డున కాపురం వుంటున్న ఆ కుటుంబం వాళ్లందర్నీ చంపేసి, వాళ్ళయిల్లు తగలబెట్టేస్తామనుకోండి."

"ఊరుకో జిమ్! నీకేమీ తెలియదు. మీతో మాట్లాడుతుంటే నాకు ఉన్నమతి కాస్తా పోతోంది. మీలాంటివాళ్లతో వాదన వేసుకోవడమంత తెలివి తక్కువలేదు. ఎంతసేపూ అసలు విషయాన్ని వదిలేసి ఏదో యేదో చెప్పుకొస్తారు! నేనేదో వేదాంతాన్నిగురించి మాట్లాడుతుంటే మీరు వట్టి రాజకీయాల్ని గూర్చి చెప్పుకొస్తారు! మీతో లాభంలేదు."

నిజానికి టామ్‌సాయర్ మమ్మల్ని సరిగా అర్థం చేసుకోలేదు. నేనేమన్నాను, జిమ్ ఏమన్నాడు ఇంతకీ? మేమేం తప్పుడు మాటలు మాట్లాడలేదే? అతడు చెప్పిందే రైటనీ, మేమన్నది తప్పనీ ఒప్పుకున్నాంగదా? అయితే మేమన్నది ఎందుకు తప్పో మేముకూడా తెలుసుకునివుంటే మంచిదని ప్రయత్నించాం. అంతే. మరి మాతప్పు మాకు టామ్ సాయర్ ఎందుచేత చెప్పలేకపోతున్నాడు? మేము కేవలం మూర్ఖులం గనక. నిజమే. మేము మూర్ఖులమే,

శుంఠలమే. అయితేమాత్రం శుంఠలవడం పాపమా? నేరమా?

కాని ఇదేమీ వినిపించుకోలేదు టామ్. మేమే గనక అతడు చెప్పినవిషయాన్ని బోధపరుచుకుని వుంటే, క్షణంలో రెండు వేలమంది సైనికులను పోగు చేసేవాణ్ణనీ, వాళ్లకి ఆపాదమస్తకం ఉక్కు కవచాలు తొడిగించేవాణ్ణనీ, నన్ను ఉపసేనాపతిగానూ, జిమ్‌ను దళవాయిగానూ చేసి తాను సేనాధిపత్యం స్వీకరించేవాణ్ణనీ, మహమ్మదీయులందర్నీ టకటకా ఓడించి పారేసి, సముద్రంలోకి తోసివేసేవాణ్ణనీ చెప్పాడు. అప్పుడతని కీర్తి దిగంతాలదాకా వ్యాపించి అస్తమించేటప్పటి సూర్యబింబంలాగా ధగధగా మెరిసిపోయేదని అన్నాడు కాని ఇంత గొప్ప అవకాశం చేతికొస్తే అందుకునే తెలివితేటలు మాకు లేవు గనుక, తాను చేయగలిగిం దేమీ లేదని అన్నాడు.

అతడు చేయగలిగిం దేమీ లేకపోవడంవలన వచ్చేనష్టం లేదనుకున్నాను నేను స్వతహాగా శాంతికాముణ్ణే నాకు అపకారం చెయ్యనివాళ్లతో దెబ్బలాట పెట్టుకోవడం నా స్వభావంలో లేదు.

అసలు టామ్‌సాయర్ ఈ 'క్రూసేడ్' ప్లాను అంతా ఎక్కణ్ణించి సంపాదించాడో నాకు తెలుసు. సర్ వాల్టర్ స్కాట్ పుస్తకాల్లో దాన్నిగురించి చాలా వుంది. ఆ పుస్తకాలు అతడు ఎప్పుడూ చదువుతూ వుంటాడు. కాని నా ఉద్దేశ్యమేమిటంటే, ఆ ప్లాను శుద్ధదండగవ్యవహారం. అంతమంది సైనికులను అతడెలాగూ సంపాదించలేడు. ఒకవేళ సంపాదించినా, యుద్ధంలో పరాజయం పొందేవాడే. అందులో సందేహంలేదు. నేనుకూడా ఆ పుస్తకాలన్నీ తెచ్చి చదివాను. నా కర్థమైనంతవరకూ, ఆ మతయుద్ధాల్లో పోరాడడానికిగాను, ఇల్లూ వాకిల్లూ వదిలి వెళ్లినవారందరూ యుద్ధంలోగాని, యుద్ధంతరవాతగాని సుఖపడలేదనిమాత్రం నేను చెప్పగలను.

(ఇంకా వుంది)

నీతి మేడ

చెన్నపట్టణం జార్జిటవునులో బందరు వీధి అనే వీధి ఉంది. ఆవీధిలో ఖాళీసీసాల దుకాణం ఒకటి ఉంది.

ఆ అంగడియజమాని అబ్దుల్ సత్తార్ అనే సాహేబు. అతని క్రింద వేణునాయకర్ అనే గుమాస్తా పనిచేస్తూండేవాడు.

కొందరు వీధి వీధమ్మటా తిరిగి ఖాళీసీసాలు కొనుక్కొచ్చి సత్తారు సాహేబుకు అమ్ముతూండేవారు. వేణునాయకరు వాటిని రకంవారిగా పేర్చి బుడ్లు కావాలంటూ వచ్చిన వాళ్ళకి ఎక్కువ ధరకు అమ్మి సాహేబుగారి వ్యాపారం సాగిస్తూండేవాడు.

నాయకరుకి సాహేబు నలభై రూపాయలు జీతం ఇస్తూండేవాడు. చెన్నపట్టణంలో నలభై రూపాయలతో గడపటం నాయకరుకి కష్టంగా ఉండేది. కాని సీసాలవ్యాపారంలో వచ్చేలాభం కూడా తక్కువ అని అతగాడికి తెలుసు. కనుక అతడు జీతంఎక్కువచెయ్యవలసిందని యజమానిని అడగలేకపోయాడు.

ఎక్కువ సంపాదించటానికి మరొక చోట నౌకరి చూసుకోడమా, లేకపోతే తనే సొంత వ్యాపారమేదైనా చెయ్యడమా, అని ఆలోచించాడు నాయకరు.

ఒకని చేతిక్రింద పనికన్న స్వంత వ్యాపారమే మంచిదని తోచింది. కాని ఏ వ్యాపారాన్నికైనా పెట్టుబడికి సొమ్ముకావాలి. అదే లోపమైంది నాయకరుకి.

'నా తెలివినే పెట్టుబడిగా పెట్టి వ్యాపారం ప్రారంభిస్తాను.' అనుకున్నాడు వేణునాయకరు. నెలాఖరయేసరికి సాహేబు నలభైరూపాయలూ లెక్కపెట్టి అతగాడిచేతిలో పెట్టబోయాడు. నాయకరు, "ఈ సొమ్ములో ఐదురూపాయలకు

పాలంకి
వెంకటరామచంద్రమూర్తి

బదులు ఖాళీసీసాలను ఇవ్వండి." అన్నాడు.

సాహేబు ఆశ్చర్యపోతూ, 'సీసాలు ఏంచేసుకుంటావు నాయకర్?' అని అడిగాడు.

నాయకరు, 'ఏదైనా అరఖు తయారుచేసి అమ్ముదామని ఉంది. రేపటినుంచి మీ కొట్టుకు రాను.' అన్నాడు.

కంటికి ఇంపుగా ఉన్నసీసాలను నాయకరే ఎన్నుకున్నాడు. ఆ మర్నాటినుంచి అతడు సత్తారు కొట్టుకు రాలేదు.

మరొక నెలగడిచింది. సత్తారు అంగడికి నాయకరు వచ్చి, 'సలాం, సాహేబ్, అందమైన సీసాలు ఒక వంద కావాలి.' అన్నాడు.

సాహేబు, 'ఎన్నికావలసినాసరే పట్టుకు వెళ్లు. కాని కాస్సేపు కూర్చుని నీ సమాచారం చెప్పు. ఏం అరఖు తయారు చేశావు?' అన్నాడు.

వేణునాయకరు తన సంచీలోంచి ఒక సీసాను తీసి సత్తారుకు చూపించాడు. దానిలో ఉన్న అరఖు గులాబిరంగులో ఉంది. సీసామీద నవ్వుముఖంతో, ఒక స్త్రీ దుడ్డులాంటి తన పిల్లవాణ్ణి ఎత్తుకుని చూపిస్తోన్నట్టుగా బొమ్మ ఒకటి అంటించి ఉంది. 'వెల మూడు రూపాయలు మాత్రమే.' అని ఆ కాగితం మీద అచ్చువేసి ఉంది.

'బలేగా తయారుచేశావే? ఏమిటి ఈమందు?' అని అడిగేడు సత్తారు.

'ఇది కడుపుతోనున్న స్త్రీలకు పనికివచ్చేమందు. ఈ ఔషధం పుచ్చుకొంటే మగపిల్లవాడు పుడతాడు. ఆడపిల్ల కావాలన్న వాళ్ళకి ఇది పనిచెయ్యదు.' అన్నాడు వేణునాయకరు.

'మగపిల్లవాడు పుట్టకపోతేనో?' అన్నాడు సాహేబు.

'పుట్టకపోతే సొమ్మువాపసు చేసేస్తాను. ఆమాట కూడా ఈ బొమ్మకింద అచ్చువేశాను.' అన్నాడు నాయకరు.

నాయకరుమాట సాహేబుకి సబబుగానే తోచింది. కాని 'నెల క్రిందటిదాకా నా కొట్టుమీద సీసాలు అమ్మిపెట్టేవీడికి ఔషధాలు చెయ్యటం ఎలాగ తెలిసింది?' అన్న సందేహం మాత్రం కలుగక పోలేదు.

'నాకు మందులు చెయ్యటం

తెలియని మాట నిజమే. కాని గోసాయి ఒకాయన నాకీ చిట్కా చెప్పేడు.' అన్నాడు నాయకరు.

'అలాగైతే నాకు ఈ సీసాను ఇయ్యి. మూడు రూపాయలకు బదులు ఖాళీసీసాలను తీసుకో. మా బీబీకి ఈసారి మగపిల్లవాడు పుడితే నీకు మరొక పది సీసాలు ఉచితంగా బహుమతీ ఇస్తాను. కనుక మళ్ళీఆడపిల్ల పుట్టిందంటేమట్టుకి మూడు రూపాయలూ నగదు రూపంలో వాపసు చెయ్యాలి.' అన్నాడు సత్తారు.

సత్తారుకి అప్పటికి ఐదుగురు ఆడపిల్లలు కలిగేరు. ఈమారైనా మగపిల్లవాడు పుట్టాలని ఆతడు అల్లాను ప్రార్థించాడు. అల్లాకటాక్షం వల్లనో అరఖు ప్రభావం వల్లనో బీబీ ఈ మారు మగపిల్లవాణ్ణే ప్రసవించింది.

సత్తారు సంతోషానికి మేర లేదు. అతగాడు వేణునాయకరు ఇంటికి పరుగెత్తేడు. నాయకరు భార్య, 'ఆయన క్యాంపులో ఉన్నారు. పదిహేను రోజులకు కాని రారు' అంది.

'క్యాంపుకు పోతూంటాడా, తరుచుగాను?' అని అడిగేడు సత్తారు.

'ఔను నెలకు పదిహేను రోజులు క్యాంపులోనే ఉంటారు. ఊరూరూ వెళ్లి ఆమందు సీసాలను అమ్ముతారు. తక్కిన పదిహేను రోజులూ ఎక్కడికీ కదలక విశ్రాంతి తీసుకుంటారు.' అంది ఆమె.

'ఆమందుసీసాలు బాగా అమ్ముడౌతున్నాయా?' అన్నాడు సాహేబు.

'ఆ మీదయవల్ల కాబడి బాగానే ఉంది. కొంతసొమ్ము వెనకేసి, ఎక్కడైనా ఒకఇల్లు కొనుక్కోవాలని ఉంది' అంది ఆమె.

రెండు సంవత్సరాలు గడిచే సరికి వేణునాయకరు కోడంబాకంలో మంచిమేడనే కట్టుకోగలిగేడు. గృహప్రవేశానికి సత్తారు సాహెబును కూడా పిలిచాడు.

ఆ భవనాన్ని చూసి, సాహేబు, 'నేను ఇరవైయేళ్లనుంచీ సీసాల వ్యాపారం చేస్తోన్నా జానెడుకొంప కట్టలేకపోయాను! వేణునాయకరు ఎంతమేడ కట్టేడు!' అని ఆశ్చర్య పోయాడు.

వేణునాయకరు తనకు కావలసిన సీసాలనన్నిటినీ సత్తారువద్దనే కొంటూ వచ్చాడు. సత్తారే వాటిని బండిమీద వేయించుకొని వేణూ ఇంటివద్ద వప్పజెప్పేవాడు.

ఒకనాడు సీసాలను వప్పజెప్పి, సత్తారు వేణూతో,'ఇవేళ వస్తోంటే నాకొక సందేహం కలిగింది నాయకర్!' అన్నాడు.

'ఏమిటి?' అని అడిగేడు వేణూ.

'నీ అరఖు పుచ్చుకున్న ప్రతి స్త్రీకీ మగబిడ్డలే పుట్టి కొన్నియేళ్లకింక ఆడజనాభా తగ్గిపోతుంది. అప్పుడింక ఎలాగ?' అన్నాడు సాహేబు.

'అప్పుడు ఆడపిల్లలంటే గౌరవం మమకారం హెచ్చి కడుపుతోన్న ప్రతిస్త్రీకీ ఆడపిల్లయే పుట్టాలన్న కోరిక కలుగుతుంది! అప్పుడు ఆడపిల్ల పుట్టే అరఖు తయారుచేసి అమ్ముతాను? అన్నాడు వేణూ.'

'ఆ గోసాయిచిట్కా కూడా నీకు తెలుసునన్నమాట.' అన్నాడు సత్తారు.

'చిట్కాకేముంది? రంగు మారుస్తే సరి. గులాబీకి బదులు పసుపురంగో ఆకుపచ్చో చేరుస్తే సరి.' అన్నాడు వేణూ నవ్వుతూ.

సత్తారు విస్తుపోయి 'ఐతే ఇది మందు కాదన్నమాట! ఉత్తి రంగు నీరేనా!...ఇలాగ నువ్వు ప్రజలను మోసంచేస్తే నీమీద ఎవరైనా కేసు పెడతారు సుమా!' అన్నాడు.

'ఇందులో మోసమేముంది సత్తార్? పరిశుభ్రంగా కాచి వడపోసిన నీరు! నేను కలుపుతూన్న రంగు కూడా వంటికి ఏవిధమైన హానీ చెయ్యదు!' అన్నాడు వేణూ.

'హాని చెయ్యకపోయినా, వట్టి నీటిని "మందు"అని చెప్పి, మూడేసి రూపాయలు పుచ్చుకోడం న్యాయమా?' అన్నాడు సత్తారు.

'మగపిల్లవాడు పుట్టనివాళ్ళకి సొమ్ము వాపసు చేస్తున్నాను గనుక వాళ్ళకి నష్టం ఏమీలేదు. మగపిల్లలు పుట్టినవాళ్లకి నామందు పుట్టెడుసంతోషం కలిగించింది గనుక వాళ్ళకీ నష్టంలేదు..... బ్రహ్మదేవుడికి కూడా నామీద కోపంరావలసినపని లేదు.' అన్నాడు వేణూ.

'అంటే?'

'ఆయన ఇష్టానుసారం ఆడపిల్లలు పుట్టవలసినవాళ్ళకి ఆడపిల్లలూ, మగపిల్లలు పుట్టవలసినవాళ్లకి మగపిల్లలూ పుడుతోనే ఉన్నారు. కనుక మగజనాభా హెచ్చుకావటం, ఆడజనాభా తగ్గిపోవటం జరగదు. ఆడపిల్లలు పుట్టినవాళ్ళకి మాత్రమే సొమ్ము వాపసుచేస్తాను. మిగత సొమ్ము నా జీవనానికి చాలు. నా వ్యాపారంమూలాన, నీవ్యాపారం

★ ఇద్దరు మందమతులు ★

గార్డు విజిల్ వూదాడు. ఆయన ఆజ్ఞను శిరసావహించటానికి తయారుగావున్నట్లు, రైలు యింజను 'కూ' అని కూత వేసి, "బుస్సు" మని నిట్టూరుస్తూ, పెద్దవూపిరి వదిలింది.

రైలు బయలుదేరబోతూందని గ్రహించి, పరుగెత్తుకుంటూవచ్చిన పాతికేళ్ల ముస్లిం యువకుడు, ముందుగా కనిపించిన మూడోతరగతి 'కంపార్ట్‌మెంటు'ను అందుకున్నాడు. చేతనున్న చిన్నపెట్టెను కిటికీగుండా ముందువేసి, తర్వాత లోపలికొచ్చాడు.

ఆ కేరేజిలో ఒక్కడా చోటు ఖాళీలేదు. చాలా జనంవున్నారు. ఆఖరికి వున్నవారుగూడా నిలవటానికి చోటులేక, ఒకరిని ఒకరు తోసుకుంటున్నారు.

రెండు నిమిషాల పాటు ఆ దృశ్యాన్నిచూసి, అంత రద్దీలో తను ప్రయాణం చేయవలసి వచ్చినందుకు తన తలరాతను నిందించుకున్నాడు. ఆ సమయంలో, ఆ కొనలోవున్న కిటికీవద్ద కొంత ఖాళీ చోటు వుండడం అతనికి కనిపించింది. తన చేతిపెట్టె తీసుకొని అక్కడికి కెళ్ళి చూశాడు.

ఒక మనిషికి చాలినంత చోటును ఒకమూట ఆక్రమించుకొని వుంది. నిమిషంపాటు ఆలోచించినతర్వాత ఆ మూటను ఎత్తి క్రిందపెట్టి, ఆ చోటులో కూర్చున్నాడు ముస్లిం యువకుడు.

ఇది గమనించిన ప్రక్కమనిషి —"సాబ్! ఈ చోటులోకూర్చున్న ఒకాయన, నన్ను చూస్తూఉండమని చెప్పి బయటికెళ్లాడు. ఇప్పుడే వచ్చేస్తాడనుకుంటాను." అన్నాడు, ముస్లిం యువకుడితో.

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

సి. డి. యస్. రామయ్య

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

"ఒస్తే, రానీ—ఎవరు వచ్చినారు?—" కాస్త కఠినంగానే అన్నాడు ముస్లిం యువడు.

"అదిగాడు...ఆయన కూర్చున్న చోటులో......"అని ప్రక్కమనిషి అంటుండగానే, ముస్లిం యువకుడు అడ్డుపడ్డాడు!

"నువ్వవూరుకోవయ్యా! ఆయన కూర్చున్న చోటని, ఇక్కడేమైనా వ్రాసివుందేమిటి?—ఇంతకీ, ఆయన కూర్చున్న చోటును చూస్తూవుండటానికి, నువ్వేం ఆయన నౌఖరువా?—ఆయనవస్తే నేను మాట్లాడుకుంటాలే"అని మండిపడ్డం గుర్తించిన ప్రక్కమనిషి "సరేలే!— కాస్త తగ్గవయ్యా!—నేను చెప్పవలసింది చెప్పాను. ఆతర్వాత నీ యిష్టం" అంటూ చేతిలోని పత్రిక మీదకు చూపులు త్రిప్పుకున్నాడు!

ఇంతలో అక్కడికి వచ్చిన ఒక ఆసామి ఆముస్లిం యువకుడ్ని చూసి" "మిష్టర్! కాస్త లేస్తారా!"అన్నాడు నెమ్మదిగా. అప్పటికి రైలు బయలుదేరి వెళ్లుతోంది.

ఆ ముస్లిం యువకుడు ఒక్కసారి ఆయనముఖంలోకి చూసి, సన్నగా నవ్వి, "ఎందుకు లేవాలి?"అన్నాడు.

"ఇది నే కూర్చున్న చోటు—నువ్వెలా కూర్చుంటావ్?"

"ఇది నీ సీటని ఒక్కడా రాసిపెట్టలేదుగాని వెళ్ళవయ్యా!"

"రాసిపెట్టాలేమిటి?—నానంచీ వుంచిపోయానుగా!"

"ఉంచిపోతే?— నీ చోటని గుర్తేమిటి?"

"నా చోటులో కూర్చున్నది గాకుండా, బెదిరిస్తావేమిటి?"

"మళ్లీ నీచోటన్నావంటే, నాకు చెడ్డకోపమొస్తుంది సుమా!—నీ చోటని తెలిసినవాడివి, నీ పేరూ వూరూ మొదలైనవి రాసినచీటీ యిక్కడ అంటించిపోడానికి తెలియకపోయిందీ?—ఓహో!—ఉన్న మనుషులు దద్దమ్మలైతే, ఈ కేరేజీ గూడా నీదే అంటావుగాబోలు!—నీ పప్పులేం వుడకవు నా దగ్గర!" అని హేళనగా అన్నాడు ముస్లింయువకుడు. అతడి మాటలకి ఆ ఆసామీకి చెడ్డకోపమొచ్చినా, పోట్లాట అంటేభయం

నీటి మేడ

కూడా బాగుపడింది గనుక నువ్వు కూడా సంతోషించవలసిందే.' అన్నాడు నాయకుడు.

'ఒకేవాడివి కేనూ! నీటితో ముడకట్టేవు!' అని మెచ్చుకున్నాడు నత్తారు. ★

"ఏయ్ రిక్షా"

"అయ్యా"

"బజారులో హోటల్‌కి ఏం తీసుకుంటావు ?"

"వెళ్లడానికి మూడణాలండి తిరిగి తీసుకురావడానికి అరణా లండి"

—యస్. వి. సుబ్బారావు, ఏలూరు.

"అక్బరుకాలంలో ఒకసారి పెద్దతుపాను వచ్చింది. పెద్దపెద్ద బంగళాలు కూలిపొయ్యాయి. తాజ్ మహాల్ మాత్రం కూలిపోలేదు. కారణం?"

"అది పాలరాతితో కట్టబడింది కాబట్టి"

—యస్. నరసింహారావు,
హైదరాబాదు.

గాబోలు, కాస్త కఠినంగా—"ఏమిటోయ్, లేస్తావా! లేవవా ?" అన్నాడు.

ముస్లిం యువకుడు మళ్లీ నవ్వుతూ, హాయిగా కాళ్లు చాచుకొని కూర్చున్నాడు! "నేను లేవకపోతే యేం చేస్తావేం?—పోవయ్యా, నీలాంటి మనుషుల్ని తొంభైఆరు మందిని చూశాను గానీ, నువ్వు చేయదలిచిందేదో చేసుకో!" అన్నాడు.

ఆఖరికి యేమీ చేయడానికి తోచక ఆసామీ ఆ ముస్లిం యువకుని ఒళ్లో కూచోడానికి ప్రయత్నించాడు. అతడు తోసివేశాడు ఆఖరికి తన ప్రయత్నం సాధించుకోలేక పెద్దమనిషి "ఒరేయ్, నెల్లూరు రానీయ్!—నిన్నేం చేస్తానో చూడు. అక్కడ నా తమ్ముడు స్టేషనుమాస్టరుగా వున్నాడు. వాడికి నీసంగతి చెప్పి, నిన్ను పోలీసుల కప్పగించకపోతే..." అంటూ మండిపడసాగాడు.

ఆయనమాటల్ని విని, ఆ ముస్లిం యువకుడు ముఖం చేటంత చేసుకుని గట్టిగా నవ్వాడు. నిమిషంతర్వాత నవ్వును ఆపుకుని "భలేవాడవయ్యా నువ్వు!—ఇది నెల్లూరు వెళ్లదు!—ఇది 'బొంబే మెయిలు!,— 'కలకత్తా మెయిలు' ఎక్కడానికి బదులు, ఈ బండి యెక్కావెందుకూ?" అన్నాడు

ఆసామీ ముఖం పాలిపోయింది: "అయ్యో, రామా!—నాకు ముందే తెలియకపోయిందే!—ఖర్మ; ఖర్మ!." అంటూ నుదురు కొట్టుకున్నాడు.

వీరి సంభాషణ అంతా వింటూ వచ్చిన నేను, ముస్లింయువకుడ్ని చూసి, "భాయ్‌సాహెబ్!—మీ రెక్కడికి పోదలచుకున్నారు?" అని అడిగాను.

"బొంబే!" అని జవాబిచ్చాడతడు.

"అయితే, ఈబండి బొంబాయి మెయిలనుకుని, ప్రయాణమయావన్నమాట!"

"అవును; ఏం?"

"ఈబండి ఆయనగారనుకున్నట్టు కలకత్తా మెయిలూ గాదు; నువ్వనుకున్నట్టు బొంబే మెయిలూ కాదు! ఇది బెంగుళూర్ మెయిలు! తెలుసా!—ఇది బొంబాయి వెళ్లదు!" అన్నాను, గొల్లున వస్తున్న నవ్వును అణచుకుంటూ.


నామాటలు విన్నతర్వాత, ఆ ముస్లిం యువకుడిముఖం - ఆముదం తాగినట్టు, తయారయింది.


"అరె, అల్లా!—బొంబాయి టిక్కెట్టు కొనుక్కుని ఈబండిలో వెళ్ళడం యెందుకు? — తర్వాతి స్టేషన్‌లో దిగేస్తాను!" అంటూ, ముఖం దిం చేసుకున్నాడు. అతడు పరిహసించిన ఆసామీముఖాన్ని మళ్లీ చూడడానికి, అతడికే చాలా సిగ్గేసిందిగాబోలు!

అవును మరి? ఎలా చూస్తాడు?

ఇంతలో మరోస్టేషను చేరింది బండి!

సీటుకోసం పోట్లాడుకున్న ఆ యిద్దరు ఘరానావ్యక్తులూ—మందమతులూ—ఒకరివెనుక ఒకరు ఆ స్టేషన్‌లోదిగారు మాబండి వెళ్లేంత వరకూ, ఆ యిద్దరు మందమతులూ మాకేసిపైపు తిరిగి చూడనైనా, చూడలేదంటే నమ్మండి! ★





దేవునిమీదిభక్తి దేవదేవిమీదికి తిరిగింది
భక్తి, రక్తి, నృత్య, గీతమిశ్రితమైన "విప్రనారాయణ"లో నాగేశ్వరరావు, భానుమతి

★ దేవదాసు, అవ్వయ్యార్ ★

ఉత్తమచిత్రాలుగా మద్రాస్ ఫిలింఫాన్స్ నిర్ణయం

వినోదావారి "దేవదాసు" 1953 వ సంవత్సరపు తెలుగు చిత్రాల్లో ఉత్తమమైనదిగాను, ఎ. నాగేశ్వరరావును ఉత్తమ నటుడుగాను, భానుమతిని ఉత్తమ నటిగానూ మద్రాస్ ఫిలిం ఫాన్స్ అసోసియేషన్‌వారు నిర్ణయించారు. తమిళ సినిమా రంగంలో జెమినీవారి "అవ్వయ్యార్"ను ఉత్తమ చిత్రంగానూ, టి. కె. షణ్ముగంను ఉత్తమ నటుడుగానూ, తెలుగు నటి సావిత్రిని ఉత్తమ నటిగానూ నిర్ణయించారు. మద్రాసు ఆర్థిక, విద్యామంత్రి సి. సుబ్రహ్మణ్యంగారి అధ్యక్షతన జరిపిన ఒక సమావేశంలో పై అసోసియేషన్‌వారు ఆ నిర్ణయాలు ప్రకటించారు.

ఫిలిం ఫాన్స్ అసోసియేషన్‌వారు ఉత్తమ చిత్రాల, నటీనటుల నిర్ణయం చేయడానికి ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీలో డా॥ యు. కృష్ణారావు, ఎ. అరుణాచలం, శ్రీమతి ఇందిరా రామగుర్రై, ఖాసా సుబ్బారావు, ఎస్. పార్థసారథి గార్లున్నారు. వీరు తెలుగులో 5 చిత్రాలను (చంద్రహారం, చండీరాణి, దేవదాసు, పక్కయింటి అమ్మాయి, పరదేశి), తమిళంలో 6 చిత్రాలను (అవ్వయ్యార్, దేవదాసు, జాతకం, మనిదన్, మనంపోల మాంగల్యం, పొన్ని) పరిశీలించారు. ఉత్తమ చిత్రాలను నిర్ణయించడంలో ఫొటోగ్రఫీ, సీనిక్ అరేంజిమెంట్, ఆ చిత్రాలు ప్రజలపై చూపే ప్రభావం, అనే మూడు అంశాలను దృష్టిలో పెట్టుకున్నామని డా॥ యు. కృష్ణరావుగారు తెలిపారు. ఉత్తమ నటీనటులను నిర్ణయించడంలో కూడా తాము నటించే పాత్ర స్వభావంలో నటీనటులు ఎంతవరకూ లీనం కాగలుగుతున్నదీ మొదలైన విషయాలను దృష్టిలో పెట్టుకున్నామని ఆయన అన్నారు. మొత్తంమీద చూస్తే తము పరిశీలించిన చిత్రాలన్నీ చాలా బాగున్నాయనీ, అందుచేత ఒక నిర్ణయానికి రావడం కష్టమైపోయిందని, అసలీ మధ్య వస్తున్న చిత్రాలన్నీ పూర్వపు చిత్రాలకంటె



శ్రీ రాజరాజేశ్వరీవారి "సక్కుబాయి"లో రేలంగి, ఎస్. వరలక్ష్మి

ఉత్తమస్థాయిలో ఉంటున్నాయనీ ఆయన అన్నారు.

మంత్రి సుబ్రహ్మణ్యంగారు మాటాడుతూ, తాను సాధారణంగా సినిమాలు చూడడంలేదు కనుక, ఇటీవలి చిత్రాల్లో అభివృద్ధి కనిపిస్తోందని కృష్ణరావుగారన్న మాటను ఔననిగాని కాదనిగాని అనలేని స్థితిలో వున్నాననీ, అయితే కృష్ణరావుగారు ఆమాట చెప్పినతర్వాత సినిమాలు చూడాలని తనకుకూడా బుద్ధిపుడుతున్నదనీ అన్నారు.

సమావేశ ప్రారంభంలో అసోసియేషన్ అధ్యక్షుడు వి సి గోపాలరత్నంగారు సభికులకు స్వాగతం చెప్పారు కార్యదర్శి ఇ బి శామ్యూల్ నివేదిక సమర్పించారు


బాల చిత్రోత్సవం

ఈ డిసెంబరులో బాల చిత్రోత్సవం ఒకదాన్ని మద్రాసులో ఏర్పాటుచేసి, దానిమీద వచ్చే ధనంలో సగం గాంధీ స్మారక నిధికి విరాళ మివ్వాలని అసోసియేషన్ నిశ్చయించినట్లు కార్యదర్శి తెలియజేశారు

ఈ నిర్ణయాన్ని ప్రశంసిస్తూ, పెద్దల చిత్రాలనుండి పిల్లలను కాపాడవలసిన అవసరం ఉందని మంత్రిగారు అన్నారు పిల్లలకు పనికివచ్చే చిత్రాలు తయారుకాకపోతే వారి మనస్సులు భ్రష్టమై పోతాయనీ, కోట్లకోలది రూపాయలు ఖర్చుచేసి పిల్లలకు ఒకవంక విద్యాబుద్ధులు చెప్పిస్తూ, మరొకవంక ఆ పిల్లలను చెడగొట్టే చిత్రాలను చూడనివ్వడం శోచనీయమనీ ఆయన అన్నారు

శ్రీమతి క్లబ్వాలా జాధవ్ మాట్లాడుతూ, "ఈ దేశంలో బాలల చిత్రాలు తయారుకాకపోవడం విచారకరం జేబు దొంగతనం మొదలైన నేరాలుచేసే పిల్లల్లో నూటికి 75 వంతులమంది పెద్దల చిత్రాలు చూసి నేరాలు నేర్చుకున్నవారే అది నాకు బాగా తెలిసిన విషయం," అన్నారు

సమావేశం అనంతరం బెర్నార్డ్ షా నాటకం ఆధారంగా గేబ్రియల్ పాస్కల్ నిర్మించిన "ఆండ్రొక్లిస్ ఎండ్ ది లయన్" చూపించబడింది



అత్తచేతిలో అష్టకష్టాలు పడుతున్న భక్తమణి
"సక్కూబాయి"లో రేలంగి, ఎస్. వరలక్ష్మి, కన్నాంబ

విజయవాడలో "వినోదా పిక్చర్ పాలెస్"

విజయవాడలో వినోదాపిక్చర్ పాలెస్ అనే పేరుతో రామినేని బుచ్చిబాబుగారు ఒక థియేటర్ (ఇదివరకటి రాజస్థాన్ థియేటర్) స్థాపించారు. నవంబరు 26 వ తేదీన ప్రముఖ నిర్మాత హెచ్. ఎం. రెడ్డిగారు థియేటరుకు ప్రారంభోత్సవం చేశారు. నవ్‌ఇండియా డిస్ట్రిబ్యూషన్ అధినేత సుందరలాల్ నహాతా ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంలో బుచ్చిబాబుగారు సుమారు 500 మంది అతిథులకు అల్పాహారపు విందు చేశారు. వేదాంతం రాఘవయ్య, ఎన్. టి. రామారావు, ఎ. నాగేశ్వరరావు, సముద్రాల రాఘవాచార్యగార్లు ఉపన్యాసాలు చేశారు. వినోదా సంస్థాధిపతి డి. ఎల్ నారాయణగారు, ఇంకా పలువురు మద్రాసు సినిమా ప్రముఖులు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, పౌరప్రముఖులు, ప్రభుత్వాధికారులు సమావేశానికి హాజరయ్యారు

"పల్లెపడుచు" డైరక్టరు బోళ్ల సుబ్బారావు, రచయిత పినిశెట్టి శ్రీరామమూర్తి గార్లు సభికులకు పరిచయం చేయబడ్డారు

శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావుగారు తమ ఆర్కెస్ట్రా బృందంతో సహా వచ్చి మధురగానంతో శ్రోతలను ఆనందం చేశారు. పేకేటి శివరాంగారి వందనసమర్పణతో సభ ముగిసింది.

ఆనాటి సాయంత్రం "పల్లెపడుచు" చిత్రప్రదర్శనతో వినోదాపిక్చర్ పాలెస్ ప్రజలకు తెరువబడింది 11 కేంద్రాల్లో విడుదలైన "పల్లెపడుచు" చిత్రం విజయవంతంగా నడుస్తున్నట్లు వార్తలు తెలుపుతున్నాయి. ★

"అగ్గిరాముడు" శతదినోత్సవాలు

ఈ సంవత్సరం విడుదలైన చిత్రాల్లో బాగా డబ్బు చేసుకున్నవాటిల్లో ఒకటైన పక్షిరాజావారి "అగ్గిరాముడు" ఇటీవల ఏడు కేంద్రాల్లో (బందరు, విజయవాడ, గుంటూరు, తెనాలి, కర్నూలు, బళ్లారి, అనంతపురం) శతదినోత్సవాలు చేసుకొన్నది.

బందరు సరస్వతీ టాకీస్‌లో నవంబరు 24 వ తేదీన శతదినోత్సవ సభ జరిగింది. "అగ్గిరాముడు" డైరక్టరు శ్రీరాములు నాయుడు, ఎన్. టి. రామారావు, రేలంగి, శ్రీమతులు సాయి, సుబ్బుగార్లకు ఈ సందర్భంలో స్వాగత పత్రాలు, వెండిపాత్రలు బహూకరింపబడ్డాయి. హాలువారికి డైరక్టరుగారొక ట్రోఫీ బహూకరించారు.

విజయవాడలో 25 వ తేదీన ఆంధ్ర ఫిలిం వాణిజ్యమండలివారు శ్రీరాములు నాయుడు, రామారావు, రేలంగిగార్ల గౌరవార్థం తేనీటివిందు ఏర్పాటుచేశారు. శ్రీ కామరాజుగారు అతిథులను స్వాగతం చెప్పారు. మండలి అధ్యక్షులు సుందరలాల్ నహతాగారు మండలి ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు తమ కివ్వబడిన స్వాగతానికి అతిథులు కృతజ్ఞత తెలిపారు

"అగ్గిరాముడు" చిత్రాన్ని పక్షిరాజా వారు హిందీలో కూడా నిర్మిస్తున్నారు. ఇందులో దిలీప్‌కుమార్ నటిస్తున్నాడు.

"అన్నదాత"


ఎ నాగేశ్వరరావు, అంజలీదేవి, ఎస్ వి రంగారావు నటించిన "అన్నదాత" ఈ నెల 17 వ తేదీన విడుదల అవుతుందని తెలుస్తోంది చక్రపాణి కథ, వేదాంతం రాఘవయ్యగారి దర్శకత్వం, 'సావిత్రి' అంతర్నాటకం మొదలైన ఆకర్షణలతో కూడిన ఈ చిత్రం విజయవంతంగా నడుస్తుందని పలువురు అంటున్నారు

"సక్కుబాయి"

శ్రీ రాజరాజేశ్వరీ వారి "సక్కుబాయి" ఈ నెల 22 న విడుదలకాగలదని తెలుస్తున్నది కె బి నాగభూషణంగారి దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో సక్కుబాయిగా ఎస్ వరలక్ష్మి, ఆమె భర్తగా రేలంగి, అత్తగా కన్నాంబ, ఆమె భర్తగా సి ఎస్ ఆర్; రోగిగా సూరిబాబు, ఇంకా శివరావు, కనకం వగైరాలు నటించారు ఒకప్పుడు ఇది బాగా పేరుపొందిన భక్తిరసాత్మకమైన నాటకం ఆ నాటకంలోని పాటలు ప్రజలకి ఇంకా చెవుల్లో మారుమోగుతూనే వున్నాయి ఆ పాటల్ని ఆ నాటకాన్ని తిరిగి విని, చూసి ఆనందించడానికి ఇది అపూర్వావకాశం



విజయా వారి "మిస్సమ్మ" షూటింగ్ సందర్భంలో డ్రస్సుమార్చుకోడానికి వెడుతున్న డిటెక్టివ్ ఎ. నాగేశ్వరరావు, కార్యదర్శి బాలకృష్ణ.




జూపిటర్ వారి హిందీచిత్రంలో పాటపాడడానికి ఇటీవల మద్రాసు వచ్చిన ప్లేబాక్ గాయకుడు రఫీతో తెలుగు ప్లేబాక్ గాయకుడు ఘం. నాగేశ్వరరావు. ఫొటోలు : జి. ఎస్. భూషణ్.

కలకత్తాలో ఫిలిం తారల క్రికెట్ ప్రదర్శనం

నవంబరు 21 వ తేదీన బొంబాయిలోని ప్రముఖ సినిమాతారలు పలువురు కలకత్తా వెళ్ళి క్రికెట్ ఆడారు పశ్చిమబెంగాల్ గవర్నరు క్షయానంతర చికిత్సాలయానికి నిధి పోగుచేసేందుకుగాను ఈ క్రికెట్ ప్రదర్శనం జరిపారు దాదాపు 20 వేల మంది ప్రేక్షకులు హాజరయ్యారట. 56 వేల రూ. ల పైగా సొమ్ము వసూలైందట

"భవాని జంక్షన్"

ఎమ్ జి ఎమ్ కంపెనీ వారు నిర్మించ



విజయవాడ వినోదాపిక్చర్ ప్యాలెస్ ప్రారంభోత్సవం శ్రీ హెచ్. ఎమ్. రెడ్డి గారిచే చేయబడింది. అధ్యక్షులు శ్రీ సుందర లాల్ గారు, కవి శ్రీ సముద్రాల వేదికపై ఉన్నారు.


నిశ్చయించిన "భవానీ జంక్షన్" అనే చిత్రానికి ప్రత్యేక సౌకర్యాలివ్వడానికి భారతప్రభుత్వం నిరాకరించడం దేశంలో చాలా వాద ప్రతివాదాలను దారితీసింది. కొందరు భారత ప్రభుత్వచర్యను సమర్థిస్తున్నారు, మరికొందరు విమర్శిస్తున్నారు.

ఈ చిత్రానికి పన్నులు, రవాణా సుంకాలు మినహాయించాలనీ, ఒక రైల్వే స్టేషన్ను ఉపయోగించుకోనివ్వాలని, భారతీయ సైనికులను ఉపయోగించుకోనివ్వాలని ఎమ్. జి. ఎమ్. వారు భారత ప్రభుత్వాన్ని అర్థించారు. కాని ఆ చిత్రం తాలూకు స్క్రిప్టును చదివిన తర్వాత ఏ ప్రత్యేక సౌకర్యాలను ఇవ్వడానికి భారతప్రభుత్వం నిరాకరించింది.

"భవాని జంక్షన్" నవలను జాన్మాస్టర్స్ అనే రచయిత వ్రాశాడు. ఈ నవల 1946-47 ప్రాంతాల్లో భారతదేశంలో జరిగిన చరిత్రాత్మక సంఘటనలను వాతావర

రంగమార్తాండ, రంగ ప్రచండ పి. కె. నాయుడుగారి నిత్యకళ్యాణీ నాట్యమండలి
"అన్నదాత"లో కుటుంబరావు, అంజలిదేవి, నాగేశ్వరరావు, రంగారావు





భరణీవారి "విప్రనారాయణ"లో నాగేశ్వరరావు, భానుమతి, రేలంగి, ఋష్యేంద్రమణి మున్నగువారు




వినోదాపిక్చర్ ప్యాలెస్ ప్రారంభోత్సవ సమయంలో, వేదాంతం రాఘవయ్య, హెచ్. ఎమ్. రెడ్డి, ఎన్. టి. రామారావు, సుందరలాల్ నహాతా, ఎ. నాగేశ్వరరావు, రామినేని

ణంగా పెట్టుకుని, ఆంగ్లో ఇండియన్ల జీవితాన్ని చిత్రించింది. ఈ నవల భారతదేశానికి, ప్రజలకు, నాయకులకు, స్వాతంత్ర్యోద్యమానికి అవమానకరంగా ఉందని, భారతీయులపట్ల ద్వేషం ఇందులో సంపూర్ణంగా కనిపిస్తోందని పలువురు భావించారు. ఈ కారణంచేత ఆ నవలపై చాలా విమర్శలు చెలరేగాయి. దాన్ని ఒక హాలీవుడ్ కంపెనీ చిత్రంగా తీయడానికి పూనుకోవడం, అందులో భారతదేశంలో భారతీయ నటులతో నిర్మించడానికి సంకల్పించడం సహించరానిదని పలువురు అభిప్రాయపడ్డారు. భారతప్రభుత్వం కూడా అదే కారణంచేత ప్రత్యేక సౌకర్యాలివ్వడానికి నిరాకరించింది: కాని ఇతర నిర్మాణ సంస్థలన్నిటికీ ఇచ్చినట్లే "మామూలు సౌకర్యా"లివ్వడానికి తన సుముఖతను వెల్లడించింది.

ఈ చిత్రంలో నటించడానికి ఏ భారతీయ నటుడూ సిద్ధపడడని తన నమ్మకమైనట్లు ప్రముఖనటుడు ప్రేమ్ నాథ్ అన్నాడు.

ఎమ్. జి. ఎమ్ వారు తమ ప్రయత్నాలు విరమించడంలేదనీ, పాకిస్తాన్‌లో ఆ చిత్రాన్ని నిర్మించడానికి వారు ఆలోచిస్తున్నారనీ తెలుస్తోంది. ★

Edited, Printed & Published by
S. Sambhu Prasad at the
Andhra Patrika Press,
7, Thambu Chetty St., Madras



ధవళేశ్వరం ఆనకట్ట

(మెయిన్ స్లూయిస్)

—ఫోటో: శ్రీ రామకృష్ణరావు, బందరు.

ఈ ప్రసిద్ధిగాంచిన క్రీములు మీ చర్మమునకు

సరిగా అనువైనవి

మీ పరిసరాల శీతోష్ణస్థితికీ తగినవి :

అద్భుతమైన యీ రెండు పాండ్స్ సౌందర్య సాధనలు వాడండి. అవి మీ చర్మమునకు సరిగా అనువైనవి. ఈ రెండూ శీతోష్ణస్థితుల బాధల నుండి మీ ముఖమునకు రక్షణ నిచ్చి, మీ చర్మమును నిర్మలముగ మరియు మృదువుగ ఉంచును.



పొడిగాలిగల శీతోష్ణస్థితి మీ ముఖ కాంతిని పాడుచేయు నపుడు — పాండ్స్ కోల్డ్ క్రీమ్ మీకు అవసరము. దానిలో నున్న విశేష నూనెలు చర్మమునకు ఉపశమనము నిచ్చి తీక్షణమైన ఎండ, వడగాడ్పులతో అది వాడిపోకుండా కాపాడును



మీ చర్మము సహజముగ జిడ్డుగాయుంటే లేక వేడి చెమ్మగల గాలిలో జిడ్డుగా అవుతూ ఉంటే — పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ వాడండి. ఎంతో తేలికగా మరియు మంచువలె నున్న ఈ క్రీమ్ రోమరంధ్రాలను అడ్డిన జిగటను, నిర్జీవమైన రక్త కణములను అడ్డము తీసి, మీ ముఖమునకు సౌమ్య రక్షణ నిచ్చును.

పాండ్స్ క్రీమ్‌ను ప్రతిదినము తప్పక వాడండి. కొన్ని రోజులలో మీ చర్మము ఎంతో మనోహరముగ, నవనవలాడేలా ఉండుట మీరు చూడగలరు — అనుభవించగలరు కూడ!



ప్రపంచములో సౌందర్యరాణులు వాడే క్రీములు



పాండ్స్

కోల్డ్ క్రీమ్

వ్యానిషింగ్ క్రీమ్

P 9947